# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - ఆదివారం 29 జూన్ 2025 ‖ సంపుటి: 9 ‖ సంచిక: 182 ‖ పేజీలు:12 ‖ వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## 15 ఏండ్లు దాటితే.. మీ బండికి పెట్రోల్ పోయరు



2

## రా చీఫ్‌గా పరాగ్ జైన్



2

---

రోడ్లన్నీ స్మార్ట్‌నెస్ సంతరించుకుంటున్నయ్..

## దేశపు తొలి డిజిటల్ హైవే ద్వారకా ఎక్స్‌ప్రెస్ రహదారి

ఢిల్లీ-గురుగ్రామ్‌ను కలిపే ఈ రోడ్డు ఏఐ సాయంతో పని చేస్తుంది

రూల్ బ్రేక్ అయిన క్షణమే చలాన్ పడిపోతుంది



**ఢిల్లీ, జూన్ 28:** మన జీవనం డిజిటలీకరణ చెందిన నేపథ్యంలో జాతీయ రహదారులు కూడా తదనుగుణంగా మారుతున్నాయి. ఇవి 'స్మార్ట్ రోడ్స్'గా రూపాంతరం చెందుతున్నాయి. ఢిల్లీ -గురుగ్రామ్ ను కలిపే ద్వారకా ఎక్స్‌ప్రెస్ హైవే పై ఏఐ సాయంతో పనిచేసే అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చారు. దీనితో ఇది దేశపు తొలి డిజిటల్ హైవేగా రికార్డులకెక్కింది. నేషనల్ హైవేస్ అథారిటీ గైడ్ లైన్స్‌కు అనుగుణంగా ఈ ఏటీఎంఎస్ రూపుదిద్దుకుంది. ఇండియన్ హైవేస్ మేనేజ్మెంట్ కంపెనీ లిమిటెడ్ దీన్ని అభివృద్ధి చేసింది. దీన్ని అమలు చేసే బాధ్యత ఎన్హెచ్ఏఐ చూస్తుంది. ద్వారకా ఎక్స్‌ప్రెస్ హైవేతో పాటు ఎన్హెచ్-48పై 28 కిలోమీటర్ల మేర

...మిగతా 2లో

## ఓట్ ఫ్రమ్ హోం

బీహార్‌లో అమలైన పైలట్ ప్రాజెక్ట్

అన్ని ఎన్నికల్లోనూ అమలు చేసేందుకు కేంద్రం ఆమోదం!



2

---



# కొత్త కంపెనీలతో 5 లక్షల ఉద్యోగాలు

## కంచ గచ్చిబౌలిని అభివృద్ధి చేస్తం

- న్యూయార్క్, టోక్యో వంటి నగరాలతో హైదరాబాద్ పోటీ పడుతున్నది
- రైజింగ్ తెలంగాణ-2047 కోసం అందరూ కలిసొస్తున్నరు
- త్రీ లేయర్ తెలంగాణ ఏర్పాటు!
- బీఆర్ఎస్ కబ్జా నుంచి బతుకమ్మ కుంటకు విముక్తి
- నాలుగు నియోజకవర్గాలుగా శేరిలింగంపల్లి
- పిలిస్తే పలికే నాయకుడు పీజేఆర్
- పీజేఆర్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవ సభలో సీఎం రేవంత్ రెడ్డి

### ఆర్థిక సంస్కరణల పితామహుడికి నివాళి



2

**హైదరాబాద్, జూన్ 28:** కంచ గచ్చిబౌలి ప్రాంతంలో కొత్త కంపెనీల ఏర్పాటుతో 5 లక్షల ఉద్యోగాలు వస్తాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఎన్ని ఆటంకాలొచ్చినా ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు.అక్కడి భూముల్లో అభివృద్ధి ఆటంకాలు తాత్కాలికమేనని, పీజేఆర్ ఫ్లైఓవర్ ను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించిన సీఎం పలు అంశాలతో పాటు పీజేఆర్‌ను ప్రశంసించారు. 'హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చేందుకు పి.జనార్ధన్ రెడ్డి (పీజేఆర్) చేసిన కృషి మరువలేనిది. ఆయన పోరాటాల వల్లే హైదరాబాద్ కు కృష్ణా, గోదావరి జలాలు వచ్చాయి. ఎప్పుడు పిలిచినా పలికే పేదల నాయకుడిగా ఎంతో గొప్ప పేరు సంపాదించారు. హైదరాబాద్ దోమలగూడలోని పీజేఆర్ ఇల్లు ఒక జనతా గ్యారేజీగా కనిపించేది. పీజేఆర్ కృషితోనే హైటెక్ సిటీ గచ్చిబౌలికి మంజూరైంది. హైటెక్ సిటీకి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి

...మిగతా 2లో

### ఫ్యూచర్ సిటీ భూసేకరణ సత్వరమే పూర్తి చేయాలె

2

---

## అధ్యక్ష ఎన్నికకు అంతా సిద్ధం

- చివరి దశకు బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ
- రెండు తెలుగు రాష్ట్రాలకు ఒకేసారి కొత్త అధ్యక్షులు
- తెలంగాణ అధ్యక్ష ఎన్నికకు నేడు నోటిఫికేషన్
- ఇప్పటికే ప్రారంభమైన ఏపీ అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ

**హైదరాబాద్, మనం ప్రతినిధిః** బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ వేగవంతమైంది. తెలుగు రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణలకు నూతన అధ్యక్షులను ఎన్నుకునేందుకు పార్టీ అధిష్ఠానం కసరత్తు ముమ్మరం చేసింది. రెండు రాష్ట్రాలకు దాదాపు ఒకే సమయంలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, జులై 1న నూతన సారథులను ప్రకటించేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు పార్టీ వర్గాలు ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించాయి. తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక కోసం నేడు (ఆదివారం, జూన్ 29) నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. రేపు(సోమవారం జూన్ 30) అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. అనంతరం

...మిగతా 2లో

---

## న్యూస్ యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య

- తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర
- తల్లిదండ్రులు శంకర్, శ్రీదేవి కూడా ఉద్యమకారులే
- వివరాలు వెల్లడించిన ఇన్‌స్పెక్టర్ రాజునాయక్



2

## 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్, జూన్ 28:** రాష్ట్ర ఆరోగ్యశాఖలో మరోసారి భారీగా ఉద్యోగాల భర్తీ జరుగనున్నది. ఈ మేరకు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. రెండు రోజుల క్రితమే డెంటల్ అసిస్టెంట్ సర్జన్, స్పీచ్ థెరపిస్ట్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. ఇప్పుడీ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో గడిచిన 17 నెలల్లో 8 వేలకుపైగా పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసింది. మరో 2,322 నర్సింగ్ ఆఫీసర్లు, 732 ఫార్మసిస్ట్, 1,284 ల్యాబ్ టెక్నీషియన్, 1,931 మల్టీపర్పస్ ఫీమేల్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది.

## డీఎస్పీల బదిలీలు

44 మందికి స్థానచలనం ● సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలోనూ మార్పులు

**హైదరాబాద్, మనం ప్రతినిధిః** తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖలో భారీగా బదిలీలు చోటు చేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 44 మంది డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) స్థాయి అధికారులను బదిలీ చేస్తూ డీజీపీ జితేందర్ శనివారం నాడు ఉత్తర్వులు

...మిగతా 2లో

## క్రమశిక్షణ కమిటీ ముందు హాజరైన కొండా మురళి



**హైదరాబాద్, జూన్ 28:** గాంధీభవన్లో పీసీసీ క్రమశిక్షణ కమిటీ ముందు కాంగ్రెస్ నేత కొండా మురళి హాజరయ్యారు. గాంధీభవన్కు పెద్దసంఖ్యలో కార్యకర్తలతో వచ్చిన ఆయన క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి ముందు వివరణ ఇచ్చారు. కొండా మురళి వ్యాఖ్యలపై ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మురళి ఆరు పేజీల లేఖను క్రమశిక్షణ కమిటీకి అందించారు.

## తెరపైకి కవిత పీఏ పేరు

- ఫోన్ ట్యాపింగ్ నిందితుడు ప్రణీత్ రావు ఫోన్‌లో కీలక ఆడియో
- సిట్ నోటీసులు జారీ
- మరికొందరు బీఆర్ఎస్ నేతలకూ సమన్లు

**హైదరాబాద్, మనం ప్రతినిధిః** తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర సంచలనం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో భాగంగా ఎమ్మెల్సీ కవిత వ్యక్తిగత సహాయకుడు (పీఏ)కి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాజాగా నోటీసులు జారీ చేసింది. కేసులో ప్రధాన

...మిగతా 2లో

---



### అడ్లూరికి త్రుటిలో తప్పిన ప్రమాదం

**కరీంనగర్, జూన్ 28:** మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం మారుతీ నగర్ వద్ద జాతీయ రహదారిపై ఆయన ప్రయాణిస్తున్న కారును మరో కారు ఢీకొట్టింది. దీంతో మంత్రి కారు టైరు ఊడిపోయింది. ప్రమాదం నుంచి అడ్లూరి లక్ష్మణ్ సురక్షితంగా బయటపడగా.. కారు స్వల్పంగా దెబ్బతింది. ప్రమాదం తర్వాత ఆయన మరో కారులో ఇంటికి వెళ్లిపోయారు.

## ఎన్నిసార్లు ప్రారంభిస్తరు?

- అది పసుపు బోర్డేనా?..
- అమిత్ షాకు విషయం చెప్పకుండా తీసుకొస్తున్నరేమో
- పసుపునకు మద్దతు ధర ప్రకటించాలే?
- నాడు.. కాంగ్రెస్‌ని నిలబెట్టిందే మహిళలు నేడు.. ఆ పార్టీ నేతలే మహిళలను అవమానిస్తుండ్రు? : ఎమ్మెల్సీ కవిత

2

## క్యాష్ టెల్లర్ పోస్టాఫీసులు

- 'ఐటీ 2.0' టెక్నాలజీతో ఆధునీకరణ
- ఆగస్టు నుంచి యూపీఐ చెల్లింపులు
- మైసూరు బాగల్‌కోట్‌లో పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం



2

---

అహ్మదాబాద్ విమాన ప్రమాదం..

# డీఎన్ఏ పరీక్షలు పూర్తి..

### మృతుల సంఖ్య 260 యుగంధర్‌కు 'ఎక్స్' సెక్యూరిటీ





**అహ్మదాబాద్, జూన్ 28:** అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి సంబంధించిన మృతదేహాల గుర్తింపు ప్రక్రియ పూర్తయ్యింది. ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్యను 260గా తేల్చారు. విమానంలోని 241 మంది సహా మొత్తం 270 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తొలుత అంచనా వేసినప్పటికీ.. చివరకు 260గా నిర్ధారించారు.జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా

...మిగతా 2లో

---

అమెరికా డ్రీమ్‌కు దగ్గరి దారి ఓ1 వీసా..

# ప్రతిభ ఉంటే చాలు.. వీసా రాదన్న భయమే లేదు

## కాకపోతే దీని ధర భరించాలె..





**హైదరాబాద్, జూన్ 28:** డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక అనుసరిస్తున్న విధానాల వల్ల అమెరికా వెళ్లాలనుకున్న ఆశావహులకు నిరాశే ఎదురైంది. అలాంటి వారికి వెలుగు రేఖలా కనిపిస్తోంది ఒక వీసా.. అదే ఓ 1 వీసా. మరీ ముఖ్యంగా అమెరికా వెళ్లాలనుకునే వృత్తి నిపుణులను ఈ మధ్య తెగ ఆకర్షిస్తోన్న వీసా ఇది. ముఖ్యంగా హెచ్-1బీకి ప్రత్యామ్నాయ వీసాగా అందుబాటులోకి వచ్చి. ఓ 1 కోసం భారతీయులు శక్తికొద్దీ ప్రయత్నిస్తున్నారు. నేపథ్యంలో ఈ వీసా గురించి స్థూలంగా వివరాలు తెలుసుకుందాం.

**అసాధారణ ప్రతిభ ఉంటే..**

యూఎస్ ఇమిగ్రేషన్ యాక్ట్ 1990 కింద ఈ ఓ-1 వీసాను ప్రవేశపెట్టారు. సైన్స్, టెక్నాలజీ, విద్య, వ్యాపారం, అథ్లెటిక్స్ (-1ఎ), ఆర్ట్స్ అండ్ ఫిల్మ్, అసాధారణ ప్రతిభ కలిగిన వారికి, అద్భుత విజయాలు సాధించినవారికి ఈ వీసాలను మంజూరుచేస్తారు. అవార్డులు, స్కాలర్లీ పబ్లికేషన్లు పొందడం లేదా ప్రతిష్ఠాత్మక సంస్థల్లో సభ్యత్వం కలిగిఉండటం, మీడియా కవరేజీ వంటి వాటిని ప్రమాణాలుగా నిర్ధారించారు. ఈ ప్రమాణాలున్న వారికి ఓ 1 వీసా మంజూర్ చేస్తారు.

**రాదన్న భయమే లేదు..**

పలు కారణాల వల్ల ఈ వీసా రాదన్న భయం ఉండదు. ఏటా దరఖాస్తుదారుల్లో

...మిగతా 2లో

# దేశపు తొలి డిజిటల్ హైవే ద్వారకా ఎక్స్‌ప్రెస్ రహదారి

(మొదటి పేజీ తరువాయి)

అత్యాధునిక నిఘా వ్యవస్థను జోడించారు. మొత్తంగా 56.46 కిలోమీటర్ల మేర రహదారిపై ఈ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. తద్వారా దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత స్మార్ట్ ట్రాఫిక్ సిస్టమ్ కలిగిన డిజిటల్ హైవేగా ఈ రహదారి గుర్తింపు పొందింది. ట్రాఫిక్ మానిటరింగ్, ప్రమాదాల గుర్తింపు ఈ వ్యవస్థ ప్రత్యేకతలు.

**రూల్స్‌ను బ్రేక్స్‌ను నిశితంగా పట్టేస్తయ్..**

ఈ రహదారిపై సీటు బెల్టు ధరించకుండా ప్రయాణిస్తే అత్యాధునిక కెమెరాలు ఠక్కున పట్టేస్తాయి. ట్రిపుల్ రైడింగ్, పరిమితికి మించిన వేగం వంటి 14 రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలను ఈ ఏటీఎంఎస్ వ్యవస్థ పసిగడుతుంది. ఈ అత్యాధునిక వ్యవస్థకు ౹ాఇఇ ఇ-చలాన్ పోర్టల్ కూడా అనుసంధానమై ఉంటుంది. ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత పోలీసు అధికారులకు ఆ సమాచారం చేరవేస్తుంది. దీనికోసం ఈ రహదారిపై కిలోమీటర్ కొకటి చొప్పున మొత్తం 110 హై రిజల్యూషన్ పీటీజడ్ కెమెరాలను అమర్చారు. ఇవి 24 గంటలూ రహదారిపై నిఘా ఉంచుతాయి. ఏటీఎంస్ అనేది ఐదు రకాల వ్యవస్థలు ఉంటాయి. ట్రాఫిక్ మానిటరింగ్, ప్రమాదాల వీడియోల చిత్రీకరణ, వాహన వేగం, వివిధ సందేశాలతో కూడిన సైన్ బోర్డులు, సెంట్రల్ కంట్రోల్ రూమ్ వంటివి ఇందులో ఇమిడి ఉంటాయి.

ఇందులోని కమాండ్ సెంటర్ అనేది డిజిటల్ బ్రెయిన్ గా వ్యవహరిస్తుంది. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే స్థానిక, జాతీయ రహదారి సిబ్బందికి సమాచారం అందిస్తుంది. దట్టమైన పొగమంచు ఏర్పడడం, రహదారిపై అడ్డంకులు ఏర్పడినప్పుడు, రహదారులపైకి జంతువుల ప్రవేశించినప్పుడు సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేస్తుంది.

ద్వారకా ఎక్స్‌ప్రెస్ హైవేపై అమలు చేసిన ఈ ఆటోమేటెడ్ వ్యవస్థను దేశవ్యాప్తంగా అన్ని జాతీయ రహదారులపై అమలు చేయాలని కేంద్రం ప్రయత్నాలు మొదలుపెట్టింది.

# డీఎన్‌ఏ పరీక్షలు పూర్తి..

(మొదటి పేజీ తరువాయి)

విమానం టేకాఫ్ తీసుకున్న కాసేపటికే ఓ వైద్యకళాశాల వసతిగృహంపై కూలిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో విమానంలో ఒకరు మినహా మిగతా 241 మంది ప్రాణాలు కోల్పోయారు. ఘటనాస్థలంలో ఉన్న పలువురూ మృతి చెందారు. శరీరాలు గుర్తుపట్టరాని విధంగా మారడంతో.. అధికారులు డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహించారు. దాదాపు రెండు వారాల తర్వాత ఈ ప్రక్రియ పూర్తయింది. 'విమాన ప్రమాదానికి సంబంధించి ఆఖరి మృతదేహానికి డీఎన్‌ఏ మ్యాచింగ్ పూర్తయ్యింది. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించాం' అని అహ్మదాబాద్ సివిల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.రాకేశ్ జోషి తెలిపారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య 260కి చేరినట్లు వైమానికి సంస్థ అధికారులు వెల్లడించారు. మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు చెప్పారు. గాయాలపాలైన మరో ముగ్గురు ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని చెప్పారు. వాస్తవానికి ఈ నెల 23 నాటికే 259 మంది మృతదేహాలను అధికారులు గుర్తించారు. 241 మంది విమాన ప్రయాణికుల మృతదేహాల్లో ఒకదాన్ని డీఎన్‌ఏ మ్యాచింగ్ కోసం పెండింగ్లో ఉంచారు. శుక్రవారం ఆఖరి మృతదేహం గుర్తింపును నిర్ధరించినట్లు తెలిపారు. 260 మంది మృతుల్లో 200 మంది భారతీయులు, 52 మంది బ్రిటిష్ పౌరులు, ఏడుగురు పోర్చుగల్ జాతీయులు, ఒకరు కెనడియన్ ఉన్నట్లు చెప్పారు.

**యుగంధర్‌కు ఎక్స్ కేటగిరీ సెక్యూరిటీ**

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై పత్యేక బృందం దర్యాప్తు కొనసాగుతోంది. ఈ బృందానికి నేతృత్వం వహిస్తోన్న ఏఏఐబీ డైరెక్టర్ జనరల్ జీవీజీ యుగంధర్ కు థ్రెట్ ఉందని అంచనాకు రావడంతో కేంద్రం ఆయనకు భద్రతను పెంచింది. ఇక నుంచి ఆయనకు 'ఎక్స్' కేటగిరీ భద్రత కల్పిస్తున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వర్గాలు శనివారం వెల్లడించాయి. దీని ప్రకారం.. ఆయనకు సీఆర్పీఎఫ్ కమాండోలతో రక్షణ కల్పిస్తున్నారు.

## 15 ఏండ్లు దాటితే.. మీ బండికి పెట్రోల్ పోయరు

ఢిల్లీ, జూన్ 28: మీ బండి వయస్సు 15 ఏండ్లు దాటితే దానికి పెట్రోల్, డీజిల్ అస్సలు పోయరు. కాలుష్య కాసారంగా మారిన దేశ రాజధాని ఢిల్లీలో జులై 1 నుంచి ఈ విధానం అమలు ఆరంభమవుతుంది.

## 'రా' చీఫ్‌గా పరాగ్ జైన్

ఢిల్లీ, జూన్ 28: భారత విదేశీ గూఢచార సంస్థ రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ చీఫ్ గా పంజాబ్ క్యాడర్ ఐపీఎస్ అధికారి పరాగ్ జైన్ నియమితులయ్యారు. 1989 పంజాబ్ కేడరు కు చెందిన ఆయన.. జులై 1న ఈ బాధ్యతలు చేపట్టనున్నారు. రెండేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. నిఘా విభాగంలో 'సూపర్ డిటెక్టివ్'గా పేరున్న పరాగ్ జైన్ ఎన్నో కీలక ఆపరేషన్లకు నేతృత్వం వహించారు. ఇటీవల భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ లోనూ కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. పీవోకేతోపాటు పాకిస్తాన్ లో అనేక ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసేందుకు కొన్ని నిమిషాలే పట్టినప్పటికీ.. ఈ కచ్చితమైన లక్ష్యాలను సాధించేందుకు మన నిఘా విభాగం కొన్నేళ్ల పాటు గ్రౌండ్వర్క్ చేసింది. ఇందులో జైన్ ప్రముఖ పాత్ర పోషించినట్లు తెలిసింది. 2021లో పంజాబ్లో డీజీపీ ర్యాంక్ పొందిన జైన్.. డిప్యుటేషన్ పై కేంద్ర సర్వీసుల్లోకి పోయారు.

# క్యాష్ టెల్లర్ పోస్టాఫీసులు

హైదరాబాద్, మనం ప్రతినిధి: దేశవ్యాప్తంగా పోస్టాఫీసుల్లో నగదు చెల్లింపుల విధానానికి స్వస్తి పలికి, డిజిటల్ లావాదేవీలకు మార్గం సుగమం అవుతోంది. 2025 ఆగస్టు నాటికి భారతదేశంలోని అన్ని తపాలా కార్యాలయాల్లో యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్) ఆధారిత చెల్లింపులను ప్రవేశపెట్టేందుకు తపాలా శాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ ఆధునిక మార్పుతో వినియోగదారులు పోస్టల్ సేవలకు సులభంగా, సురక్షితంగా క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు చేయవచ్చు. పోస్టాఫీసుల్లో ప్రస్తుతం ఉన్న సాంకేతిక వ్యవస్థకు యూపీఐతో అనుసంధానం లేదు. ఈ సమస్యను అధిగమించేందుకు తపాలా శాఖ తమ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) వ్యవస్థను 'ఐటీ 2.0' పేరుతో అప్‌గ్రేడ్ చేస్తోంది. ఈ కొత్త టెక్నాలజీ ద్వారా ప్రతి లావాదేవీకి ప్రత్యేకంగా ఒక 'డైనమిక్ క్యూఆర్ కోడ్' జనరేట్ అవుతుంది. వినియోగదారులు తమ స్మార్ట్ ఫోన్‌లతో ఈ కోడ్‌ను స్కాన్ చేసి, ఎలాంటి ఇబ్బంది లేకుండా చెల్లింపులు పూర్తిచేయవచ్చు. అయితే, ఈ నూతన విధానాన్ని అమలు చేయడానికి ముందు, కర్ణాటకలోని మైసూరు, బాగల్కోట్ హెడ్ పోస్టాఫీసులతో పాటు పలు చిన్న కార్యాలయాల్లో పైలట్ ప్రాజెక్టును విజయవంతంగా నిర్వహించారు. ఈ ప్రయోగంలో భాగంగా మెయిల్ ప్రొడక్టుల బుకింగ్ కోసం క్యూఆర్ కోడ్ చెల్లింపులను విజయవంతంగా పరీక్షించారు. ఈ ఫలితాల ఆధారంగా రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా అన్ని పోస్టాఫీసుల్లో ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తేనున్నారు. గతంలో స్టాటిక్ క్యూఆర్ కోడ్లను ఉపయోగించి డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు తపాలా శాఖ ప్రయత్నించింది. అయితే, సాంకేతిక సమస్యలు తలెత్తడం, వినియోగదారుల నుంచి అధిక సంఖ్యలో ఫిర్యాదులు రావడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. పాత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకున్న శాఖ, ఇప్పుడు మరింత సురక్షితమైన, నమ్మకమైన డైనమిక్ క్యూఆర్ కోడ్ విధానాన్ని ఎంచుకుంది. ప్రతి లావాదేవీకి కొత్త కోడ్ జనరేట్ అవ్వడం వల్ల మోసాలకు ఆస్కారం చాలా తక్కువగా ఉంటుంది. ఈ చొరవతో ప్రతిరోజూ పోస్టాఫీసులను సందర్శించే లక్షలాది మందికి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. పోస్టేజ్, పార్శిల్ సేవలతో పాటు పొదుపు పథకాల డిపాజిట్ల కోసం కూడా డిజిటల్ పద్ధతిలో సులభంగా చెల్లించవచ్చు. కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న 'నగదు రహిత భారత్' లక్ష్య సాధనలో ఈ అడుగు ఒక మైలురాయిగా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ప్రతిభ ఉంటే చాలు.. వీసా రాదన్న భయమే లేదు

(మొదటి పేజీ తరువాయి)

93 శాతం మందికి వీసాలు మంజూరుచేస్తుంటారు. అదే హెచ్-1బీ అయితే ఆమోదిత రేటు కేవలం 37 శాతమే. ఓ-1 వీసాను తొలుత మూడేళ్ల కాలపరిమితితో జారీ చేస్తారు. ఆ తర్వాత ఎన్నిసార్లయినా పొడిగించుకోవచ్చు. దీన్ని 'లాటరీ లేని హెచ్-1బీ వీసా'గా అభివర్ణిస్తారు.

**దీని ధర కాస్త ఎక్కువే..**

అమెరికా విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం.. ఏటా ఈ వీసాల జారీ సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. 2020 ఆర్థిక సంవత్సరంలో 8,838 ఓ-1 వీసాలను జారీ చేయగా.. 2023 ఆర్థిక సంవత్సరంలో ఆ సంఖ్య 18,994కు పెరిగింది. అయితే, దీని దరఖాస్తు రుసుము మాత్రం 10వేల డాలర్ల నుంచి 30వేల డాలర్లుగా ఉంది. సాధారణంగా హెచ్-1బీ దరఖాస్తుకు అయ్యే ఖర్చు 970 డాలర్ల నుంచి 7,775 డాలర్లుగా ఉంటుంది. ఈ వీసాలను అత్యధికంగా పొందుతున్న వారిలో బ్రిటన్, బ్రెజిల్ తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. 2020లో 487 మంది భారతీయులకు ఓ-1 వీసా రాగా.. 2023 నాటికి ఆ సంఖ్య 1418కి పెరిగింది

**టెక్ దిగ్గజాలకు దగ్గరి దారి ఓ1..**

ప్రస్తుతం హెచ్-1బీ వీసాను పొందడం కష్టతరమవుతున్న సమయంలో భారత సైబర్ నిపుణులు, ఏఐ రీసెర్చర్లు, అథ్లెట్లు, డిజిటల్ కంటెంట్ క్రియేటర్లు ఈ ఓ-1 వీసాను అమెరికాకు వెళ్లేందుకు దగ్గరి దారిగా భావిస్తున్నారు. అటు గూగుల్, టెస్లా, ఓపెన్ ఏఐ వంటి దిగ్గజ సంస్థలు కూడా ఓ-1 వీసా రూట్లో నియామకాలు చేపట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. హార్వర్డ్, కొలంబియా వంటి విశ్వవిద్యాలయాల్లో ఫ్యాకల్టీ, రీసెర్చర్ల కోసం ఓ-1 వీసాతో నైపుణ్యం గల వారిని నియమించుకుంటున్నారు. లాటరీ సమస్య లేకపోవడం, వీసా జారీ రేటు అత్యధికంగా ఉండటంతో భారత వృత్తి నిపుణులు ఎక్కువగా ఈ వీసాను ఆశ్రయిస్తున్నారు. మీరు కూడా అమెరికా వెళ్లాలనుకుంటే ఓ1 వీసాకు అప్లై చేసుకోండి. సత్వరమే వీసా చేతికి వస్తుంది.. మీ డాలర్ డ్రీమ్‌ను తీరుస్తుంది.

# తెరపైకి కవిత పీఏ పేరు

(మొదటి పేజీ తరువాయి)

నిందితుడిగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు ఫోన్‌లో కవిత పీఏకు సంబంధించిన కొన్ని ఆడియో రికార్డింగులను అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో పూర్తి వివరాలు రాబట్టేందుకు సిట్ ఆయనను విచారణకు పిలిచింది. ఫోన్ ట్యాపింగ్ కేసుపై దర్యాప్తును ముమ్మరం చేసిన సిట్ అధికారులు, ఇప్పటివరకు మొత్తం 618 మంది ఫోన్లను ట్యాప్ చేసినట్లు తేల్చారు. వీరిలో ఇప్పటికే 228 మంది బాధితుల వాంగ్మూలాలను నమోదు చేశారు. పలువురు వీఐపీల నుంచి కూడా కీలక సమాచారం సేకరించినట్లు తెలిసింది. ప్రణీత్ రావును విచారించినప్పుడు లభించిన ఆధారాల మేరకు దర్యాప్తు పరిధిని మరింత విస్తరిస్తున్నారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ కవిత పీఏతో పాటు మరికొందరు బీఆర్ఎస్ నేతలకు సైతం సిట్ అధికారులు నోటీసులు పంపినట్లు సమాచారం. ఈ పరిణామంతో బీఆర్ఎస్ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. సిట్ విచారణలో ఇంకా ఎవరెవరి పేర్లు బయటకు వస్తాయోనని రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది.

## అధ్యక్ష ఎన్నికకు అంతా సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

జులై 1న ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తారు.

**ఏపీలోనూ మొదలైన ప్రక్రియ..**

ఆంధ్రప్రదేశ్‌లోనూ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. కేవలం మూడు రోజుల్లోనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని పార్టీ అధిష్ఠానం ఆదేశించింది. ఈ వివరాలను పార్టీ రాష్ట్ర ఎన్నికల అధికారి, రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ విజయవాడలో మీడియా సమావేశంలో వెల్లడించారు. జూన్ 30న నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, అదే రోజు సాయంత్రంలోపు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని తెలిపారు. జులై 1వ తేదీ నాటికి పార్టీ నూతన అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు.

## డీఎస్పీల బదిలీలు..

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఈ బదిలీలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా పలువురు అధికారులకు కీలక పోస్టింగులు కేటాయించారు. బదిలీ అయిన వారిలో వై. నాగేశ్వరరావును సైబరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) ఏసీపీగా నియమించారు. అదేవిధంగా, ఆకుల చంద్రశేఖర్‌కు మహేశ్వరం ట్రాఫిక్ ఏసీపీగా, సంపత్ కుమార్‌కు రాచకొండ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏసీపీగా బాధ్యతలు అప్పగించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, కమిషనరేట్ల పరిధిలో పనిచేస్తున్న డీఎస్పీలకు స్థానచలనం కల్పిస్తూ ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

# న్యూస్ యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య

హైదరాబాద్, జూన్ 28 : న్యూస్ యాంకర్ స్వేచ్ఛ (40) శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నారు. చిక్కడపల్లిలోని తన నివాసంలో ఆమె బలవన్మరణానికి పాల్పడ్డారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ వెల్లడించిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్‌లోని తన ఇంట్లో రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో ఆమె బలవన్మరణానికి పాల్పడ్డారు. ఉరేసుకుని ప్రాణాలు విడిచినట్లు పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.

**ఐదేండ్ల క్రితం విడాకులు..**

భర్త నుంచి ఐదేళ్ల క్రితం విడాకులు తీసుకున్న స్వేచ్ఛ, తన కుమార్తెతో కలిసి ఉంటున్నారు. అలాగే స్నేహితుడు పూర్ణ చంద్ర రావు కూడా ఆ కుటుంబంతోనే ఉంటున్నాడు. ఆ స్నేహితుడితో ఏర్పడిన వ్యక్తిగత విభేదాల కారణంగానే ఆమె మనస్తాపం చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. స్వేచ్ఛ తల్లి శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**రాంనగర్‌లో స్వేచ్ఛ తల్లిదండ్రులు..**

స్వేచ్ఛ తల్లిదండ్రులు రాంనగర్‌లో నివసిస్తున్నారు. ఆమె తండ్రి శంకర్, ఉమ్మడి ఏపీలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. తల్లి



శ్రీదేవి చైతన్య మహిళా సంఘంలో పనిచేస్తున్నారు. ఇటీవలే జరిగిన జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ఎన్నికల్లో స్వేచ్ఛ ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఈసీ) సభ్యురాలిగా ఎన్నికయ్యారు. యాంకర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న స్వేచ్ఛ.. ఆకస్మిక మరణంపై తోటి జర్నలిస్టులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు.

**స్వేచ్ఛ మరణం విషాదకరం : కేసీఆర్**

తెలంగాణ ఉద్యమ జర్నలిస్టు స్వేచ్ఛ మరణంపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు. సామాజిక స్పృహ ఉన్న కవయిత్రి, జర్నలిస్టుగా ఎదుగుతున్న స్వేచ్ఛ మరణం విషాదకరమన్నారు. ఆమె ఆకస్మిక మరణంపై కేసీఆర్ విచారం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో స్వేచ్ఛ తల్లిదండ్రులు సహచర శంకర్, శ్రీదేవి చురుకుగా పాల్గొన్నారని, బిడ్డను కోల్పోయి శోకతప్త హదయులైన వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**ప్రతిభ కలిగిన మహిళా మేధావి : కేటీఆర్**

సీనియర్ మహిళా జర్నలిస్ట్, టీవీ యాంకర్ స్వేచ్ఛ అకాల మరణంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ ఒక ప్రతిభ కలిగిన మహిళా మేధావిని కోల్పోయిందని పేర్కొన్నారు. ఈ విషాద సమయంలో స్వేచ్ఛ కుటుంబ సభ్యులకు, ముఖ్యంగా ఆమె కుమార్తెకు, తల్లికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

**హరీశ్ రావు సంతాపం ..**

జర్నలిస్టు, తెలంగాణ వాది స్వేచ్ఛ అకాల మరణం ఎంతో బాధాకరం అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఈ బాధను తట్టుకునే ధైర్యాన్ని ఆమె కుటుంబానికి దేవుడు ప్రసాదించాలని, స్వేచ్ఛ ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తున్నాను అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

**స్వేచ్ఛ మరణం కలచివేసింది : కవిత**

తెలంగాణ ఉద్యమ జర్నలిస్ట్, న్యూస్ ప్రెజెంటర్ స్వేచ్ఛ అకాల మరణం తనను కలచివేసిందని తెలంగాణ జాగతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని వేడుకుంటునాన్నని, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఓట్ ఫ్రమ్ హోం

బీహార్, జూన్ 28: టెక్నాలజీ విరివిగా అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియలో కూడా సంస్కరణలు తీసుకువస్తున్న ఎన్నికల సంఘం వర్కింగ్ ఫ్రమ్ హోం లాగా ఓట్ ఫ్రమ్ హోమ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఆన్ లైన్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించింది. ఇందుకోసం ప్రత్యేకంగా మొబైల్ యాప్ ను అందుబాటులోకి తీసుకువచ్చింది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా బీహార్లో ఆరు మున్సిపల్ కౌన్సిళ్లకు జరిగిన ఎన్నికల్లో దీన్ని అమలు చేశారు. పోలింగ్ బూత్ లకు చేరుకోలేని వయోవృద్ధులు, వికలాంగులు, గర్భిణులు, వలస కార్మికులతో పాటు ఇతరుల కోసం ఈ సాంకేతికతను అందుబాటులోకి తెచ్చినట్లు బీహార్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దీపక్ ప్రసాద్ వెల్లడించారు. ఈ పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే రానున్న రోజుల్లో ప్రజాస్వామ్య ప్రక్రియలో మరో కీలక మైలురాయిగా నిలువనుంది.

**యాప్ ద్వారా ఓటేస్తరు..**

- ఈ-ఓటింగ్లో పాల్గొనాలనుకునే వారికోసం యాప్ ను బిహార్ ఎన్నికల సంఘం రూపొందించింది.
- ఓటర్ ఐడీ, ఫోన్ నంబర్ సాయంతో ముందుగా ఇందులో రిజిస్టర్ చేసుకోవాలి.
- పోలింగ్ రోజున నిర్దేశించిన సమయంలో ఎప్పుడైనా ఈ యాప్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చు.
- సీ-డాక్ అభివృద్ధి చేసిన ఈ యాప్ ప్రస్తుతం యాండ్రాయిడ్ యూజర్లకు మాత్రమే అందుబాటులో ఉంది.
- ఒక మొబైల్ ఫోన్ నుంచి గరిష్ఠంగా ఇద్దరు నమోదిత ఈ-ఓటర్లు మాత్రమే ఓటు వేసే వీలుంటుంది.
- ప్రతి ఓటు కూడా సంబంధిత ఓటరు గుర్తింపు కార్డు వివరాలతో నిర్ధరణ చేసుకున్న తర్వాతే రికార్డు అవుతుంది.
- బ్లాక్‌చైన్ టెక్నాలజీ సాయంతో దీన్ని రూపొందించారు. అత్యంత సురక్షిత పద్ధతిలో ఓట్లను రికార్డు చేయడంతోపాటు స్టోర్ చేసే వీలుంది.
- ఫేస్ రికగ్నిషన్, మ్యాచింగ్.. దీని సాయంతో లాగిన్, ఓటింగ్ సమయంలో ఓటర్లను ధ్రువీకరించుకునేలా దీన్ని అభివృద్ధి చేశారు.
- డిజిటల్ స్కానింగ్-ఓసీఆర్ (ఆప్టికల్ క్యారెక్టర్ రికగ్నిషన్).. ఓట్లను కచ్చితంగా లెక్కించడంలో సాయపడుతుంది.
- ఆడిట్ ట్రయల్స్.. ఈవీఎంలలో వీవీప్యాట్ మాదిరిగానే ఓట్లను సరిపోల్చే వీలుంటుంది.
- 50వేల మంది ఈ-ఓటింగ్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేలా దీన్ని రూపొందించినట్లు బీహార్ ఎన్నికల అధికారులు వెల్లడించారు.

# ఎన్నిసార్లు ప్రారంభిస్తరు?

హైదరాబాద్, మనం ప్రతినిధి: నిజామాబాద్ పసుపు బోర్డును ఇదివరకే రెండుసార్లు ప్రారంభించారని.. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పుడు మూడోసారి ప్రారంభించేందుకు వస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, కవిత అన్నారు. కూకట్ పల్లి, శేరిలింగంపల్లి, పటాన్ చెరు, యాకుత్‌పురా నియోజకవర్గాలకు చెందిన విద్యార్థులు, యువకులు శనివారం కవిత సమక్షంలో తెలంగాణ జాగతిలో చేరారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. పసుపు బోర్డుకు పదే పదే ప్రారంభోత్సవాలు చేయడం కాదు?.. ఎన్‌డీఏ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పసుపు బోర్డుకు చట్టబద్ధత కల్పించాలన్నారు. పసుపు బోర్డుకు ఇదివరకే ప్రారంభోత్సవాలు చేసిన సంగతి ఎంపీ అర్వింద్ కేంద్ర హోం మంత్రికి చెప్పకపోవచ్చని అన్నారు. నిజామాబాద్‌లోనే పసుపునకు క్వింటాల్‌కు రూ.15 వేల మద్దతు ధర ప్రకటించి వెళ్లాలని డిమాండ్ చేశారు. పసుపు బోర్డుకు చట్టబద్ధత కల్పించలేదు కాబట్టే మొన్నటి బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. నిజామాబాద్ జిల్లా రైతులు సంతోష పడేలా అమిత్ షా మద్దతు ధరపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను తాము లేవనెత్తుతుంటే కాంగ్రెస్ పార్టీ ఉలిక్కి పడుతోందన్నారు. కాంగ్రెస్ పాలనలో విద్యార్థులు, మహిళలు, అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అందుకే మహిళలను తక్కువ చేసి కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. ఈ రోజు కాంగ్రెస్ పార్టీ బతికి బట్టకట్టింది అంటే అది మహిళల వల్లనే అన్న విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఇందిరా గాంధీ, సోనియా గాంధీలే నిలబెట్టారని తెలిపారు. మహిళల గురించి జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలే కాంగ్రెస్ పార్టీ విధానమా? అని సీఎం రేవంత్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను ఆమె ప్రశ్నించారు. మహిళలను తక్కువ చేసి మాట్లాడుతున్న జగ్గారెడ్డిని ఆయన భార్య, కూతురే సరి దిద్దాలన్నారు. బీసీల రిజర్వేషన్ల పెంపు బిల్లు కేంద్ర ప్రభుత్వం దగ్గర పెండింగ్‌లో ఉందని..ఆ బిల్లును పాస్ చేస్తారా? లేదా? దీనిపై ఓ స్పష్టత ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు.

**యువత రాజకీయాల్లోకి రావాలి..**

యువత రాజకీయాల్లోకి రావాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. జయశంకర్ సార్, కేసీఆర్ ఆలోచనల్లోంచి తెలంగాణ జాగృతి ఆవిర్భవించిందని అన్నారు. విద్యార్థులు, యువతకు ఎలాంటి సమస్యలున్నా వారి తరపున తెలంగాణ జాగృతి ఉద్యమిస్తుందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి బూతులు మాట్లాడటం మినహా ప్రజల కోసం చేసిందేమి లేదన్నారు. జై తెలంగాణ అనని ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు. ఈ సందర్భంగా రోషన్, అజయ్ నాయక్, పంకజ్ షిండే, వికాస్ ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు తెలంగాణ జాగతిలో చేరారు. కార్యక్రమంలో తెలంగాణ జాగతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

# కొత్త కంపెనీలతో 5 లక్షల ఉద్యోగాలు

శంకుస్థాపన చేశారు. ఆయన పునాది రాయి వేస్తే.. చంద్రబాబు దాన్ని మరోస్థాయికి తీసుకెళ్లారు. ప్రపంచంలోని నగరాలతో హైదరాబాద్ పోటీ పడాలి. న్యూయార్క్, టోక్యో వంటి నగరాలతో హైదరాబాద్ పోటీపడుతోంది. ఎంత మంది రాక్షసులు అడ్డుపడినా మా యజ్ఞం ఆగదు. రైజింగ్ తెలంగాణ-2047 లక్ష్యంతో మాతో అందరూ కలిసి వస్తున్నారు' అని ముఖ్యమంత్రి పీజేఆర్‌ను కొనియాడారు.

**త్రీ లేయర్ తెలంగాణ..**

రాష్ట్రాన్ని భౌగోళికంగా మూడు లేయర్లుగా విభజించనున్నామని సీఎం వెల్లడించారు. దీని గురించి వివరిస్తూ.. 'రానున్న 100 రోజుల్లో కోర్ అర్బన్ రీజియన్ కు సంబంధించిన ప్రణాళికలు సిద్ధమవుతాయి. కాలుష్యం కారణంగా నేడు ఢిల్లీలో నివసించలేని పరిస్థితి ఏర్పడింది. దేశ రాజధానిలో నివసించలేని పరిస్థితి వచ్చిందంటే పాలకులకు సరైన ప్రణాళిక లేకపోవడమే కారణం. వర్షం వస్తే చెన్నై అతలాకుతలమవుతోంది, బెంగళూరు నగరం ట్రాఫిక్ లో చిక్కుకుంటోంది. ఢిల్లీ, చెన్నై, బెంగళూరు నుంచి మనం నేర్చుకోవాలి. హైదరాబాద్లో కాలుష్యం తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాం. డీజిల్ బస్సులను నగరానికి అవతలకు పంపించే చర్యలు చేపట్టాం. నగరంలో 3వేల ఎలక్ట్రిక్ బస్సులు మాత్రమే తిరిగేలా చూస్తాం. ఎలక్ట్రిక్ కార్లు, ఆటోలు కొంటున్న వారికి పన్ను లేకుండా చేస్తున్నాం. నాలాలు కబ్జాలకు గురవడం వల్లే నగరంలో ముంపు తీవ్రత పెరిగింద'ని రేవంత్ చెప్పారు.

**బీఆర్ఎస్ కబ్జా నుంచి బతుకమ్మ కుంటకు విముక్తి..**

బతుకమ్మకుంటను బీఆర్ఎస్‌నాయకులు ఆక్రమించుకుంటే.. వారి కబ్జా నుంచి విడిపించాం. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ అభివృద్ధి చేస్తే 5లక్షల ఉద్యోగాలు వచ్చాయి. హైదరాబాద్ పై ఒత్తిడి పెరుగుతున్నందునే 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని చేపట్టాం. 2029లో నియోజకవర్గాల పునర్విభజన జరగబోతోంది.

**నాలుగు నియోజకవర్గాలుగా శేరిలింగంపల్లి..**

శేరిలింగంపల్లి నియోజకవర్గం నాలుగు నియోజకవర్గాలుగా మారబోతోంది. అందరికీ అభివృద్ధిలో భాగస్వాములయ్యే అవకాశం వస్తుంది'' అని సీఎం అన్నారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సంస్కరణల పితామహుడికి నివాళి

మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా రేవంత్ ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీవీ నరసింహారావు సేవలను గుర్తు చేసుకున్నారు. బహుభాషాకోవిదుడిగా, రచయితగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా ఆయన దేశానికి ఎనలేని సేవలను అందించారని కొనియాడారు. దేశాన్ని ప్రగతిపథంలో నడిపించడంలో పీవీ పాత్ర ఎనలేనిదన్నారు.

**భూసంస్కరణలతో సమానత్వ స్థాపన : భట్టి**

పీవీ ఘాట్లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రధానిగా, ముఖ్యమంత్రిగా పీవీ దేశంలో రాష్ట్రంలో అనేక సంస్కరణలు తెచ్చారన్నారు.ఆర్థిక సంస్కరణలతో భారత దేశాన్ని ప్రపంచంలో బలమైన ఆర్థిక శక్తిగా నిలబెట్టారని గుర్తుచేశారు.

## ఫ్యూచర్ సిటీ భూసేకరణ సత్వరమే పూర్తి చేయాలె

ఫ్యూచర్ సిటీ భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని అధికారులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఆదేశించారు. ఇవాళ(శనివారం) జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం పరిశ్రమల శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్రెడ్డి. స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి, టీజీఐసీసీ వైస్ చైర్మన్ శశాంక సమీక్షలో పాల్గొన్నారు. డేటా సెంటర్ల ఏర్పాటుపైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎం రేవంత్రెడ్డి సూచించారు. డేటా సెంటర్ల కోసం కావాల్సిన స్థలం సిద్ధం చేయాలని ఆదేశించారు. పెట్టుబడుల కోసం తెలంగాణ రాష్ట్రానికి వచ్చే పారిశ్రామిక వేత్తలు ఎవరూ వెనక్కు వెళ్లడానికి వీల్లేదని స్పష్టం చేశారు. నిమ్జ్‌లో మిగిలి ఉన్న భూ సేకరణను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులతో మాట్లాడి భూములు ఇవ్వడానికి ఒప్పించాలని సూచించారు. ఫ్యూచర్ సిటీలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ క్యాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని నిర్ధేశించారు. ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ క్యాంప్లెక్స్ కోసం అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ ఆర్కిటెక్చర్స్‌ను నియమించుకోవాలని సీఎం ఆదేశించారు.

# ఫామ్ ఆయిల్ పంటలతో అధిక లాభాలు

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**




**చేవెళ్ల, జూన్ 28(మనం న్యూస్):** ఫామ్ ఆయిల్ పంటలతో అధిక లాభాలు గడించవచ్చని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. చేవెళ్ల మునిసిపాలిటీ పరిధిలోని దేవుని ఎర్రవల్లి గ్రామ సమీపంలో శనివారం ఫామ్ ఆయిల్ మెగా ప్లాంటేషన్ తోటను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, చేవెళ్ల శాసనసభ్యులు యాదయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పామ్ ఆయిల్ పంటల ప్రాముఖ్యతను మంత్రి తుమ్మల వివరించారు. ఈ పంటలు రైతులకు అధిక ఆదాయాన్ని అందించడంతో పాటు, వ్యవసాయ రంగంలో కొత్త అవకాశాలను సృష్టిస్తాయని ఆయన తెలిపారు. పామ్ ఆయిల్ పంటలు తక్కువ నీటితోనూ, సరైన నిర్వహణతో అధిక దిగుబడిని ఇస్తాయని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు. ఈ పంటలు వాణిజ్యపరంగా లాభదాయకమైనవని, దీర్ఘకాలంలో రైతులకు ఆర్థిక స్థిరత్వాన్ని అందిస్తాయని ఆయన హామీ ఇచ్చారు. అంతేకాక, పామ్ ఆయిల్ పరిశ్రమల ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఆయన అన్నారు. అనంతరం ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ... పామ్ ఆయిల్ పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని గురించి వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని ఆయన కోరారు. ఈ మెగా ప్లాంటేషన్ తోట ప్రాంతంలో వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని, రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, హార్టికల్చర్ శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాష, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు గోనె ప్రతాప్ రెడ్డి, దేవర వెంకట్ రెడ్డి, హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

# ఆర్థిక సంస్కరణల ధీశాలి పివి

- **అప్పుల భారతాన్ని అభివృద్ధివైపు నడిపించిన రాజనీతిజ్ఞుడు**
- **ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**



**రంగారెడ్డి జూన్ 28 (మనం న్యూస్)** ఆర్థిక సంస్కరణల ధీశాలి, అప్పుల భారతాన్ని అభివృద్ధివైపు నడిపించిన రాజనీతిజ్ఞుడు మాజీ ప్రధాని పివి నరసింహారావు అని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శనివారము పీవీ నరసింహారావు జయంతిని పురస్కరించుకొని ఆర్కేపురం డివిజన్ అల్కాపురి చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ భారతదేశాన్ని పునర్నిర్మించిన నిజమైన నాయకుడని అన్నారు. ఆర్థిక రంగం నుంచి అను శక్తి కార్యక్రమం వరకు, అంతర్గత భద్రత నుండి విదేశాంగ విధానాల వరకు అన్నింటిపై తనదైన ముద్ర వేసిన మహనీయుడు పి వీ అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరంకృతి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ బి ఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, డా . రామ్ నరసింహ గౌడ్,కంచర్ల శేఖర్, కొండ్ర శ్రీనివాస్, సాజిద్, ముచ్చింతల జగన్, వెంకటేష్ గౌడ్, మహేందర్ రెడ్డి, శంకర్ నాయక్, పెంబర్తి శ్రీనివాస్, నవీన్, ఊర్మిళ రెడ్డి పాల్గొన్నారు.

## మీడియా మీద దాడులు చేయడం తగదు



**కడ్తాల్, జూన్ 28 ( మనం, న్యూస్):** రెండు రాష్ట్రాల్లో సంచలనం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ విషయంలో వార్తలు ప్రచురిస్తున్నారని అక్కసుతోనే బిఆర్ఎస్ శ్రేణులు మహా న్యూస్ ఛానల్ ప్రధాన కార్యాలయంపై దాడులు చేయడం తీవ్రంగా కండిస్తున్నట్లు కడ్తాల్ మండల జర్నలిస్ట్ సంఘము మండల అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. మీడియా చానళ్ళు ప్రచురించే వార్త కథనాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ప్రజాస్వామ్యంలో స్పందించి తీరు ఇది కాదని, తమపై వచ్చిన ఆరోపణలను మీడియా ముఖంగా ఖండించడం లేదంటే న్యాయస్థానాలను ఆశ్రయించాల్సి ఉంటుంది.. కానీ మీడియా సంస్థలపై దాడికి పాల్పడడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. శనివారం అయన మాట్లాడుతూ మీడియాపై గుండాయిజం చేయడమే కాకుండా దాడులు చేయడం అత్యంత హేనీయమని విమర్శించారు.

# భారత మాజీ ప్రధాని పీవీ నరసింహరావు 104 వ జయంతి వేడుకలు




**తుర్కయంజాల్, జూన్ 27( మనం న్యూస్ ):** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ సాయి గణేష్ టెంపుల్ లో బ్రాహ్మణ సేవ సంఘం తరఫున శనివారం భారత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు జయంతి వేడుకలో ముఖ్యఅతిదులుగా నియోజకవర్గం బ్రాహ్మణ సేవా అధ్యక్షులు మూసిపట్ల మోహన్ రావు, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ బ్రాహ్మణ సేవా అధ్యక్షులు మడుపు వేణుగోపాల్ రావు, బ్రాహ్మణ సేవా కమిటీ సభ్యులు కలిసి భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 104 వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మూసి పట్ల మోహన్ రావు మాట్లాడుతూ, స్వర్గీయ పీవీ నరసింహారావు జయంతి వేడుకల సందర్భంగా 2026 సంవత్సరంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పీవీ నరసింహారావు విగ్రహం ఏర్పాటు చేయాలని బ్రాహ్మణ సేవా కార్యక్రమంలో తెలియజేయడం జరిగింది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ బ్రాహ్మణ సేవా అధ్యక్షుడు మడుపు వేణుగోపాలరావు మాట్లాడుతూ, తొలి తెలుగు ప్రధానిగా ఆర్థిక సంస్కరణల రూపకర్తగా, పీవీ నరసింహారావు బహుముఖ ప్రజ్ఞాశాలి, ఆర్థిక,రాజకీయ, దౌత్య సామాజిక,బహుభాషా విద్యావేత్త, ఆర్థిక సంస్కరణల రూపకర్తగా, స్వపాక్షం నుంచి, ప్రతిపక్షాల నుంచి, ఖండాంతర ఆర్థిక నిపుణుల నుంచి, మన్ననలందుకున్న, వ్యక్తి మాజీ ప్రధాన మంత్రి అని తెలియజేశారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో ఏదో ఒక జిల్లాకు పీవీ నరసింహారావు అని,పేరు పెట్టాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన సలహాదారుడు సునీల్ శర్మ , బాలాంతర వీర్రాజు , ప్రధాన కార్యదర్శి శ్రీ వలిపే రాఘవేంద్రరావు , కోశాధికారి ఆదిమూలం వెంకటేశ్వరరావు, నియోజకవర్గ ఇన్చార్జి సంబరాజు కిషన్ రావు,గంప రామారావు, శివరామారావు, గౌతరాజు రఘురాం, ప్రహల్లాద రావు, అంకరాజు, వెంకటేశ్వర రావు, మరియు బ్రాహ్మణ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రత్యంగిరా దేవి దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



**రంగారెడ్డి, జూన్ 28 (మనం న్యూస్):** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురంలోని కుర్తాళ పీఠం శ్రీ ప్రత్యంగిరా దేవి దేవాలయంలో వారాహీదేవి నవరాత్రులు లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్న మాజీ మంత్రి, మహేశ్వరం శాసనసభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి. ఈ సందర్భంగా దేవాలయం సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ సబితా ఇంద్రారెడ్డి కి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం మునిపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పీఠాధిపతులు జగద్గురువులు సిద్దేశ్వరానంద భారతి మహా స్వామి వారి ఆశీస్సులతో, ఉత్తరాధికారి శ్రీ దత్తేశ్వరానంద భారతి మహా స్వామి ఆశీస్సులతో ఉత్సవాలు కొనసాగు తున్నాయి అన్నారు. నవరాత్రులలో భాగంగా ఉదయం అమ్మవారికి విశేష 18 రకాల ద్రవ్యాలతో అభిషేకం, అర్చనలు, మహిళలతో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించామన్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని దేవాలయం ప్రాంగణం రంగురంగు పూలతో దేదీప్య మానంగా అలంకరించడం జరిగిందన్నారు. ఉత్సవాలను తిలకించడానికి జంట నగరాల నుండి వేల సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గం బి ఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, డా. రామ్ నరసింహ గౌడ్, కొండ్ర శ్రీనివాస్, సాజిద్, వెంకటేష్ గౌడ్, కంచర్ల శేఖర్, ముచ్చింతల జగన్,పెంబర్తి శ్రీనివాస్, లిక్కి ఊర్మిళ రెడ్డి , నవీన్ పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్వోసీ అందజేత



**చేవెళ్ల, జూన్ 28 ( మనం న్యూస్):** పేదల పాలిట సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. శనివారం అంతప్ప గూడ గ్రామానికి చెందిన వెంకటేష్ గౌడ్ సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకోగా మంజూరైన ఎల్ఓసి పత్రాన్ని ఎమ్మెల్యే కాలే యాదయ్య క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అనారోగ్యానికి గురై పలు దవాఖానల్లో చికిత్స పొందుతున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళలా ప్రభుత్వం ముందుకెళ్తుంది



**రంగారెడ్డి, జూన్ 28 (మనం న్యూస్):** రేవంతన్న భరోసా పథకంలో భాగంగా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం హయత్ నగర్ లోని చెన్నాగొని స్వామి ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి , టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ , ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి , ముస్లిం మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ , క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ లో హాజరయ్యారు. ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళులాగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం సంక్షేమాన్ని ఆపటం లేదని.. పేద మహిళలకు వ్యక్తిగతంగా ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఇలాంటి కుట్టు మిషన్ల పంపిణీ చేపడుతుందని పేర్కొన్నారు. మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. మహిళలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. ముఖ్యంగా ఆర్థికంగా ఎదిగేందుకు ఆర్టీసీ బస్సుల ఏర్పాటుతోపాటు, పెట్రోల్ బంకులు, మహిళా క్యాంటీన్లు తదితర స్వయం ఉపాధి ఏర్పాటు చేయిస్తుందన్నారు. మహిళల కుటుంబాల్లో భరోసా కల్పించాలి అన్న లక్ష్యంతో రేవంతన్న భరోసా పథకం ద్వారా కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు వజ్ర ప్రకాష్ గౌడ్, లక్ష్మీ ప్రసన్న, టిపిసిసి కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్, మహిళా కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షురాలు కళ్లెం సుజాత రెడ్డి గారు, ధారాసింగ్ గారు, డివిజన్ అధ్యక్షులు చెన్నగోని రవీందర్, శ్రీ పాల్ రెడ్డి, వేణుగోపాల్ యాదవ్ గారు, మకుటం సదాశివుడు, కుట్ల నరసింహ యాదవ్, మంజులా రెడ్డి లింగాల కిషోర్ గౌడ్, పాల్గొన్నారు.



# పీవీ ఆశయ సాధనకు కృషి చేద్దాం

- **టిపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త**

**రంగారెడ్డి, జూన్ 28 (మనం న్యూస్):** తెలంగాణ గర్వించే బిడ్డగా, అత్యుత్తమ పరిపాలనాదక్షుడిగా, భారత ప్రధానిగా దేశానికి అమూల్యమైన సేవలు అందించిన భారతరత్న పీవీ నరసింహారావు 104 వ జయంతి సందర్భంగా వారి సేవలను స్మరించుకుంటూ నెక్లెస్ రోడ్, గాంధీ భవన్ లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన టి పీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త.ఈ కార్యక్రమంలో టి పీసీసీ కార్యదర్శి మని లశా , బాబు దైవాగ్ఘ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలపై ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే సబితా



**బడంగ్ పేట్, జూన్ 28 (మనం న్యూస్):** మహేశ్వరం నియోజకవర్గంలోని బడంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్లో ఉన్న మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించిన ఆమె వారి సమస్యలు, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపై పూర్తి సమాచారం తీసుకున్నారు. విద్యార్థులు త్రాగునీటి లభ్యత లేకపోవడం వంటి సమస్యలను వ్యక్తపరచగా, వెంటనే స్పందించిన ఆమె మౌలిక సదుపాయాల లేని పరిస్థితి ఆవేదనకు గురిచేస్తోంది అన్నారు. పక్కనే ఉన్న అంగన్వాడీ పిల్లలతో కాసేపు సరదాగా వారితో ముచ్చటించారు. పిల్లల ప్రకారంగా ఇస్తున్నటువంటి పుడ్డు , ఇతర వివరాలు అడిగి మరీ తెలుసుకున్నారు. కావలసిన సదుపాయాల గురించి తక్షణమే వారికి ఏర్పాటు చేయాలని చెప్పి స్థానిక నాయకులకి అప్పజెప్పి త్వరితగతులు పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా వ్యవస్థను గాలికి వదిలేసిన రేవంత్ రెడ్డి సర్కార్ బాధ్యత గలదిగా వ్యవహరించాలి. పాఠశాలలకు తక్షణమే తాగునీరు, మరుగుదొడ్లు, భద్రత, విద్యా సామగ్రి వంటి మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరిస్తున్నాను' అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కృష్ణయ్య, మల్లాపూర్ పాఠశాల హెడ్మాస్టర్, మాజీ కార్పొరేటర్ జనగే భారతమ్మ-కొమురయ్య యాదవ్, మాజీ కౌన్సిలర్ దండు గణేష్ ముదిరాజ్, పోరెడ్డి వెంకటరెడ్డి, సిల్వేరి సాంబశివ, శ్రీనివాస్ యాదవ్, కుక్కల పురుషోత్తం, కాల్వ గణేష్ ముదిరాజ్, బొర్రా మాధవరెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎస్.కె. ఖలీల్ పాషా, సంధ నాగేష్, సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



**తెలుగు తేజం, బహుభాషా కోవిదుడు, సంస్కరణల రూపశిల్పి, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా హయత్ నగర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి , టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా , జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి , రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి , ముస్లిం మైనారిటీ నమస్కారం చైర్మన్, ముస్లిం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఊబేదుల్లా కొత్వాల్ , క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ తదితర నాయకులునివాళులర్పించారు.**
**- (రంగారెడ్డి మనం న్యూస్)**

## విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



**చేవెళ్ల, జూన్ 28( మనం న్యూస్):** విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి మంచిస్థాయికి చేరుకోవాలని రాచకొండ ఎసిపి(ఎస్ ఓటి) అంజయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని కౌకుంట్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు తన సొంత ఖర్చులతో నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రతి విద్యార్థి పేదరికాన్ని అధిగమించి విద్యలో రాణించినప్పుడే భవిష్యత్ ఉజ్వలమవుతుందన్నారు. సమాజంలో జీవితాలను మార్చేది చదువేనని చదువు చాలా గొప్పదని దానికి కులం, మతం, జాతి అనే తేడాలు ఉండవని విద్యార్థులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్ఎంసి చైర్మన్ సారా శివకుమార్ జీ, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మొగులయ్య , ఎన్. కృష్ణ, మహేష్ ,రమేష్ , ప్రశాంత్, కరణ్ జీ, కరుణాకర్, శ్రీకాంత్ ,సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు ,విద్యార్థులు తదితరులు ఉన్నారు.

# పాఠశాలలకు రెగ్యులర్‌గా ఉపాధ్యాయులు విధులకు హాజరు కావాలి

- **విద్యార్దులకు కనీస విద్యా ప్రమాణాలు అందించడమే లక్ష్యంగా చర్యలు**
- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి, జూన్ 28 (మనం ప్రతినిధి):** ప్రస్తుత విద్యా సంవత్సరంలో 90శాతం విద్యార్దులకు కనీస విద్యా ప్రమాణాలు అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శ్రీరాంపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెడ్ మాస్టర్ లతో విద్య పై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, పాఠశాలల నిర్వహణ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, విద్యా సంవత్సరం ప్రారంభం లోనే లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధన దిశగా కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ సర్క్యులర్ ప్రకారం పాఠశాలలో 10 శాతం కంటే ఎక్కువ ఉపాధ్యాయులు ఒకే రోజు సెలవు తీసుకోకుండా చూడాలని అన్నారు. ఉపాధ్యాయుల హాజరు పక్కాగా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మరమ్మత్తులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన పనులు చేశామని, ఎక్కడైనా ఇంకా అవసరం ఉంటే ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ సూచించారు.

రాబోయే వర్షాకాలం నేపథ్యంలో ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. వచ్చేది వర్షాకాలం కావున మధ్యాహ్న భోజనం నాణ్యత లో పరిశుభ్రంగా ఉండేలా, వండే వంటలు క్వాలిటీ గా ఉండాలని, పాఠశాలలో పిచ్చి మొక్కలు ఉంటే వెంటనే తొలగించాలని అన్నారు. విద్యార్థుల నాణ్యత ప్రమాణాలు పెంచేందుకు ప్రణాళిక ప్రకారం పని చేయాలని అన్నారు. తెలుగు, ఇంగ్లీష్ చదవడం, రాయడం, బేసిక్ మ్యాథ్స్ వంటి కనీస విద్యా ప్రమాణాలు ప్రతి విద్యార్థికి అందేలా చూడాలని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కొంతమంది విద్యార్థులు చదువుతున్నారు కానీ అది అర్థం చేసుకోలేక పోతున్నారని,దీనిని అధిగమించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరువ చూపి పని చేయాలని అన్నారు. ప్రతి 2 నెలలకు కాంప్లెక్స్ పరిధిలో రివ్యూ సమావేశాలు నిర్వహించాలని, వీటిని పకడ్బందిగా నిర్వహించాలని అన్నారు.

ప్రతి నెలా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపు పై సమావేశాలు పెట్టుకోవాలని అన్నారు. 90 శాతం విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు అందించడమే లక్ష్యంగా మనం పని చేయాలని, దీనికి అనుగుణంగా అవసరమైన ప్రణాళికలను పాఠశాల పరిధిలో సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో పీఎం షేక్, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ఆమె ఓడిపోలేదు

గెలుపును
గుర్తించలేని సమాజం

ఓటమిని ఒప్పుకోలేని
ఆమె నిస్సహాయత

ప్రోత్సాహం
అందించలేని మిత్ర బృందం

మన అనుకోవడం తప్ప
చెయ్యందించలేని స్నేహం

ప్రేమగా మేమున్నామని
గుండెలకు హత్తుకునే మనిషులు అరువై

చుట్టూ మానవత్వం కరువై
మనిషితత్వం చచ్చిపోయిందని తెలిసి

ఎడారిలో ఒంటరిగా నడుస్తూ
కవిత్వంతో సహవాసం చేస్తూ

తాను రచించే కథలో తానొపాత్రయై
తనను తాను నూతనంగా చెక్కుకుంటూ

శిథిలమైన గతాన్ని విడిచి
రేపటికి రెక్కలు తొడుగుకొని
వస్తోవ అనిపించుకుంటున్న ఆమె

ఓడిపోలేదు నమ్మలేని ఒక నిజాన్ని
భుజాలపై మోస్తూ మౌనానికి చెయ్యందించింది
తప్ప ఆమె ఓడిపోలేదు

- వాసి జ్యోత్స్న
98668 43005

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.
- ఎడిటర్

# ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పునాది కదలగానే..



తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలి భారీ ప్రాజెక్టుగా గుర్తింపు పొందిన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం, ఇప్పుడు అదే ప్రజల వద్ద అసంతృప్తికి, ఆవేదనకు కారణమవుతోంది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో రాజకీయ పక్షపాతాలు, అధిక వ్యయం, నిర్మాణ లోపాలు, అవినీతి ఆరోపణలు మొదలై చివరకు మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం ద్వారా ప్రజల ధనాన్ని ఎలా వృథా చేశారన్న ఉదాహరణగా మారింది. ఈ వ్యాసంలో ఈ వ్యవహారాన్ని గంభీరంగా విశ్లేషించి, బాధ్యతలు ఎవరి మీద నెట్టాలి? అనే ప్రశ్నకు సమాధానం వెతుకుదాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత, రైతులకు ఏడాది పొడవునా సాగునీరు అందించాలన్న లక్ష్యంతో అనేక జల పథకాలు ప్రారంభమయ్యాయి. వాటిలో ప్రముఖమైనది కాళేశ్వరం ప్రాజెక్టు. కానీ ఎంత పెద్దదైనా సరే, నాణ్యత లేదు అంటే అది ప్రమాదమే.ఇక గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనుల గురించి చర్చిద్దాం. మేడిగడ్డకు కావొచ్చు కాళేశ్వరం ప్రాజెక్టులో 7 బుర్జ్ ఖలీఫాలకు సరిపడా కాంక్రీటు, 15 ఈఫిల్ టవర్ల నిర్మాణానికి సరిపడా ఉక్కు.. ప్రపంచంలో అతి పెద్దదైన గీజా పిరమిడ్ వంటి 6 పిరమిడ్ల పరిమాణంలో తవ్విన మట్టి. 72 గంటల్లో 25,584 ఘనపు మీటర్ల కాంక్రీటును పోసి గిన్నిస్ రికార్డ్...' మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ ఘనత గురించి దాని కాంట్రాక్టు సంస్థ ఎల్ అండ్ టీ చెప్పిన మాటలివి. ఈ ప్రాజెక్టులో గేట్ల బరువును ఆపే స్తంభాల వంటి నిర్మాణాలు (పీర్) ఒక్కొక్కటీ 110 మీటర్ల పొడవు, 4-6 మీటర్ల వెడల్పు, 25 మీటర్ల ఎత్తున కాంక్రీటుతో నిర్మించారు. ఇంత భారీగా కట్టిన పీర్లలో ఒకటి కుంగింది. 20వ నంబర్ పీర్ మాత్రం కుంగిందనేది ప్రాథమికంగా అందిన సమాచారం. గతంలో కాళేశ్వరం పంప్ హౌసులు మునిగినప్పుడు, ప్రస్తుతం మేడిగడ్డ ప్రాజెక్టు మునిగినప్పుడూ కూడా మీడియాను అనుమతించలేదు బీఆర్ఎస్ ప్రభుత్వం. విషయం ఏంటో అన్నది తెలియకుండా అప్పటి సీఎం కేసీఆర్ అంతా రహస్యంగానే ఉంచారు. బీఆర్ఎస్ పార్టీ తమ ఘన విజయాల్లో ఒకటిగా చెప్పుకునే కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన ఈ మేడిగడ్డ బ్యారేజీ కుంగడంతో దాని కారణాలపై చర్చ మొదలైంది. కాళేశ్వరం ఒక అద్భుతమని, ప్రపంచంలోనే పెద్దదని బీఆర్ఎస్ చెప్పుకుంటుండగా, ఇది అవినీతి మయమని, ఉపయోగంలేని ప్రాజెక్టనీ ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మేడిగడ్డ గ్రామం వద్ద తెలంగాణ - మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉంటుంది మేడిగడ్డ బ్యారేజీ. దీనికి లక్ష్మీ బ్యారేజీ అని పేరు పెట్టారు కేసీఆర్. 2016 మేలో శంకుస్థాపన, 2019 జూన్‌లో నిర్మాణం పూర్తయింది. ఈ ఒక్క బ్యారేజీకే సుమారు రూ.1,850 కోట్లు ఖర్చు అయింది. 16 టీఎంసీల నీరు ఇందులో నిల్వ ఉండే ఏర్పాటు ఉంది. ఇది బ్యారేజీ మాత్రమే కాకుండా వంతెన కూడా. ఆ రోడ్డు తెలంగాణ, మహారాష్ట్రలను కలుపుతుంది. పొడవు దాదాపు 1.6 కిలోమీటర్లు. ఒకే ప్రాజెక్టులో ఒక్కసారిగా పెద్ద మొత్తంలో కాంక్రీటు పోయడం అనే రికార్డు తెచ్చి మీడియాలో వార్తల కవరేజీ కోసం అప్పట్లో తెలుగు రాష్ట్రాలు పోటీ పడేవి. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి సుమారు 16 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు ఒకేసారి పోసి రికార్డు సృష్టిస్తే, దాన్ని అధిగమించి 25 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పోసి రికార్డు సృష్టించారు మేడిగడ్డలో. ఇది 2018 డిసెంబరులో జరిగింది. ఇప్పుడు మరి ఇలా ఎందుకు జరిగింది, బ్యారేజీ ఎందుకు కుంగింది అన్నది తెలుసుకునే ముందు మేడిగడ్డ



ప్రాధాన్యత ఏంటో కూడా తెలుసుకోవాలి. ఎందుకంటే ఈ ఒక్క బ్యారేజీ కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండెకాయ అని చెప్పవచ్చు. కాళేశ్వరం అనేది ఒక బ్యారేజీ, ఒక పంపు హౌసో కాదు.. కొన్ని బ్యారేజీలు, పంపు హౌజులు, కాలువలు, సొరంగాల కలయిక. వాటిలో మేడిగడ్డ అతి ముఖ్యమైనది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ ప్రాణహిత - చేవెళ్ల సృజన స్రవంతి ప్రాజెక్టును తెలంగాణ ఏర్పడ్డాక రీ డిజైన్ చేశారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో అనుకున్న దాని కంటే కాస్త కిందకు, అంటే ప్రాణహిత నది గోదావరిలో కలిసిన తరువాత వచ్చేలా ఈ మేడిగడ్డ బ్యారేజీను నిర్మించారు.

గోదావరిలో నీరు తగ్గిపోతోన్న వేళ ప్రాణహిత నుంచి వచ్చిన నీటిని ఒడిసిపట్టి వెనక్కు తోడి ప్రాణహిత కలవక ముందు ఉండే గోదావరిలో వేయడం ఈ బ్యారేజీ ఉద్దేశం. అందువల్లే ఉత్తర తెలంగాణ ప్రాణహిత నీరు అందాలంటే మేడిగడ్డే ఆధారం. అలా మేడిగడ్డ నుంచి నీటిని గోదావరిలో వెనక్కు తోడాలి. కానీ ఇప్పుడు జరిగిన ఘటనతో అసలు మేడిగడ్డలో నీళ్లు ఆపే పరిస్థితి లేదంటున్నారు సాగునీటి నిపుణులు. ప్రస్తుతానికి ఉన్న నీరంతా ఖాళీ చేసేశారు. దీంతో ఇప్పుడు ప్రాణహిత నుంచి వచ్చే నీటిని నిల్వ చేయడానికి కానీ, ఆ నీటిని వెనక్కు తోడి సుందిళ్ల, అన్నారం దగ్గరకు మళ్లించి అక్కడ నుంచి తోడి నీరు ఇవ్వడానికి సాధ్యం కాకపోవచ్చు. అంటే మొత్తం ప్రాజెక్టు ప్రయోజనానికే గండి పడే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఈ ప్రశ్నకు సమాధానం వెతికే పనిలో కేంద్ర ఇంజినీర్లు ఉన్నారు. అయితే, ఇది స్పష్టంగా నిర్మాణంలో నాణ్యతా లోపమే అంటున్నది తెలంగాణ ఇంజినీర్ల ఫోరం. కచ్చితంగా పునాదుల నిర్మాణంలో లోపం వల్లే ఇలా జరిగిందన్నది సుస్పష్టం. ఫౌండేషన్ సరిగా చేయలేదు. అందులో లోపం ఉంది. దానివల్ల కొంత కాలంగా కొంచెం కొంచెం ఫౌండేషన్ కింద ఉన్న ఇసుక కొట్టుకుంటూపోయి ఇప్పుడు కుంగింది. రాతి పునాది వేరు. ఇది ఇసుక పునాది. ఇసుక పునాదిలో నిర్మాణాలు చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా చేయాలి. ఉదాహరణకు రాజమండ్రి దగ్గర ధవళేశ్వరం ఇసుక పునాది అయినప్పటికీ బలంగా ఉంది. కానీ ఇక్కడ నిర్మాణ దశలో జాగ్రత్తలు పాటించలేదని స్పష్టంగా తెలుస్తోందని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా ఒక పిల్లర్ దెబ్బతింటే ఆ ప్రభావం పక్కవాటి మీద కూడా పడుతుంది. ప్రస్తుతం ఆ బ్యారేజీ నిర్మాణం చేసిన తెలంగాణ ప్రభుత్వ ఇంజినీర్లు, ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం వేసిన కమిటీలోని ఇంజినీర్లు, ఆ బరాజ్ కట్టిన కాంట్రాక్టు కంపెనీ ఇంజినీర్లు అంతా ఏం జరిగిందో సమగ్రంగా తెలుసుకునే పనిలో ఉన్నారు. కానీ వారికి నీరు అడ్డంకిగా మారింది. ఎందుకంటే, ఘటన జరిగే సమయానికి ప్రాజెక్టు నిండుగా ఉంది. ఆ నీటిని కిందకి వదిలేసినప్పటికీ, పై నుంచి ఇంకా నీరు వస్తోంది. దాన్ని కూడా కిందకు వదిలేస్తున్నారు. సరిగ్గా గోదావరి నదిలో ప్రాణహిత కలిసిన తరువాత మేడిగడ్డ బారేజీ ఉంటుంది. అందుకని నీటి ప్రవాహం ఎక్కువ ఉంది. ఇలాంటి ప్రాజెక్టు నిర్మాణానికి ముందు నదీ మట్టంలోని ఇసుకను వదులు లేకుండా చేయాలనీ కానీ మేడిగడ్డ విషయంలో ఆ ప్రక్రియ సక్రమంగా జరగలేదనీ కొందరు చెప్తున్నారు. అసలు ఈ బ్యారేజీ ప్రారంభమై నాలుగేళ్లే అయింది. అప్పుడే ఎందుకు దెబ్బతింది? నిర్మాణంలో నాణ్యత లోపాలు ఉన్నాయా? మరమ్మత్తులు చేయగలరా? చేయడానికి ఎంత అవుతుంది, ఎంత కాలం పడుతుంది? అన్న అంశాలపై అనుమానం నెలకొన్నది. అందుకే ఈ మేడిగడ్డ బ్యారేజీని ఒక అందమైన మేడిపండు అంటూ అభివర్ణించవచ్చు. ఆ మేడిపండు తొలచాల్సిన ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్నది. నిందితులను తప్పక శిక్షించాలి. దేవాదులపై నిత్యం రాజకీయ చేసే బీజేపీ ఈ అంశంలో కనీసం ఎటువంటి విచారణ కోరకపోవడం శోచనీయం.

జ్యుడీషియల్ కమిషన్ విచారణ - విచిత్ర వాస్తవాలు

ఇప్పటివరకు 109 మంది అధికారులు, ప్రైవేటు వ్యక్తులు కమిషన్ ముందు హాజరయ్యారు. వారిలో ఎక్కువ మంది ఈ నిర్మాణ తీర్మానాలు, స్థాన ఎంపికలు, టెండర్ ప్రక్రియలు మొదలైనవి తామేం నిర్ణయించలేదని, పైస్థాయి అధికారుల ఆదేశాల మేరకే జరిగాయన్నారు. అలా అంటే పాలకులు పూర్తిగా ఏకపక్షంగా వ్యవహరించారన్న మాట.మేము కేవలం ఆదేశాలను అమలు చేశాం, లొకేషన్లుమార్చాలన్నది గత ముఖ్యమంత్రి ఆదేశమే. ప్రజాధనాన్ని వినియోగించడంలో అధికారుల పరిశీలనా సామర్థ్యం ఉండకపోతే, దానికి ప్రయోజనం ఏమిటి? ప్రజలు కష్టపడి చెల్లించే పన్నుతో రూపొందిన ప్రాజెక్టులు ఈ స్థాయిలో కూలిపోతే - ఎవరు బాధ్యత వహించాలి?ప్రజాధనాన్ని వృథా చేసిన తీరు - ఎవరిని నమ్మాలి?

- మన్నారం నాగరాజు
95508 44433

# విశ్వ శాస్త్రజ్ఞుడు జయంత్ నార్లికర్



మే 20, 2025న మన మధ్య నుంచి ఒక గొప్ప తార రాలిపోయింది. ఆయ నే డాక్టర్ జయంత్ నార్లికర్. విశ్వం గురించి మనం తెలుసుకునేందుకు దారి చూపిన గొప్ప శాస్త్రవేత్త ఆయన. కేవలం శాస్త్రవేత్తలకే కాదు, సామాన్య ప్రజలకు కూడా ఆకాశంలోని రహస్యాలను ఎంతో సులభంగా అర్థమయ్యేలా చెప్పిన వ్యక్తి నార్లికర్. ఆయన ఒక పరిశోధకుడు మాత్రమే కాదు, సైన్సును అందరికీ చేరువ చేసిన గొప్ప గురువు.

1938లో డాక్టర్ నార్లికర్ పండితుల కుటుంబంలో పుట్టారు. ఆయన తండ్రి గణిత శాస్త్రవేత్త, తల్లి సంస్కృత పండితురాలు. చిన్నప్పటి నుంచే ఆయనకు చదువు మీద, ముఖ్యంగా సైన్స్ మీద చాలా ఆసక్తి ఉండేది. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ పూర్తిచేసిన తర్వాత నార్లికర్ కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి వెళ్లి, ప్రఖ్యాత ఖగోళశాస్త్రవేత్త ఫ్రెడ్ హోయిల్ శిష్యుడిగా పనిచేశారు. 1963లో పిహెచ్.డి. పూర్తిచేసి, తర్వాత 1976లో ఎస్.సి.డి. పొందారు. హోయిల్తో కలిసి ఆయన అభివృద్ధి చేసిన హోయిల్-నార్లికర్ సిద్ధాంతం గురుత్వాకర్షణను వివరిస్తూ, ఆర్మేనియన్ శాస్త్రవేత్త మాక్ సిద్ధాంతానికి ఆధారం గా ఉండే భిన్న దృక్పథాన్ని ప్రతిపాదించింది. అప్పటికి చాలా మంది ఐన్స్టీన్ సాపేక్ష సిద్ధాంతాన్ని నమ్మేవారు. అలాగే విశ్వం ఒక పెద్ద పేలుడు (బిగ్ బ్యాంగ్) తో మొదలైందని భావించేవారు. కానీ నార్లికర్ గారు, హోయిల్ గారు ఈ అభిప్రాయాలకు ఒక ప్రత్యామ్నాయంగా ఈ సిద్ధాంతం ఉంది. 'స్థిర స్థితి సిద్ధాంతం (స్టేడీ స్టేట్ థియరీ)' ను ప్రవేశ పెట్టారు. ఈ సిద్ధాంతం ప్రకారం విశ్వం ప్రారంభం లేదా ముగింపు లేని స్థితిలో ఎప్పటికప్పుడు కొత్త పదార్థం ఏర్పడుతూ స్థిరంగా పెరుగుతూనే ఉంటుంది. కాబట్టి, అది ఎప్పుడూ ఒకేలా కనిపి స్తుందని చెప్పారు. ఉదాహరణకు ఒక గుండ్రటి బెలూన్ను ఊదుతున్నప్పుడు అది పెద్దదవుతుంది. కానీ ఈ సిద్ధాంతం ప్రకారం బెలూన్ పెద్దదవు తున్నా దాని ఉపరితలంపై కొత్త మచ్చలు ఎప్పుడూ పుడుతూనే ఉంటాయి, కాబట్టి దూరం నుంచి చూస్తే అది ఎప్పుడూ ఒకేలా కనిపిస్తుం దన్నమాట.

కేంబ్రిడ్జ్లో గొప్ప పేరు తెచ్చుకున్నాక 1972లో డాక్టర్ నార్లికర్ భారతదేశానికి తిరిగి వచ్చారు. మన దేశంలో సైన్స్ పరిశోధనలను అభివృద్ధి చేయాలనే బలమైన కోరిక ఆయనకు ఉండేది. ముంబైలోని టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ లో



ఖగోళ భౌతిక శాస్త్ర విభాగాన్ని పర్యవేక్షించారు. అయితే ఆయన చేసిన గొప్ప పనులలో ముఖ్యమైనది ఇంటర్ - యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐయుసిఎఎ) అనే సంస్థను పుణేలో 1988లో స్థాపించడం. ఉదాహరణకు ఒక స్కూల్లో సైన్స్ ల్యాబ్లు, మంచి టీచర్లు లేకపోతే పిల్లలు సైన్స్ నేర్చుకోలేరు కదా. అలాగే, మన దేశంలో ఖగోళ శాస్త్ర పరిశోధనలకు ఒక మంచి కేంద్రం కావాలని నార్లికర్ గారు భావించారు. ఆయన మొదటి డైరెక్టర్గా ఎంతో కష్టపడి ఐయుసిఎఎ ను నిర్మించారు. ఇప్పుడు ఇది ఖగోళ శాస్త్రం, ఖగోళ భౌతిక శాస్త్రంలో ప్రపంచ స్థాయి పరిశోధనా కేంద్రంగా ఉంది. ఎంతో మంది యువ శాస్త్రవేత్తలకు ఇది ఒక గొప్ప వేదిక. ఈ సంస్థ ఆయన దార్శనికతకు, కష్టానికి ఒక సజీవ సాక్ష్యం. ఆకాశ రహస్యాలను అందరికీ పంచిన సరళమైన మాటలు పరిశోధనలు, సంస్థల స్థాపనతో పాటు, డాక్టర్ నార్లికర్ గారు మన దేశంలో సైన్సును సామాన్య ప్రజలకు దగ్గర చేసిన వ్యక్తిగా ఎంతో పేరు పొందారు. సైన్స్ జ్ఞానం కేవలం ల్యాబ్లకే పరిమితం కాకూడదని ఆయన గట్టిగా నమ్మేవారు. అందుకే, ఆయన ఇంగ్లీష్లో, మరాఠీలో ఎన్నో పుస్తకాలు రాశారు . అవి ఖగోళ శాస్త్రం గురించి చెప్పే పాఠ్యపుస్తకాలైనా, నవలలైనా, చిన్న కథలైనా, సైన్స్ ఫిక్షన్ అయినా, చాలా సులభంగా అర్థమయ్యేలా ఉండేవి. ఉదాహరణకు బ్లాక్ హోల్స్ అంటే ఏమిటి, విశ్వం ఎలా విస్తరిస్తోంది, గురుత్వాకర్షణ శక్తి వంటి చాలా కష్టమైన విషయాలను కూడా ఆయన ఎంతో సరళంగా వివరించేవారు. ఒక ఉదాహరణ చెప్పాలంటే, ఒక బంతిని పైకి విసిరితే కింద పడుతుంది కదా, అది గురుత్వాకర్షణ శక్తి. విశ్వంలో నక్షత్రాలు, గ్రహాలు ఎలా తిరుగుతాయో నార్లికర్ గారు ఇలాంటి సరళమైన ఉదాహరణలతో వివరించేవారు. ఆయన పుస్తకాలు చదివిన పిల్లలు, పెద్దలు ఆకాశం వైపు ఆశ్చర్యంతో చూసేవారు. టీవీలలో కూడా ఆయన తరచుగా కనిపించి, సైన్స్ గురించి మాట్లాడేవారు. ఇలా ఆయన సైన్సును ఒక సాధారణ చర్చనీయాంశంగా మార్చారు.

డాక్టర్ నార్లికర్ గారు శాస్త్రీయ ఆలోచనలను బలంగా సమర్థించేవారు. మూఢనమ్మకాలు, అశాస్త్రీయ విషయాలను ఆయన ఎప్పుడూ తీవ్రంగా ఖండించేవారు. సూర్యగ్రహణం వచ్చినప్పుడు చాలా మంది అది అశుభమని, బయటకు రాకూడదని నమ్మేవారు. కానీ నార్లికర్ గారు అలాంటి మూఢనమ్మకాలను పారద్రోలడానికి, బహిరంగంగా అందరి ముందే భోజనం చేశారు. ఒక వేళ గ్రహణం వల్ల నిజంగా ఏదైనా ప్రమాదం ఉంటే, శాస్త్రవేత్తలు అందరినీ హెచ్చరిస్తారు కానీ, అనవసరంగా భయపెట్టరు కదా. సైన్స్ ఎలా ఆలోచించాలో, నిజం ఏమిటో ఆయన ఇలా ప్రజలకు చేతల్లో చూపించారు. సైన్సును ప్రజల్లోకి తీసుకెళ్లినందుకు ఆయన పరితపించే వారు. అంధవిశ్వాసాల్ని ఎదుర్కొనడంలో నార్లికర్ ముందుండేవారు. దేశ రాజ్యాంగంలోని విజ్ఞానవృత్తిని అభివృద్ధి చేయాలి అన్న నిబంధనకు జీవనుదాహరణగా నిలిచారు.

ఖగోళశాస్త్రంలో అపూర్వ సేవలందించిన ప్రొఫెసర్ జయంత్ విష్ణు నార్లికర్ కు దేశీ, అంతర్జాతీయ స్థాయిల్లో ఎన్నో పురస్కారాలు, గౌరవాలు లభించాయి. 1965లో పద్మభూషణ్, 2004లో పద్మ విభూషణ్ పురస్కారాలు అందజేయబడ్డాయి. అలాగే అంతర్జాతీయ గౌరవాలు అయిన ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫిజిక్స్ మెంబర్షిప్, యునెస్కో వారిచే ప్రజలకు శాస్త్రాన్ని అర్థమయ్యేలా చేయడంలో విశిష్ట కృషికి ఇచ్చే అంతర్జాతీయ అవార్డు కలింగా పురస్కారం 1996లో వరించాయి. 2014లో సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. అలాగే ఇతర గౌరవాలలైన న్యూ యార్క్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ మెంబర్షిప్, భారత సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ అధ్యక్షత్వం, భారత జాతీయ విజ్ఞాన అకాడమీ, ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, మాస్చుసెట్స్ టెక్నాలజీ ఇన్స్టిట్యూట్ లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి గౌరవ సభ్యత్వాలు లభించాయి.

నార్లికర్ భౌతికంగా ఈ లోకాన్ని వీడినా, ఆయన ఆలోచనల ప్రభావం మాత్రం శాశ్వతం.డాక్టర్ జయంత్ నార్లికర్ సైన్స్ అంటే కేవలం సూత్రాలు, సిద్ధాంతాలు మాత్రమే కాదని నిరూపించారు. అది తెలుసుకోవాలనే ఆసక్తి, లోతుగా ఆలోచించడం, సంస్థలను నిర్మించడం అందరికీ జ్ఞానాన్ని పంచాలనే తపన అని ఆయన మనకు నేర్పారు. ఖగోళ శాస్త్రంలో ఆయన చూపిన విశ్లేషణ, తత్వంలో ఆయన నిగూఢత, సమాజానికి అందించిన విజ్ఞాన సేవలు, ఇవన్నీ భారత విజ్ఞాన పునాది రాళ్లుగా మారాయి. విశ్వం ఎంత విస్తృతమైనా, మనం ఎంత చిన్నవారైనా, ఆ విస్తృతిని అర్థం చేసుకోవాలన్న తపన మనిషిలో ఉండాలి అనే సందేశం ఆయన జీవితం ఇచ్చిన గొప్ప బోధ. ఆయన వదిలి వెళ్లిన వారసత్వం, ఆయన అధ్యయనం చేసిన నక్షత్రాల వలె, ఎప్పటికీ ప్రకాశిస్తూనే ఉంటుంది. ఆయన లేని లోటు ఉన్నా, ఆయన రగిల్చిన సైన్స్ స్ఫూర్తి మన దేశంలో ఎప్పటికీ వెలుగుతూనే ఉంటుంది.

- జనక మోహన రావు దుంగ
8247045230

# తెలంగాణకు ఆరాధ్యం.. బోనం



తెలంగాణ ప్రాంతంలో అత్యంత వైభవంగా జరుపుకునే పండుగలలో ఒకటి పెద్ద పండుగ బోనాలు పండుగ. తెలంగాణ ప్రజలు తమ సంస్కృతిక చిహ్నంగా భావిస్తూ అత్యంత వైభవంగా జరుపుకునే పెద్ద పండుగ బోనాలు ఈ బోనాలకు శతాబ్దాల చరిత్ర ఉంది ఆషాడమాసంలో జరుపుకునే బోనాలు తెలంగాణ సంస్కృతికి చిహ్నం అని చెప్పవచ్చు. సాంస్కృతి సాంప్రదాయాలకు చిహ్నంగా భావించే బోనాలు పండుగకు శతాబ్దాల చరిత్ర ఉంది. కాకతీయుల కాలం నుండి ఈ బోనాల పండుగ ఉండేది. కాకతీయ దేవత ముందట అప్పుడే శుచిగా వండిన అన్నం తీసి అమ్మవారి ముందు కుంభంగా పోసి మాతను ఆరాధించేవారు. అప్పటినుండి అనేక విధాలుగా ముందుకు సాగుతూ ఆ ఆనవాయితీ నేడు ఎంతో ప్రసిద్ధి చెంది విరాజిల్లుతుంది.

1869వ సంవత్సరంలో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలలో మలేరియా వ్యాధి ప్రబలి అప్పుడు తీవ్ర జన నష్టం జరిగింది. అమ్మకు కోపం వచ్చిందని నమ్మకంతో ఉత్సవాలు జరిపించాలని నిర్ణయించుకున్నారు.అది బోనాల పండుగ. ఆషాడ మాసంలో జరుపుకునే బోనాల పండుగ హైదరాబాద్, సికింద్రాబాద్ నాలోనే కాకుండా తెలంగాణ అంతటా వైభవంగా జరుపుకుంటారు. ఒక విధంగా ఈ పండుగ యొక్క ముఖ్య ఉద్దేశాన్ని ఒక క్రమంలో అప్పట్లో జరిగిన సంఘటనలను పరిశీలిస్తే మలేరియా,కలరా, మసూచి ఇతర అంటు వ్యాధులు అందరికీ రాకుండా ఉండడం కోసం, ప్రకృతి బీభత్సాలు జరగకుండా, పాడిపంటలను తమ పిల్లలైన సంతానాన్ని అమ్మవారు చల్లగా చూడాలని ఆమెకు బోనం సమర్పిస్తారు. ఉగాది తర్వాత చాలా రోజుల తర్వాత వచ్చే మొదటి పండుగ 'బోనాల పండుగ'. బోనాలు గోల్కొండ కోటలోనూ జంటనగరాలలోనూ, సికింద్రాబాద్ లోని ఉజ్జయిని మాత మహంకాళి ఆలయంలో జరుపుకునే పండుగకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. హైదరాబాద్ లోనే 45 ప్రధాన ఆలయాలలో కూడా లక్షలాదిమంది భక్తులు బోనాలు అమ్మవారికి సమర్పించుకుంటారు. జంట నగరాలలో మొదట గోల్కొండ కోటలో జగదాంబికా ఆలయంలో ప్రతి ఆషాడ మాసంలో ఆది మంగళ గురువారాల్లో బోనాల సమర్పణ పూజలు జరుగుతాయి. గోల్కొండ లో కాకతీయుల కాలం నుంచి బోనాల జాతర జరుగుతున్నట్లు చరిత్రకారులు అంటున్నారు. కాకతీయుల నుంచి కుతుబ్షాహీలు అధికారాన్ని హస్తగతం చేసుకున్న వారి పాలనలో కూడా జరిగింది.

ఇక లాల్ దర్వాజా విషయంలో 1908వ సంవత్సరంలో మూసీ నది పొంగడంతో (వరదలా ) నగరవాసులు వారి యొక్క బతుకులు చిన్నాభిన్నం కావడం అప్పట్లో జరిగిన ఒక పెద్ద ఉదంతం. అప్పుడు వందల మంది ప్రాణాలు కోల్పోయారు. అప్పటి నిజాం మీర్ మహబూబ్ అలీ ఖాన్ బంగారు చాటలో పట్టుచీర, ముత్యాలు, గాజులు, పసుపు కుంకుమను లాల్ దర్వాజా లోని ఆలయంలో పూజలు చేయించిన సందర్భంగా వరదలు ఆగినయని అంటారు. అప్పటి నుండి లాల్ దర్వాజా ప్రజలు అమ్మవారిని దైవంగా కొలిచి తమ గుండెల్లో నిలుపుకుంటున్న విశేషం ఇప్పటికీ కొనసాగుతుంది.

ఆషాడ మాసంలో అమ్మ ఇంటికి వస్తుందని అమ్మకు నైవేద్యం పెట్టాలని అందుకనే ప్రజలందరూ వెళ్లి అమ్మవారికి నైవేద్యం పెట్టడం తెలంగాణ ప్రజలలో ఒకప్రగాఢ నమ్మకం. తెలంగాణ ప్రజలు అమ్మవారిని తమ తల్లిగా, ఇంటి ఆడపడుచు గా భావించి పూజిస్తారు.

-డా. చిటికెన కిరణ్ కుమార్
9490841284

### బోనాల పండుగ

ఆ కొండలు
అచ్చం బోనం కుండలు!
భూ తల్లి ఎత్తిన
దీప శిఖ ల కలశాలు!
కొండల చుట్టూరా చెట్లు
బోనాలకు వేపాకులు కట్టినట్లు!
కను విందు లు చేసే
అందాల పూ రెమ్మలు!
పసుపు - ఎర్రెర్రని వన్నె పూలు
బోనాలకు పసుపుకుంకుం బొట్లు!
తెల్లని పూవులు తీర్చిదిద్దినట్లు

తెల్లారే సరికల్లా వేసిన ముగ్గులు!
అలంకరించిన అమ్మవారి
ప్రతిమలు
అందమైన ఆకట్టుకునే ఘటాలు!
రెప రెప ల జెండాల కడి
అమ్మ వారి అనుగ్రహ ఊరడి!
పసుపు బండారు వేషాలు
కల్లు సాకల బోనాలు!
అనురాగాల ఒడి బియ్యాలు
చీర సారె ల వాయినాలు!
మొక్కిన మొక్కుల తొట్టెలలు
గుగ్గిలం మైసాచ్చుల పొగలు!
డిల్లెం పల్లెం డీ జే ల మోతలు

అమ్మ వారికి ఆహ్వానాలు!
సిగాలూగే శివసత్తులు
భక్తి పారవశ్యాల పూనకాలు !
గాలి కి రాలే పండ్లు - కాయలు
పోత రాజు గావు రంగాలు!
ఆషాడం వాన చినుకులు
ప్రకృతి మాత కు పానకాలు!
ఉరుములు - మెరుపులు
భవిష్య వాణి మధుర పలుకులు!

- పల్లోళ్ళ బక్కారెడ్డి
9705315250

### రైతు కథ

విత్తం లేక
విత్తనం లేక
సారం లేక
సాగుబడి లేక
ఎరువులు లేక
ఏరువాక లేక
దిగుబడి లేక
గిట్టుబాటు లేక
ఆకలి పస్తులతో
తాకట్టు పుస్తెలతో
రైతు పడే వెతలు

రేపటి తరాలలో
కాకూడదు
'అనగనగా ఒక రైతు'
అని చెప్పుకునే
చరిత్రలో
నిలిచిపోయే
కథలు....

- కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239



## అంగన్వాడి కేంద్రాల్లో ఫ్రీ స్కూల్ పిల్లల నమోదు పెంచాలి



- సిడిపిఓ వాణిశ్రీ

జగిత్యాల జూన్ 28( మనం ప్రతినిధి)ః అంగన్వాడి కేంద్రాల్లో ఫ్రీ స్కూల్ పిల్లల నమోదు పెంచాలి అని ధర్మపురి ప్రాజెక్ట్ సిడిపిఓ వాణిశ్రీ అన్నారు. శనివారం బీర్పూర్, సారంగాపూర్ సెక్టార్ల మీటింగ్లో భాగంగా టీచర్లకు ప్రీస్కూల్ పిల్లల నమోదు పెంచడం కొరకు సమావేశం నిర్వహించారు. ఈ ఈ కార్యక్రమానికి సిడిపిఓ వాణిశ్రీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ శ్యామ్, మ్యామ్ పిల్లల యొక్క మెడికల్ చెకప్స్ ఫాలో అప్స్ గురించి తగిన శ్రద్ధ తీసుకోవాలని సలహాలు సూచనలు అంగన్వాడీ టీచర్స్ కి ఇవ్వడం జరిగింది. అదేవిధంగా అన్ని అంగన్వాడీ కేంద్రాలలో కిచెన్ గార్డెన్స్ డెవలప్ చేయాలని , వర్షాకాలం లో వచ్చేటటువంటి సీజనల్ వ్యాధుల గురించి తల్లులకు అవగాహన ఇవ్వాలని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారికి తగిన సూచనలు ఇవ్వాలని అంగన్వాడీ టీచర్స్ కు అవగాహన కల్పించారు. అనంతరం ఆషాడ మాసం సందర్భంగా గోరింటాకు సంబరాలు సెక్టార్ మీటింగ్లో వనభోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్స్ శైలజ, లత లు రెండు మండలాల్లోని అంగన్వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

# మంథని సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పని చేయాలి

- ఎరువులు, విత్తనాల సరఫరా పట్ల రైతులు ఆందోళన చెందవద్దు
- భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యుత్ శాఖ ఇన్ ఫ్రా ఏర్పాటు
- మంథని ఆసుపత్రిలో రోగులను ఇతర ఆసుపత్రికి రిఫర్ చేయడం మానివేయాలి
- పైలెట్ ప్రాజెక్టు క్రింద ఒక రేషన్ షాపు వద్ద సూపర్ మార్కెట్ ఏర్పాటుకు ప్రణాళిక
- ఎస్సారెస్పీ కాల్వలలో సిల్ట్ తొలగింపు చర్యలు తీసుకోవాలి
- మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు




పెద్దపల్లి/మంథని, జూన్ 28 (మనం ప్రతినిధి)ః మంథని సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పని చేయాలని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. శనివారం మంథని పట్టణంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి శివ కిరణ్ గార్డెన్స్లో 4 మండలాల అధికారులతో అభివృద్ధి పనుల పై సమీక్ష నిర్వహించారు. విద్యుత్ శాఖ, పౌరసరఫరాల శాఖ, సింగరేణి, జాతీయ రహదారుల భూ సేకరణ, వైద్య శాఖ, మిషన్ భగీరథ శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ, విద్యా శాఖ, నీటిపారుదల శాఖ పని తీరు సంబంధిత అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మంథని ప్రాంతంలో రైతులకు ఎరువులు విత్తనాలు స్టాక్ కొడుతూ ఉందని దుష్ప్రచారం జరుగుతుందని, మన దగ్గర అవసరానికి మించి స్టాక్ సమృద్ధిగా అందుబాటులో ఉందని ఎవరు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. భవిష్యత్తు విద్యుత్ అవసరాలను, పీక్ డిమాండ్ దృష్టిలో ఉంచుకొని మంథని ప్రాంతంలో అవసరమైన సబ్ స్టేషన్, అదనపు విద్యుత్ లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గంగదేవిపల్లి లో సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు వారం రోజులలో శంకుస్థాపన చేయాలని, మచ్చుపేట లో 132 కేవి సబ్ స్టేషన్ ఏర్పాటు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. మంథని పట్టణంలో విద్యుత్ సరఫరా హెచ్చుతగ్గులు (ఫ్లక్చువేషన్) జరుగుతుందని, దీనిని వెంటనే ఎస్ఈ ప్రత్యేకంగా సమీక్షించి పరిష్కరించాలని అన్నారు. ప్రతి సబ్ స్టేషన్ వారిగా గ్రామాల్లో విద్యుత్ సరఫరా సమస్యలు లేకుండా పరిష్కరించాలని, రాబోయే 3 నెలల పాటు విద్యుత్ సరఫరా చాలా కీలకమని, అధికారులు అప్రమత్తం ఉండాలని మంత్రి తెలిపారు. సన్న బియ్యం సరఫరాకు సంబంధించి ప్రజలలో స్పందన తెలుసుకోవాలని అన్నారు. మంథని పరిధిలో నూతనంగా 1417 రేషన్ కార్డులు జారీ చేశామని, 12 వేల 559 సభ్యులకు అదనంగా రేషన్ అందుతుందని అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి తప్పనిసరిగా పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు రేషన్ కార్డులు జారీ చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు అంశంలో ఎక్కడ కోతలకు ఆస్కారం ఉండడానికి వీలు లేదని అన్నారు. మంథని ప్రాంతంలో పైలెట్ ప్రాజెక్టు క్రింద రేషన్ షాపు వద్ద చిన్న సూపర్ మార్కెట్ ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ కు మంత్రి సూచించారు. రేషన్ షాపు లకు ప్రత్యేక గుర్తింపు ఉండేలా చూడాలని అన్నారు. మంథని ఆసుపత్రికి వచ్చే రోగులను అధికంగా గోదావరిఖని, పెద్దపల్లి ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఈ పద్ధతి వెంటనే మార్చుకోవాలని, ఆసుపత్రికి వచ్చే రోగులను తప్పనిసరిగా అటెండ్ కావాలని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మంథని ఆసుపత్రిలో బయో మెట్రిక్ విధానం ద్వారా అటెండెన్స్ నమోదు చేయాలని అన్నారు. ఆసుపత్రి పని తీరు పై ప్రత్యేకంగా వచ్చే నెల సమావేశం ఉంటుందని , పని తీరు ఇంప్రూవ్ కావాలని అన్నారు. మంథని ప్రాంతంలో వైద్య శాఖ పరిధిలో సబ్ సెంటర్ల నిర్మాణ పనుల పురోగతి పై సమీక్ష నిర్వహించి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకుని రావాలని మంత్రి డి.ఎం.హెచ్.ఓ ను ఆదేశించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవసరమైన అన్ని పరికరాలు, సామాగ్రి అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ కు మంత్రి సూచించారు. మంథని పట్టణ ప్రజలకు త్రాగు నీటి సరఫరా స్థిరీకరణ చేసేందుకు మిషన్ భగీరథ తో పాటు పాత వ్యవస్థ పునరుద్ధరణకు ప్రతిపాదనలు వారం రోజులలో అందించాలని అన్నారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ పరిధిలో త్రాగునీటి సరఫరా కోసం ఉన్న పాత స్కీం పునరుద్ధరణకు గల అవకాశాలు పరిశీలించాలని అన్నారు. మంథని ప్రాంతంలో ఉన్న ఎస్సారెస్పీ కాల్వలలో సిల్ట్ తొలగింపు చర్యలు తీసుకోవాలని, రాబోయే నెల రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రతి సంవత్సరం రెగ్యులర్ గా ఉపాధి హామీ పనుల క్రింద కాల్వల డీ సిల్టింగ్ జరగాలని అన్నారు. మంథని ప్రాంతంలో పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టుల డిపిఆర్ పూర్తి చేయాలని అన్నారు. అటవీ అనుమతుల మంజూరు ప్రక్రియ, ప్రాజెక్టు డిపిఆర్ రూపకల్పన సమాంతరంగా జరగాలని అన్నారు. పోడు భూముల పట్టాలు ఉన్న రైతులను ఎట్టి పరిస్థితుల్లో ఇబ్బందులకు గురి చేయవద్దని, ఎక్కడా కొత్తగా అటవీ నరికివేత జర్గకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నూతన బస్సు రూటు కనీసం 10 రోజులు నడపాలని అన్నారు. మంథని డిపో బస్టాండ్ ఆధునీకరణ పనులు ప్రారంభించాలని, త్వరలోనే రవాణా శాఖ మంత్రి చే శంకుస్థాపన చేయడం జరుగుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం లో సిమెంట్, స్టీల్, ఇటుక ధరలు పెరగకుండా చూడాలని అన్నారు. మండల స్థాయిలో ధరల నియంత్రణ కమిటీల ద్వారా వ్యాపారులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరపాలని అన్నారు. మంథని నియోజకవర్గం పరిధిలో ఏ.సి.డి.పి క్రింద పంచాయతీ రాజ్, ఆర్ బీ క్రింద మంజూరు చేసిన పనుల పురోగతి వివరాలు వారం నాటికి తయారు చేసి అందించాలని అన్నారు.

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ సుందిళ్ళ గ్రామంలో సింగరేణి మైనింగ్ లీజు భూముల పరిహారం అర్హులకు అందించేందుకు ఎంజాయ్ మెంట్ సర్వే చేశామని, గ్రామ సభ నిర్వహించి అర్హులైన వారికి మాత్రమే పరిహారం అందేలా కృషి చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం గ్రామ సభలో క్లియర్ చేసిన 52 మంది రైతులకు వారం రోజులలో పరిహారం అందిస్తామని అన్నారు.

జాతీయ రహదారి సంబంధించి పెండింగ్ భూ సేకరణ 80 శాతం అవార్డు పాస్ చేశామని, వీరికి త్వరలోనే పరిహార చెల్లింపులు పూర్తి చేస్తామని అన్నారు. అంతకుముందు రామగిరి, ముత్తారం, మంథని, మండలాలకు సంబంధించి 4 కోట్ల విలువ గల కళ్యాణ లక్ష్మి, సిఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ. సురేష్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ దాడులు



సుల్తానాబాద్, జూన్ 28 (మనం న్యూస్): పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ దాడులు కలకలం సృష్టించాయి. మున్సిపల్ కార్యాయలంలో ఆర్ఐ వినోద్, బిల్ కలెక్టర్ విజయ్ కుమార్ లు 5 వేలు రూపాయలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన ఆర్నకొండ ప్రసాద్ ఇంటి నంబర్ కోసం గత సంవత్సర కాలం నుండి మున్సిపల్ ఆఫీస్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోగా, గత 15 రోజుల నుండి మున్సిపల్ ఉద్యోగులైన వినోద్, విజయ్ లను కలవగా పదివేల రూపాయలు లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ప్రసాద్ అవినీతి నిరోధకశాఖ అధికారులకు ఫిర్యాదు చేసాడు. ముందస్తు ఒప్పందం ప్రకారం 5 వేల రూపాయలు లంచం ఇస్తుండగా ఏసీబీ డిఎస్పీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు వలపన్ని ఇద్దరు ఉద్యోగులను పట్టుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలుస్తోంది.

## ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు

- లబ్దిదారులకు ఉచితంగా ఇసుక అందిస్తాం
- ఎస్సీ ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరిలక్ష్మణ్ కుమార్



జగిత్యాల జూన్ 28 ( మనం ప్రతినిధి )ః రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తుందని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరిలక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం జగిత్యాల జిల్లాలోని బుగ్గారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరి పత్రాలను, కళ్యాణ లక్ష్మి , షాది ముబారక్ చెక్కుల అర్హులైన లబ్ధిదారులకు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనార్టీ వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరిలక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు సత్వరమే నిర్మాణాలు పూర్తి చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. విడతల వారీగా ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇసుకను ఉచితంగా ఇస్తుందని తెలిపారు.సిమెంట్, స్టీల్ ధరలు తగ్గించేలా ప్రయత్నాలు చేస్తున్నదని వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ మాట్లాడుతూ ఇండ్ల మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు త్వరితగతిన ఇండ్ల నిర్మాణం మొదలు పెట్టాలని సూచించారు.బేస్మెంట్, ఇతర దశలు పూర్తి కాగానే గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, మున్సిపాలిటీల్లో వార్డ్ ఆఫీసర్ల దృష్టికి తీసుకెళ్లాలని, వారు ఆన్లైన్లో నిర్మాణ దశను తెలియజేసి ప్రభుత్వం నుండి బిల్లులు త్వరగా అందేలా చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలు 191 అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. కల్యాణ లక్ష్మిషాది ముబారక్ 17 చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మంత్రి పర్యటన సందర్భంగా జగిత్యాల డీఎస్పీ రఘు చందర్ పర్యవేక్షణలో ధర్మపురి, మల్యాల సీ ఐ లు రాం నరసింహ రెడ్డి, నీలం రవి, ఎస్సైలు శ్రీధర్ రెడ్డి, కుమార స్వామి, కిరణ్, కృష్ణసాగర్ రెడ్డి పోలీస్ సిబ్బందితో బందోబస్తు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రెవిన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్, తహసీల్దార్ మాజీద్, ఎంపిడిఓ అప్జల్ మియా,సంగనబట్ల దినేష్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల సుభాష్,నిశాంత్ రెడ్డి, నర్సాగౌడ్, వివేకానంద, కర్ర విక్రమ్ రెడ్డి, ఎన్నం కిషన్ రెడ్డి,గట్టు గంగారామ్, హౌసింగ్ పీడీ ప్రసాద్ సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ప్రమాద బీమా పథకం దేశానికి ఆదర్శం

### రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు



మంచిర్యాల,జూన్28 ( మనం న్యూస్)ః సింగరేణి ప్రమాద బీమా పథకం దేశానికి ఆదర్శమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు . రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు సింగరేణిలో అమలు జరుపుతున్న ఉచిత ప్రమాద బీమా పథకం కింద ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన ఒక కార్మికుని కుటుంబానికి రూ.1.20 కోట్ల బీమా సొమ్ము చెక్కును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అందజేశారు. శనివారం మహాత్మా జ్యోతి రావ్ పూలే ప్రజా భవన్ లో జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఆ చెక్కును మృతి చెందిన రామగుండం- 1 ఏరియాకు చెందిన సపోర్టు మెన్ పెండ్రి రంజిత్ కుమార్ భార్య లతకు అందజేశారు. సింగరేణి కార్మికుడు పెండ్రి రంజిత్ కుమార్ కు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో శాలరీ ఖాతా ఉంది. ఇటీవల ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతుడి నామినీగా ఉన్న భార్య లతకు రూ.1.2 కోట్ల ప్రమాద బీమా కింద చెల్లించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ, సింగరేణి సంస్థలో అమలు జరుపుతున్న రూ.1.2 కోట్ల ప్రమాద బీమా పథకం ప్రభుత్వ రంగ సంస్థలకే గాక అన్ని రాష్ట్రాలకు ఆదర్శప్రాయ మైందని, అనుకోని ప్రమాదంలో కార్మికుడు మృతి చెందినట్లయితే అతని కుటుంబం వీధిన పడకుండా ఆర్థిక భరోసా కల్పించడం కోసం ఈ పథకాన్ని అమలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, రెడ్కో వైస్ చైర్మన్, ఎండీ శ్రీమతి వినీలా, ఎస్ బీ ఐ డీజీఎం శ్రీమతి నీలాక్షి సింగ్, రీజనల్ మేనేజర్ సురేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్ డి ఎం సుభాని, తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది



- గత ప్రభుత్వం పేదవాడికి ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు
- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు

ఎలిగేడు జూన్ 28 (మనం న్యూస్): ఎలిగేడు మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం 348,రేషన్ కార్డుల లబ్ధిదారులకు రేషన్ కార్డులు,16 మంది లబ్ధిదారులకు కళ్యాణ్ లక్ష్మి 16,01,856 రూపాయల చెక్కులు 43మంది కిషాది ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ 14,21,000 రూపాయల చెక్కులు, గ్రామీణ అభివృద్ధి శాఖ డిఆర్డిఏ ఎస్సీ ఆర్ పి/ ఐకెపి ఆధ్వర్యంలో లోన్ బీమా ప్రమాద బీమా పథకం ద్వారా మండలంలో పలు గ్రామాల ఆధ్వర్యంలో 4,95,285 రూపాయల చెక్కులు పంపిణీ చేశారు పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదవాడికి ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేని ప్రభుత్వమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ యాకన్న, ఆర్ఐ జయలక్ష్మి, ఏపిఎం సుధాకర్ ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, దుగ్యాల సంతోష్ రావు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ,లబ్ధిదారులు, పాల్గొన్నారు.

# విద్యార్థులు, ప్రజల జీవితాలతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల చెలగాటం

### పెంచిన బస్ చార్జీలు, బస్ పాస్ ల చార్జీలు తగ్గించాలి

### లేని పక్షంలో బిఆర్ఎస్ పార్టీ ఆందోళన ఉధృతం చేస్తాం

### జడ్పి ఛైర్ పర్సన్ దావ వసంత సురేష్




జగిత్యాల, జూన్ 28 (మనం ప్రతినిధి)ః టోల్ ఛార్జిల పేరుతో కేంద్రం, బస్ పాస్, బస్ ఛార్జిలతో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు, ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని జగిత్యాల జిల్లా జెడ్పి తొలి ఛైర్ పర్సన్ దావ వసంత సురేష్ విమర్శించారు. పెంచిన బస్ పాస్, బస్ చార్జీలు తగ్గించాలనే డిమాండ్ తో శనివారం జగిత్యాల ఆర్టీసీ డిపో ఎదుట బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి దావ వసంత ధర్నా నిర్వహించారు. పెంచిన చార్జీలు తగ్గించాలని కోరుతూ డిపో మేనేజర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ గత ప్రభుత్వం పాలన తీరుకు భిన్నంగా ప్రజా పాలనే ధ్యేయంగా ముందుకు వెళ్తామని, మార్పు దిశగా అడుగులు వేస్తామని ప్రగల్బాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బస్ పాస్, బస్ ఛార్జిల ధరలు పెంచి నిరుపేద విద్యార్థుల తల్లితండ్రులపై ఆర్థిక భారం మోపిందని విమర్శించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో గద్దెనెక్కి పాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలపై భారం మోపడం దురదృష్టకరమని అన్నారు. హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని వసంత ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల నగరా మొగగానే రైతు భరోసా వేశారని, ఎగొట్టిన, ఇచ్చిన అర్హులకు అందని రైతు భరోసా నిధుల సంగతి ఏంటని ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యార్థులకు అందించాల్సిన రూ. 8వేల కోట్ల స్కాలర్షిప్, ఫీజు రియాంబర్స్ బకాయిలు నేటికీ చెల్లించలేదని, బెస్ట్ అవైలబుల్ స్కూల్ లకు కోట్లల్లో నిధులు రావాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇవన్నీ ఇలా ఉంటే ములిగే నక్కపై తాటి పండు పడ్డ చందాన బస్ పాస్, బస్ ఛార్జిల పేరుతో భారం మోపడం సరికాదన్నారు. మహాలక్ష్మి పథకంలోని ఉచిత బస్ సౌకర్యం పై ప్రజలకే విరక్తి వచ్చే పరిస్థితి ఏర్పడిందని బస్ ల సంఖ్యను తగ్గించి, ఉచిత ప్రయాణం అమలు చేస్తుండడంతో ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుందని వసంత దుయ్యబట్టారు. స్కూటీలు జాడ లేదని, తులం బంగారం ఊసే లేదని, మహిళలకు రూ 2500/- పెన్షన్ నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. ఎదో ఒక పథకం నామ మాత్రంగా అమలు చేయడం, ఆ పథకం పేరున సంబరాలు నిర్వహించుకోవడం, అర్భాటలతో కాలం వెళ్ళదీయడమే లక్ష్యంగా రాష్ట్రం లో పాలన సాగుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు అయ్యే వరకు పోరాటం చెయ్యడంతో పాటు, ప్రజల సమస్యలు భుజాన ఎత్తుకొని బిఆర్ఎస్ పార్టీ ముందుండి పోరాటం చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంకు పాలన చేతగాక కేసీఆర్ పై ఆయన కుటుంబ సభ్యులపై విమర్శలు చేస్తూ పబ్బం గడుపుకుంటుందని వసంత ధ్వజమెత్తారు.

**రాయికల్ కళాశాల వరకు బస్ నడపాలి :దావ వసంత......**

రాయికల్ పట్టణ శివారులోని ఇటిక్యాల సమీపంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల కు వెళ్లే విద్యార్థులు కళాశాల వరకు ప్రయాణ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారని దావ వసంత అన్నారు. రింగ్ బస్ అనగా రాయికల్ మండలం లోని ఆలూరు, వీరాపూర్, ధర్మాజిపేట్, తాట్లావాయి, కట్కాపూర్, దావన్ పెల్లి, వస్తాపూర్, ఒడ్డె లింగాపూర్, కొత్త పేట్, మూట పెల్లి, భూపతిపూర్, రామోజీ పేట్, ఇటిక్యాల గ్రామాల మీదుగా బస్ సౌకర్యం కల్పిస్తూ, ప్రభుత్వ కళాశాల వరకు బస్ నడపాలని సైతం వినతిపత్రం సమర్పించారు. కళాశాల వేళల్లో బస్ నడపాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్లు మహిపాల్ రెడ్డి,సందీప్ రావు బీఆరెస్ పార్టీ మండల పట్టణ అధ్యక్షులు తుమ్మ గంగాధర్, బర్కం మల్లేష్, అనిల్,తెలు రాజు,మాజీ జడ్పీటీసీ మహేష్, మాజీ ప్రజా ప్రతినిధులు దేవేందర్ నాయక్, తురగ శ్రీధర్ రెడ్డి, బుర్ర ప్రవీణ్ గౌడ్, జక్కుల తిరుపతి, సాయి కుమార్,మహేందర్ సీనియర్ నాయకులు కమలాకర్ రావు, గంగారెడ్డి,సాగి సత్యం రావు, చింతల గంగాధర్,నక్క గంగాధర్, ఎల్లా రాజన్న, కిషోర్, చాంద్,గంగిపెల్లి వేణు, రాజేందర్ గౌడ్,ఆదిరెడ్డి, శ్రీను, ముత్తయ్య, ప్రమోద్, మూలాస్తం శివ ప్రసాద్ మహిళా నాయకులు అనురాధ, లక్ష్మి, సులోచన యూత్ నాయకులు హరీష్, సన్నిత్ రావు, గంగారెడ్డి, ప్రతాప్, మధుకర్,ప్రణయ్, మదన్,పుధరి శ్రీను,మోహన్, షఫీ, బాలే చందు,భగవాన్, నవీన్, నరేష్, ముకిద్ బీఆరెస్ పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువు, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి




- నిర్ణీత గడువులోగా రెసిడెన్షియల్ కళాశాల నిర్మాణ పనులు పూర్తి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి/మంథని, జూన్ 28 (మనం ప్రతినిధి)ః విద్యార్థులు చదువు, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంథని మండలం రామయ్యపల్లి గ్రామంలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రెసిడెన్షియల్ పాఠశాలలో డార్మెంటరీ రూమ్, కిచెన్, జూనియర్ కళాశాల నిర్మాణ పనులు పరిశీలించారు. రెసిడెన్షియల్ పాఠశాలలోని రైస్ స్టాక్, కూరగాయలను తనిఖీ చేసిన కలెక్టర్ నీట్ గా మేయింటేన్ చేస్తున్న సిబ్బందిని అభినందించారు. విద్యార్థులతో కలెక్టర్ ఇంటారాక్ట్ అయ్యారు. విద్య బోధన ఎలా జరుగుతుంది, హాస్టల్ లో భోజనం నాణ్యత, వసతులు ఉన్నాయా, పారిశుధ్యం ఎలా ఉంటుంది, వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వినియోగించుకుంటూ బాగా చదువుకోవాలని, విద్య ద్వారా జీవితంలో మంచి మార్పులు సాధ్యం అవుతాయని, గొప్ప స్థాయికి చేరుకునేందుకు అవకాశం లభిస్తుందని అన్నారు. విద్యార్థులు నాణ్యమైన ఆహారాన్ని స్వీకరించాలని, ప్రతిరోజు కొంత వ్యాయామం చేయాలని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామల, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నెల అంటిరి.. 18 నెలలైతంది

- గౌరవెల్లి ప్రాజెక్టు కాలువలు పూర్తి కాలే
- 100 గజాలు కూడా భూసేకరణ చేయలే
- నాడు రూ.30 లక్షల పరిహారం అంటిరి
- ఇప్పుడేమో రూ.17 లక్షలా..?
- తట్టెడు మట్టి తీసారా..?
- మూడు జాతీయ అవార్డులు తీసుకువచ్చినం
- పని చేసి చూపివ్వండి
- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్



**హుస్నాబాద్, జూన్ 28(మనం న్యూస్):** అధికారంలోకి వస్తే గౌరవెల్లి ప్రాజెక్టును నెలలోనే పూర్తి చేసి చూపెడతా అన్న మంత్రి పొన్నం ప్రభాకర్ 18 నెలలవుతున్నా గౌరవెల్లి ప్రాజెక్టు పనులు పూర్తి చేయడంలో విఫలమయ్యారని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ విమర్శించారు. పట్టణ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ మాట్లాడుతూ పదేపదే మా ఇంటికి ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చిన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేదని అనడం మంత్రి పొన్నంకు ఊతపదం అయ్యిందన్నారు. అప్పుడేమో భూములు కోల్పోతు న్న రైతులకు పరిహారం రూ.30 లక్షలు ఇప్పిస్తానాని చెప్పి గ్రీన్ ట్రిబ్యూనల్‌లో కేసులు వేపించిన చరిత్ర కాంగ్రెస్ నాయకులది అని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చిన కాంగ్రెస్ సర్కార్ ఇప్పుడెమో రూ.17 లక్షలతోనే సరిపెట్టుకోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కేవలం 40 ఎకరాల భూసేకరణ మాత్రమే మిగిలి ఉందన్నారు. 18 నెలలు గడుస్తున్నా ఇంత వరకు 100 గజాలు కూడా భూసేకరణ జరగలేదన్నారు. తట్టెడు మట్టి కూడా తీయని పొన్నం గత సర్కార్ పై విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. తెలంగాణ సర్కార్ అధికారంలోకి వచ్చినపుడు హుస్నాబాద్ ప్రభుత్వాసుపత్రి కేవలం 30 పడకల ఆసుపత్రిగా ఉండేది అన్నారు. రూ.2.75 కోట్లు తీసుకువచ్చి 50 పడకల ఆసుపత్రిగా మార్చామని తెలిపారు. రూ.11 కోట్లతో మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని తీసుకువచ్చామన్నారు. ఏసిపి, మున్సిపాలిటీ, ఐఓసీ కార్యాలయం తీసుకువచ్చి అభివృద్ధి చేసామన్నారు. ప్రస్తుతం మంత్రి ఉంటున్న ఎమ్మెల్యే క్వార్టర్ నిర్మించింది..బీఆర్ఎస్ సర్కార్ అనే విషయాన్ని గుర్తు ఉంచుకోవాలన్నారు. హుస్నాబాద్‌కు మెడికల్ కళాశాల తీసుకువస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీతో ప్రజల ముంగిట ప్రకటించి నేడు సాకులు చెబుతున్నారని అన్నారు. మెడికల్ కాలేజీ లేకుండానే పి.జి.సెంటర్ ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. 100 పడకల హాస్పిటల్ కాకముందు పి.జి.స్టూడెంట్స్ ఇక్కడ ట్రైనింగ్ వచ్చేది అన్నారు. మెడికల్ కళాశాల ఏర్పాటు చేయకుండా పి.జి.సెంటర్ పెడతామంటే ఆశ్చర్యం వేసిందన్నారు. మేము స్థాపించిన పాలిటెక్నిక్ కళాశాలలోనే ఇంజనీరింగ్ కళాశాలను ప్రారంభించిన సంగతి గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. ఏసిపి, మున్సిపల్, ఐ.వో.సి.కార్యాలయం, మేము తీసుకువస్తే వాళ్లు తీసుకువచ్చినట్టు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఐ.వో.సి. కార్యాలయంలో మేము చేసిన పని మాత్రమే కనిపిస్తుందని రెండవ అంతస్థులో ఒక్క ఇటుక అయినా పెట్టారా అంటూ ప్రశ్నించారు. కొత్తపల్లి - జనగాం నుంచి నాలుగు వరుసల రహదారి కావాలని మేము ఎప్పుడో ప్రపోజల్ పెట్టామన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి గండిపల్లి ప్రాజెక్టును సందర్శించారని అన్నారు. గండిపల్లి ప్రాజెక్టు పనులు ప్రారంభం కాలేదని మాట్లాడిని సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా గండిపల్లి ప్రాజెక్టు పనులు ఎందుకు ప్రారంభించడంలేదన్నారు. హుస్నాబాద్ మున్సిపాలిటీకి మేము మూడు జాతీయ అవార్డులు తీసుకువచ్చామని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వచ్చిన తర్వాత ఎన్ని అవార్డులు తీసుకువచ్చారో చెప్పాలన్నారు. ఈ సమావేశంలో హన్మకొండ జడ్పీ మాజీ చైర్మన్ సుధీర్ కుమార్, జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మాలోతు లక్ష్మీ, భూక్యా మంగ, ఎడబోయిన రజిని, తిరుపతిరెడ్డి, సుద్దాల చంద్రయ్య, ఎం.డీ.అన్వర్, వంగ వెంకట్రాంరెడ్డి, ఆకుల వెంకట్, పెసరు సాంబరాజు, తదితరులున్నారు.



## చింతలపాలెంలో గంజాయి ముఠా గుట్టురట్టు

- నాలుగు వ్యక్తులు అరెస్టు ఒక వ్యక్తి పరారీ
- 2.7 కేజీల గంజాయి స్వాధీనం : వాటి విలువ రూ.69,600లు

**చింతలపాలెం, జూన్ 28(మనం న్యూస్):** చింతల పాలెంలో పోలీసులు గంజాయి ముఠా గుట్టు రట్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన చింతలపాలెం మండలం దొండపాడు గ్రామానికి సంబంధించిన మాడావత్ అశోక్ (21) గాంధీనగర్ తండా, కొత్తపల్లి నాగార్జున(22) దొండపాడు, నంబూరు రత్నాకర్ రెడ్డి (26) దొండపాడు, వేముల నాగరాజు(20) కేతేపల్లి సాయి ఈ ఐదుగురు స్నేహితులు గత మూడేళ్లుగా గంజాయికి బానిసలై తాగుతూ, అక్రమ డబ్బు సంపాదనకు అలవాటు పడి వీరు పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరు గ్రామం నుండి గుర్తుతెలియని వ్యక్తి వ్యక్తి ద్వారా ఐదు కేజీలు గంజాయిని కేజీ 2500 రూపాయల చొప్పున ఈనెల 21వ తారీకు నాడు కొనుగోలు చేసి 23 వ తారీఖున బైక్ పై దొండపాడు తీసుకొచ్చారు. తీసుకొచ్చిన గంజాయిని బొడ్డు బసవయ్య కాలనీలో మధుర లక్ష్మారెడ్డి ఇంటి కాలి స్థలంలో గాబు కింద దాచిపెట్టారు. శుక్రవారం ఉదయం దాచిపెట్టిన గంజాయిని పంచుకోనే సమయంలో పోలీస్ వారికి సమాచారం అందడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో కేతేపల్లి సాయి తన దగ్గర ఉన్న మూడు కేజీల గంజాయితో బైక్ పై పారిపోగా, మిగిలిన నలుగురును పోలీసు వారు పట్టుకున్నారు. వారి దగ్గర నుండి 2. 784 కేజీల సుమారు 69600 రూపాయల గంజాయిని, ఒక స్కూటీని, నాలుగు సెల్ ఫోన్ ను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు . ఈ కేసులో స్పెషల్ టాస్క్ కోదాడ రూరల్ సీఐ రజిత రెడ్డి, చింతలపాలెం ఎస్సై సందీప్ రెడ్డి వారి సిబ్బంది పాల్గొన్నారు. వీరిని డిఎస్పి శ్రీధర్ రెడ్డి అభినందించారు. అని విలేకరుల సమావేశంలో తెలియపరిచారు.

# వన మహోత్సవ లక్ష్యాన్ని చేరుకోవాలి

- ఎన్‌ఆర్‌ఈజీఎస్ కూలీల శాతం పెంచాలి
- మిషన్ భగీరథ ట్యాంకులు సకాలంలో శుభ్రం చేయాలి
- సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి



**సిద్దిపేట, జూన్ 28(మనం న్యూస్ ప్రతినిధి):** సిద్దిపేట జిల్లాలో వన మహోత్సవంలో భాగంగా సూచించిన లక్ష్యాన్ని చేరుకునేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. వన మహోత్సవంలో భాగంగా ఆయా మండలాలకు కేటాయించిన లక్ష్యాలను తప్పకుండా చేరుకోవాలని, ఎన్.ఆర్.ఈజి.ఎస్. ద్వారా గుర్తించిన పలు ప్రాంతాల్లో ఫిట్టింగ్, ప్లాంటింగ్ చేయాలని, చాటి సంరక్షణ బాధ్యతలు తీసుకున్న ఏజెన్సీలు సకాలంలో ఫర్టిలైజర్, నీటిని అందించేలా చూడాలన్నారు. ఉద్యానవన శాఖలో 1335 ఎకరాల లక్ష్యానికి గాను ఇప్పటి వరకు 428 మంది రైతులు 748 ఎకరాల్లో పలు రకాల తోటల పెంపకానికి గుర్తించినట్లు, మిగతా లక్ష్యాన్ని సైతం ఆగస్టు నెలలోపు పూర్తి చేయాలన్నారు. ఎన్.ఆర్.ఈ.జి.ఎస్. కూలీల శాతం పెంచాలని, నిర్మాణం చేపట్టిన సిసి రోడ్లు, డ్రైనేజీలు, అంగన్వాడీ భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు ఇంజనీరొంగ్ అధికారులు తరుచూ పర్యవేక్షణ చేస్తూ సకాలంలో నాణ్యతతో పూర్తయ్యేలా చూడాలన్నారు. అదేవిధంగా వర్షాకాలం సందర్భంగా ప్రజలకు మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా వాటర్ ట్యాంకులను సకాలంలో శుభ్రం చేయాలని, ఎప్పటి కప్పుడు నీటి శాంపిల్స్ ల్యాబ్ కు పంపించి నీరు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అనంతర స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ 2025 గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జెడ్పీ సి.ఈఓ, రమేష్, డిఆర్డీఓ జయదేవ్ ఆర్య దీపఓ దేవకీ దేవి, వంచా యతీ రాజ్ ఈఈలు శ్రీనివాస్ రెడ్డి, చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

# విధులతో పాటు ఆరోగ్యమూ ప్రధానమే

- ఏ సమస్య ఉన్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలి
- ఏ.ఆర్. అడిషనల్ డిసిపీ సుభాష్ చంద్రబోస్
- పోలీస్ అధికారులు, సిబ్బందికి వీక్లీ పరేడ్



**సిద్దిపేట రూరల్, జూన్ 28(మనం న్యూస్):** నిత్యం శాంతి పరిరక్షణలతో పాటు ప్రజలకు రక్షణ కల్పించేందుకు విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బందికి విధులతో పాటు తమ ఆరోగ్యం కూడా ముఖ్యమేనని ఏఆర్ అడిషనల్ డిసిపి సుభాష్ చంద్రబోస్ అన్నారు. శనివారం రోజున పెద్ద కోడూరు గ్రామ శివారులోని సి.ఏ.ఆర్. హెడ్ క్వార్టర్స్‌లో సివిల్, ఆర్మ్ డ్ రిజర్వ్ పోలీస్, సిబ్బంది డి వీక్లీ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డిసిపి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ వీక్లీ షరేడ్ ద్వారా పోలీస్ అధికారులు, సిబ్బందికి ఫిజికల్ ఫిట్నెస్‌తో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఎంతగానో దోహదపడుతుం దన్నారు. నిరంతరం వ్యాయామం చేయడం చాలా ముఖ్యమని, దీని ద్వారా శక్తి సామర్థ్యాలతో ఎలాంటి అనారోగ్యానికి గురి కాకుండా ఉంటారన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని, మోటార్ సైకిల్ నడిపే సమయంలో హెల్మెట్ తప్పకుండా ధరించాలని సూచించారు. ఎవరికైనా వ్యక్తిగతమైన లేదా విధులకు సంబంధించి ఏదైనా ఇబ్బంది ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఎసిపి రవిందర్ రెడ్డి, రిజర్వ్ ఇన్ స్పెక్టర్లు రాజేష్, కార్తీక్, ఇన్ సె క్టర్లు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిందితులకు శిక్ష పడేలా.. కోర్ట్ డ్యూటీ ఆఫీసర్లు కృషి చేయాలి



జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల, జూన్ 28(మనం ప్రతినిధి):** కోర్టు కేసులలో శిక్షల శాతాన్ని పెంచడం, తప్పు చేసిన నిందితులకు శిక్ష పడేలా చేయడం ద్వారా ప్రజలకు పోలీస్ శాఖపై మరింత గౌరవం, నమ్మకం పెరుగుతుందని జిల్లా ఎస్పి అశోక్ కుమార్ ఐపిఎస్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో కోర్టు డ్యూటీ కానిస్టేబుల్ లతో ఎస్పి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ కోర్టు కేసుల్లో నిందుతులకు శిక్షలు పడినప్పుడే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, ఇందుకు అనుగుణంగా కేసులు పెండింగులో లేకుండా చూసుకోవాలని అన్నారు.కోర్టు కానిస్టేబుల్ బాధ్యత చాలా కీలకమైనదని, ఎఫ్ఐఆర్ నమోదు అయినప్పటి నుండి కేసు పూర్తయ్యేంతవరకు నిందితుల నేరాలను నిరూపించేందుకు అవసరమైన రుజువులు, పత్రాలు, సాక్షుల వాగ్మూలం ను కోర్టుకు సమర్పించడంలో కోర్టు పోలీసు అధికారులు వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని సూచించారు. సాక్షులను,బాధితులను సమయానికి కోర్టులో హాజరు పరిచేలా చూసుకోవాలని, బాధితులకు, సాక్షులకు కేసుకు సంబంధించిన విషయాలలో అవగాహన కల్పించాలని అన్నారు. కోర్టు సమాచారం ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్ కు తెలియజేయాలని, కేసు ట్రయల్స్ సమయంలో పిపిల సలహాలు సూచనలు స్వీకరించాలని సూచించారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసుల పరిష్కారానికి సంబంధించి పలువురు కోర్టు కానిస్టేబుళ్లను అడిగి కేసుల పురోగతిపై సూచనలు చేశారు. కోర్టుల్లో పెండింగ్ లో ఉన్న కేసులు, వారెంట్స్, సమన్స్ తదితర అంశాలను సమీక్షించారు. ఈ సమావేశం లో డిసిఆర్‌బి, ఎస్‌బి ఐటీ కోర్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, ఆరిఫ్ అలీ ఖాన్, రఫీక్ ఖాన్, సిఎంఎస్ ఎస్.ఐ శ్రీకాంత్, జిల్లాలోని పోలీస్ స్టేషన్ల కోర్టు డ్యూటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ గూడు కల్పించేలా చర్యలు

- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ప్రారంభం
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూజల హరికృష్ణ



**సిద్దిపేట రూరల్, జూన్ 28(మనం న్యూస్):** రాష్ట్ర వ్యాప్తంగా ఇండ్లు లేని అర్హులైన పేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లు నిర్మించాలనే లక్ష్యంతోనే ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించిందని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ పూజల హరికృష్ణ అన్నారు. నారాయణరావుపేట మండలంలో బాగన్నగారి కర్ణాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంటి భూమి పూజ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, దీని ద్వారా ఎంతో మంది ఇల్లు లేని నిరుపేదల సొంతింటి కల సాకారం అయ్యే రోజులు త్వరలోనే ఉన్నాయన్నారు. ప్రజల కళ్లలో ఆనందం చూడడమే ప్రజాప్రతినిధులుగా తమ లక్ష్యమని, ఇందుకు గాను ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించేందుకు తాము ఎల్లప్పుడూ ముందుంటామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇం ద్ల ద్వారా అందరికీ ఇల్లును సుసాధ్యం చేస్తుందని, ఇల్లు నిర్మించుకోలేని వారికి లోన్ సైతం ఇప్పించే వెస్తులుబాటు కల్పించిందన్నారు. కావున స్థలం ఉండి ఇల్లు లేని వారు, స్థలం లేని వారు సొంతింటి కోసం కలలుగనే ప్రతి ఒక్కరు ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బొమ్మల యాదగిరి, మండల అధ్యక్షులు ఐర్మా రామచంద్రం, డిసిసి ప్రధాన కార్యదర్శి చింతల రాజ్ వీర్, బుగ్గ రాజేశ్వర దేవస్థాన చైర్మన్ బాగన్నగారి కరుణాకర్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్య సాధనలో జిల్లాను ముందుంచాలి

- అధికారులు ఇందుకు ప్రధానంగా కృషి చేయాలి
- సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి



**సిద్దిపేట, జూన్ 28(మనం న్యూస్, ప్రతినిధి):** నిర్దేశించిన లక్ష్యాలను సాధించి జిల్లాను రాష్ట్రంలో ముందు వరుసలో నిలిపేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కే. హైమవతి అధికారులను ఆదేశించారు. శనివారం ఐడిఓసి లోని సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మత్స్య శాఖల అధికారులతో వారికి కేటాయించిన లక్ష్యాలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా అన్ని శాఖలు వారికి నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని, లక్ష్య సాధనలో వెనకబడిపోయి నట్లయితే అందుకు గల కారణాలను విశ్లేషించుకొని జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని తెలిపారు. జిల్లాలో ఆయిల్ పామాయిల సాగు పెరిగేలా రైతులను ప్రోత్సహించడం, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో సిబ్బంది పనులను అధికారులు పర్యవేక్షించాలని, మండల స్థాయిలో పెండింగ్ లో ఉన్న లక్ష్యాలను జూలై 15 లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఒకే తరహా పంటలు కాకుండా కోకో మొదలైన అంతర్ పంటలుగా చేసేలా చూడాలని సూచించారు. వ్యవసాయంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలలో రైతులను ప్రోత్సాహించాలని అన్నారు. అనంతరం ఉద్యాన దర్శిని అనే పుస్తకాన్ని కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, వ్యవసాయ శాఖ అధికారి రాధిక, ఉద్యాన శాఖ అధికారి సువర్ణ, మత్స్య శాఖ అధికారి మల్లేశం, పశుసంవర్ధక శాఖ అధికారి కొండల్ రెడ్డి పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మికి గెజిటెడ్ సంతకం అడ్డు

- ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు
- సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి



**మిరుదొడ్డి, జూన్ 28(మనం న్యూస్):** ఆడపిల్ల వివాహం చేసి కళ్యాణ లక్ష్మి కోసం దరఖాస్తు చేసుకుందామని వెళ్తే గెజిటెడ్ సంతకం తప్పనిసరి. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డికి చెందిన దొమ్మాట ఐలవ్వ, మొగుల్ల లక్ష్మిలు మాట్లాడుతూ తమ కూతుళ్ల వివాహం చేసి కళ్యాణ లక్ష్మి కోసం దరఖాస్తు చేసుకుందామంటే గెజిటెడ్ సంతకం తప్పనిసరి కావడంతో కొన్ని నెలల పాటు అధికారుల చుట్టూ తిరిగిన ప్పటికీ ఫలితం లేకుండా పోయింది. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, ఎం.ఆర్.సి, ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వద్దకు వెళ్లినప్పటికీ వాటిపై సంతకాలు పెట్టమని చెప్పడం జరుగుతుందని వాపోయారు. తాము నిరుపేద కుటుంబంలో పుట్టి ప్రభుత్వం అందించే కళ్యాణ లక్ష్మి కోసం దరఖాస్తు చేసుకొని లబ్ది పొందుదామనుకుంటే ఆఫీసుల చుట్టూ తిరగడమే తమవంతుగా ఉందన్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు, స్థానిక అధికారులు, ప్రభుత్వం స్పందించి కళ్యాణ లక్ష్మి దరఖాస్తులపై గెజిటెడ్ సంతకం చేసేలా, కళ్యాణ లక్ష్మి పథకం అందేలా చొరవ చూపాలన్నారు. లేదంటే సంతకాల కోసం అధికారిని నియమించాలన్నారు.

# తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

- పి. ప్రావీణ్య జిల్లా కలెక్టర్

**సంగారెడ్డి, జూన్ 28(మనం ప్రతినిధి):** జిల్లాలో తాగునీటి సమస్యలు లేకుండా , అన్ని ఆవాస ప్రాంతాలకు తాగునీరు సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని మంజీరా బ్యారేజీ, సింగూర్ ప్రాజెక్టు నుండి హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్సకు సరఫరా అవుతు న్న తాగునీటి వివరాలను, మంజీరా బ్యారేజ్ పరిస్థితి , నారింజ వాగు, సింగూర్ పరివాహక ప్రాంతం, వివరాలు, నూతనంగా చేపట్టిన చెరువుల కుంటల నిర్మాణం పనుల పురోగతి, తాగునీటి సరఫరాల పై నీటిపారుదల శాఖ, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, మున్సిపల్. అధికారులతో జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య , సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం బ్యారేజీల నీటి మట్టాలు ఎంత ఉన్నాయి, నీటి సరఫరా కొనసాగే పరిస్థితి , మిషన్ భగీరథ ,నీరు సరఫరా అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య, అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లాలోని అన్ని ఆవాస ప్రాంతాలకు మిషన్ భగీరథ , నీరు సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని జరాసంఘం, న్యాల్కల్ మండలాలలో అసంపూర్తిగా ఉన్న మిషన్ భగీరథ పనులు వెంటనే పూర్తీ అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని గురుకుల సంక్షేమ పాఠశాలలో వసతి గృహాలు అంగన్వాడీ కేంద్రాలకు తాగునీరు సరఫరాయి మంచినీటి కనెక్షన్లు ఏర్పాటు చేయాలని మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని లీకేజీలకు అవసరమైన మరమత్తు పనులు వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు. అన్ని రకాల చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని ప్రజలకు అన్ని ఆవాస ప్రాంతాలకు మిషన్ భగీరథ కుళాయిల ద్వారా నాణ్యమైన తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మిషన్ భగీరథ డి ఈ రఘువీర్, ఏ ఏ పాషా , ఈ ఈ పబ్లిక్ హెల్త్ కృష్ణ మోహన్, నీటి పారుదల శాఖ అధికారులు, మున్సిపల్ ఇంజనీర్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష

- ఉపాధి హామీ పథకంపై సూచనలు



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 28 (మనంప్రతినిధి):** జిల్లాలోని అన్ని మండలాల ఎంపిటిసిలు మండల పంచాయతీ ఎఇలు, మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ఎపిఓలతో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన యావరేజ్ పేజ్ రేట్ కు సంభందించి కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని మండలాలలో ఉపాధి హామీ పథకం వేతనదారులకు అధిక వేతనం పొందేందుకు కనీసం రోజుకు 5 నుండి 6 గంటలు పనిచేసేటట్లు చూడాలని, సరైన మార్కింగ్ ద్వారా కనీస వేతనం రోజుకు 300 రూపాయలు వచ్చేటట్లు చూడాలని, గ్రామ పంచాయితీ భవనాలు, అంగన్ వాడీ కేంద్రాలకు స్థలాలు గుర్తించిన వాటిని వెంటనే పని ప్రారంభించాలని, స్థలాలు గుర్తించని వాటికి వెంటనే గుర్తించాలని, ఎంపిడిఓ లకు ఆదేశాలు జారీచేశారు. రాబోయే వారం రోజుల లోపల ఉపాధి హామీ పథకం షోషల్ ఆడిట్ పేరాలకు సంబంధించిన రిప్లైలు పంపించాలని, అలాగే వనమహోత్సవ కార్యక్రమములో మొక్కలు నాటేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ఇరిగేషన్ చెందిన కెనాల్స్ నందు ఇరువైపులా పెద్ద స్థాయిలో (10 వరుసలలో) మొక్కలు నాటించాలని, ప్రతినర్సరీలలో ఖాళీ సంచులలో ఈత, తాటి మొక్కలు పెంచాలని అధికారులను ఆదేసించారు. జిల్లాలోని ఉపాధి హామీ పథకము వేతనదారులకు మరియు స్వయం సహాయక సభ్యులను ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి యోజన పాలసీల నందు నమోదు చేయించాలని అధికారులను జిల్లా కలెక్టర్ కోరారు. ఉపాధి హామీ పథకం అన్ని పనులు అనగా రోడ్ల నిర్మాణాలు, భూమి అభివృద్ధి పనులు మొదలైన పనులను ఇజియస్ నియమ నిబంధనల ననుసరించి చేపట్టాలని, లేనియెడల క్రమశిక్షణా చర్యలు తీసుకొన బడతాయని హెచ్చరించారు. స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ ఫేజ్- లో భాగంగా కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ జిల్లాలో 16 మంజూరి చేశారు. అందులో 4 మాత్రమే పని ప్రారంభించాయని, మిగిలిన 12 పనులను 3 రోజులలో ప్రారంభించ వలసినదిగా ఆదేశించారు. 429 డ్రైన్ యండ్ కమ్యూనిటి సోక్ పిట్స్ మంజూరి అయ్యాయని, వీటిని వారం రోజులలో ప్రారంభించవలసినదిగా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్, 2025 సర్వే లో భాగంగా అన్ని ఇండ్లకు ఇంకుడు గుంతలు నిర్మించాలని, గ్రామాలలో పరిసరాల పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని, పంచాయితీలలోని ప్రభుత్వ కార్యాలయాలన్నీ పరిశుభ్రంగా ఉంచాలని తెలియజేసారు.

అలాగే పారిశుద్యం పై జరిగే సర్వే లో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం అవుతూ వారి యొక్క వ్యక్తిగత అభిప్రాయాన్ని సిటిజన్ ఫీడ్ బ్యాక్ ద్వారా తెలియజేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో యం. విద్యాచందన, అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ ఇంచార్జి మరియు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, బి. నాగలక్ష్మి, ముఖ్య కార్య నిర్వహణ అధికారి, జిల్లా ప్రజా పరిషత్, శ్రీనివాసరావు, జిల్లా పంచాయితీ ఇంజనీరింగ్ అధికారి, సత్యనారాయణ, ఇఇ పి ఆర్, భద్రాచలం డివిజన్, యన్. రవి, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మరియు అందరు ఎంపిడిఓ లు, మండల పి ఆర్ ఎఇ లు మరియు ఉపాధి హామీ పథకము ఎపిఓ లు సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

## ఘనంగా పివి జయంతి వేడుకలు



**ఖమ్మం, జూన్ 28(మనం న్యూస్):** మాజీ ప్రధాని పి వి నరసింహారావు 104వ జయంతి వేడుకల్ని ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత పివి నర్సింహారావు చిత్ర పటానికి జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పివి న్యాయవాది అని, 1957 లో శాసనసభ్యుడిగా రాజకీయ జీవితం ఆరంభించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా, భారతదేశానికి తొమ్మిదవ ప్రధాన మంత్రిగా 1991 నుండి 1996 వరకు పనిచేశారని అన్నారు. పివి బహుభాషావేత్త అని, ప్రధాని పదవిని అధిష్టించిన మొదటి దక్షిణాది వ్యక్తి అని అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మమైన సంస్కరణలకు బీజం వేసి, కుంటుబడ్డ వ్యవస్థను తిరిగి పట్టాలెక్కించిన ఘనతను సొంతం చేసుకొన్న మేధావి అని అన్నారు. ఆయన చూపిన బాటలో నడవడమే వారికిచ్చే ఘన నివాళులు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, రాష్ట్ర యువజన కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ కుమార్, నగర ఓబీసీ సెల్ అద్యక్షులు బాణాల లక్ష్మణ్, కార్పొరేటర్లు మలీదు వేంకటేశ్వరరావు, దుద్దుకూరి వేంకటేశ్వరరావు, లకావత్ సైదులు నాయక్, రాపర్తి శరత్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్దినేని రమేష్, మూడుముంతల గంగరాజు యాదవ్, మాజి కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరరావు ,కన్నం వైష్ణవిప్రసన్నకృష్ణ, రజీ భాయ్, అల్లే సాయికిరణ్, నూకారపు వేంకటేశ్వరరావు, యూసఫ్, జాకీర్ హుస్సేన్, కమతం రామకృష్ణ, బండి నాగేశ్వరరావు, లింగాల రవికుమార్, బోడా శ్రావణ్, బచ్చలకూరి నాగరాజు, మహమూద్, సంపటం నరసింహారావు, గడ్డం వెంకటయ్య, బీరెడ్డి రమేష్, భూక్యా సురేష్ నాయక్, పర్వత శ్రీనివాస్, కె నారాయణ, దొడ్డా ప్రవీణ్, ఏలూరి రవికుమార్, కాళంగి కనకరాజు, రమణ, ఫరీద్ ఖాద్రి, రాకేష్, ఆత్మ కమిటీ డైరెక్టర్ తూములూరి లక్ష్మీనరసింహారావు, హరినాథ్, ఊరుకొండ చంద్రిక, కొత్తపల్లి పుష్ప, చల్లా ప్రతిభారెడ్డి, బలుసు లక్ష్మి, సుగుణ నీలవేణి, ఆర్ కె తదితర నాయకులు పాల్గొన్నారు.

## క్లినికల్ శిక్షణకు జూలై 11లోగా దరఖాస్తు చేసుకోవాలి

- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవిబాబు

**ఖమ్మం, జూన్ 28(మనం న్యూస్):** ఇంటర్మీడియట్ ఎం.పీ.హెచ్.డబ్ల్యూ. (ఫిమేల్ ) ఒకేషనల్ కోర్సులో మార్చి 2020 నుండి ఉత్తీర్ణులైన వారికి ఖమ్మం జిల్లాలోని ఏరియా ఆసుపత్రులు తిరుమలాయపాలెం, సత్తుపల్లి, మధిర నందు ఒక సంవత్సరం క్లినికల్ శిక్షణ అందించనున్నట్లు, శిక్షణకు ఎంపికైన వారు వెయ్యి రూపాయలు ఆసుపత్రి పేరునా డి.డి. రూపంలో చెల్లించాలని, గతంలో దరఖాస్తు చేసుకోని, ఎంపిక కాని వారు కూడా తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవి బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు తమ బయోడేటా ఫారంతో పది రూపాయల పోస్టల్ స్టాంప్ అతికించిన స్వంత చిరునామా కవర్, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలను జతపరిచి కలెక్టరేట్ లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో జూలై 11 లోగా అందజేయాలని రవిబాబు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు త్వరితగతిన నిర్మించుకోవాలి...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ఉచిత ఇసుక, మట్టి అందజేస్తాం
- మంజూరు ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ వెంటనే చేపట్టాలి
- సత్తుపల్లి, పెనుబల్లి మండలాల్లో కలెక్టర్ పర్యటన



**ఖమ్మం, జూన్ 28(మనం న్యూస్):** గ్రౌండింగ్ అయిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సత్తుపల్లి మండలం కొత్తూరు, పెనుబల్లి మండలం రామచంద్రరావు బంజర గ్రామాల్లో పర్యటించి, నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పురోగతి ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. లబ్దిదారులతో సమస్యలు ఉన్నాయా, ఇసుక ఉచితంగా ఇస్తున్నారా, అధికారుల సహకారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మంజూరు ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ వంద శాతం చేయాలన్నారు. ముగ్గు వేయించి, రికార్డు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సత్తుపల్లి మండలానికి 576 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, 467 ఇండ్లు నిర్మాణాలు ప్రారంభం అవగా, పెనుబల్లి మండలంలో 612 మంజూరయిన ఇండ్లలో 541 ఇండ్లు నిర్మాణంలో వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మండలానికి ఎంత మేర ఇసుక, మట్టి అవసరమో, ముందుగానే డంప్ చేసుకోవాలని, ఎఇ ద్వారా సంబంధిత తహసీల్దార్ కూపన్లు జారీచేస్తారని, అట్టి కూపన్లతో లబ్ధిదారులు పొందవచ్చని అన్నారు. ప్రతి సోమవారం నిర్మాణాలు పూర్తయిన లబ్ధిదారులకు డబ్బులు వారి ఖాతాల్లో జమ అవుతాయన్నారు. కొత్తూరు గ్రామంలోని రేకుల కాలనీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తిచేసుకొని, ఇందిరమ్మ ఇండ్ల కాలనిగా రూపుదిద్దుకోవాలని కలెక్టర్ అన్నారు. నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకొని గృహ ప్రవేశానికి పిలవాలని లబ్దిదారులతో అన్నారు. కలెక్టర్ క్షేత్ర పరిశీలన సందర్భంగా కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, ఎంపిడివో లు నాగేశ్వరరావు, అన్నపూర్ణ, తహశీల్దార్లు సత్యనారాయణ, నారాయణ మూర్తి, హౌజింగ్ ఏఇ లు పవన్ కళ్యాణ్, కమల్, అధికారులు, తదితరులు ఉన్నారు.

## కోయగూడెం ఉపరితల గనిలో పర్యటించిన సింగరేణి డైరెక్టర్ గౌతమ్ పోట్రు



**టేకులపల్లి, జూన్28,(మనం న్యూస్):** కోయగూడెం ఉపరితలగనిలో శనివారం సింగరేణి డైరెక్టర్ గౌతమ్ పోట్రు పర్యటించారు. వ్యూ పాయింట్ ద్వారా బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించి అక్కడ జరుగుతున్న రోజు వారి బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబి బ్లాస్టింగ్, లోడింగ్ పనులను జి.యం వి.కృష్ణయ్య ను అడిగి తెలుసుకున్నారు. ఓ.సిలో సర్ఫేస్ మైనర్ భారీ యంత్రం ద్వారా ఉత్పత్తి ప్రక్రియను, బొగ్గు నాణ్యతను పరిశీలించి వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని, బొగ్గు ఉత్పత్తి, రవాణా రోజు వారి లక్ష్యాలను అధికమించి రవాణాకు ఎటువంటి ఆటంకములు కలుగకుండా ముందస్తు జాగ్రతలతో బొగ్గు నాణ్యత సామర్థ్యం ఉత్పతి ఐయే లాగా చూడాలని అన్నారు. ఉపరితలగనుల్లో ఉద్యోగులకు రక్షణ పరమైన జాగ్రత్తలతో బొగ్గు ఉత్పత్తి తీయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యస్వోటు జియం జాకీర్ హుస్సేన్, కోయగూడెం పి.ఓ గోవింద రావు, డీజీఎం పర్సనల్ అజ్మీర తుకారం, ఇల్లందు ఏరియా ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జూలై 9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

- బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ కోటం రాజు




**భద్రాచలం, జూన్ 28(మనం న్యూస్):** 1996 నిర్మాణ రంగ కార్మికుల చట్టం ఆధారంగా, రాష్ట్రాలలో ఏర్పాటు అయిన సంక్షేమ బోర్డులను రక్షించుకోవడం కోసం జూలై 9వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో నిర్మాణ రంగ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ కోటంరాజు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల 1996 నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ చట్టం రద్దయిందని పేర్కొన్నారు. ఈ చట్టం రద్దు కావటం నిర్మాణ రంగ కార్మికులకు తీరని అన్యాయం చేస్తుందని పేర్కొన్నారు. బండారు చంద్రరావు భవన్ లో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి అధ్యక్షతన జిల్లా విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆర్.కోటంరాజు మాట్లాడారు. పోరాడి సాధించుకున్న నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ చట్టాన్ని రక్షించుకోవడం కోసం సమ్మెలో అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు ప్రస్తుతం 9 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని, లేబర్ కోడులు అమలు చేస్తే ఈ సంక్షేమ పథకాలు మొత్తం రద్దు అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. 29 రకాల హక్కులను కార్మికులు కోల్పోతారని తెలిపారు. లేబర్ కోడ్లను రద్దు చేయాలని దేశవ్యాప్త సమ్మెలో నిర్మాణరంగ కార్మికులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎంబి నర్సారెడ్డి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఉప్పు తల నరసింహారావు, సిఐటియు పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు నాయకులు యర్రంశెట్టి వెంకట రామారావు, తాళ్ళూరి కృష్ణ, అనుగోజు నరసింహ చారి, గుర్రం రాములు, నాగరాజు రాంబాబు, జాకీర్ ,గుమ్మడి నాగరాజు ,పుల్లారావు, సుధాకర్ ,సుంకర వెంకటేశ్వర్లు శ్రీను, రాజబాబు, బత్తుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ పై యువత పోరాడాలి

- డాక్టర్ కె జగదీష్ బాబు ప్రముఖ న్యూరో సర్జన్ పిలుపు




**ఖమ్మం, జూన్ 28(మనం న్యూస్):** డ్రగ్స్,గంజాయి, కొకైన్, గుట్కాలు, మద్యం వంటి మత్తు పదార్థాలు సేకరించడం తినడం వలన యువత క్యాన్సర్ బ్రెయిన్ స్ట్రోక్ హార్ట్ స్ట్రోక్ వంటి శారీరిక మానసిక జబ్బులొచ్చి చనిపోతున్నారని వాటికి దూరంగా యువత ఉండాలని ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ కె జగదీష్ బాబు పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మంలో రామనరసయ్య విజ్ఞాన కేంద్రం లో ప్రగతిశీల యువజన సంఘం జిల్లా జనరల్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు జాటోత్ ప్రేమ్ సింగ్‌న జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిల్ కు హాజరైన ప్రతినిధులు యువజన అమరవీరులకు సంతాప తీర్మానాన్ని జిల్లా కార్యదర్శి ఎన్ వి రాకేష్ ప్రవేశ పెట్టారు. అనంతరం డాక్టర్ కె జగదీష్ బాబు ప్రసంగిస్తూ యువత సామాజిక సేవ భావాలను, సమాజ మార్పుకొనే ఆశయాలను కలిగి ఉండాలని అన్నారు. ప్రస్తుత సమాజం పేద ధనిక వర్గాలతో ఉన్నదని ఈ అసమానతలు తొలగిపోవాలంటే నిరంతరం యువకులు పోరాడాలని, అందుకు మంచి సిద్ధాంత బలాన్ని యువజనలు నేర్చుకుని ఆచరించాలని పిలుపునిచ్చారు. పివైఎల్ రాష్ట్ర కార్యదర్శి వి.అజయ్ మాట్లాడుతూ పాలకులు కాంగ్రెసు టీఆర్ఎస్ బిజెపి లు యువతకు ఉద్యోగాల గ్యారెంటీ ఇస్తామని వాగ్దానాలు చేసి మోసం చేస్తున్నారని ఫలితంగా యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక నిరక్షపడుతున్నారన్నారు. పాలకులు మతోన్మాదాన్ని రెచ్చగొట్టి యువతను అందులోకి లాగుతున్నారని, వారి స్వార్థప్రయోజనాలను నెరవేర్చుకుంటున్నారని ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని ఆయన విమర్శించారు. సమాజం మార్పుకై పోరాడిన అమరవీరులు భగత్ సింగ్, ఆజాద్, అల్లూరి, చేగువేరా, పగడాల వెంకన్న, వేములపల్లి కిరణ్ కుమార్, తుడుం రామయ్య బాటలో యువత పయనించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సభలో పి వై ఎల్ మాజీ రాష్ట్ర కార్యదర్శి సివై పుల్లయ్య, జిల్లా కార్యదర్శి ఎన్ వి రాకేష్ ఉపాధ్యక్షులు కూసుమోహన్ రెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి చిక్కుల భరత్, జిల్లా కోశాధికారి సంఘం అరుణ కుమారు తదితరులు ప్రసంగించారు. అనంతరం జనరల్ కౌన్సిల్ కొన్ని తీర్మానాలు చేసి ఆమోదించింది. జులై 27న హైదరాబాదులో జరిగే రాష్ట్ర జనరల్ కౌన్సిల్ జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది ప్రభుత్వ హాస్పిటల్స్ లో మెరుగైన వైద్యాన్ని ప్రజలకు అందించాలని, ప్రైవేట్ హాస్పిటల్స్ లో అధిక ఫీజులను అరికట్టాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలను కల్పించాలని మత్తు పదార్థాలను నిషేధించాలని, యువజనలకు గ్రంథాలయాలు నెలకొల్పాలని కౌన్సిల్ తీర్మానించారు. కౌన్సిల్ ప్రారంభ సూచకగా జెండా ఆవిష్కరణను జిల్లా అధ్యక్షులు జే ప్రేమ్ సింగ్ చేశారు.

## శభాష్ విశ్వామిత్ర



- అభినందించిన భద్రాద్రి జిల్లా కలెక్టర్..

**కొత్తగూడెం, జూన్ 29(మనం న్యూస్) :** పర్యావరణ పరిరక్షణ కోసం తన వంతు బాధ్యతగా కృషి చేస్తూ వాక్ ఫర్ ట్రీస్ కాన్సెప్ట్ తో ప్రతిరోజు మొక్కలు నాటుతున్న చిరంజీవి మూడు విశ్వామిత్ర చౌహాన్‌కు ఈ నెల 9న భద్రాద్రి కొత్తగూడెం డిఎఫ్ఓ కిష్టా గౌడ్‌కి అడవుల నుండి సేకరించిన వివిధ రకాల వృక్ష జాతికి సంబందించిన లక్షలాది గింజలను అందజేసినందుకు గాను ప్రశంసిస్తూ కలెక్టర్ జితేష్ వి పాటిల్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందచేశారు. ముందుగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ తో అదేవిధంగా జిల్లా అటవీ శాఖ అధికారితో కలిసి ప్రతిరోజు మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా మామిడి మొక్కలు నాటారు. ఈ సందర్బంగా కలెక్టర్, డిఎఫ్ఓ ప్రకృతి ప్రేమికుడు విశ్వామిత్ర చౌహాన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. మొక్కలు నాటిన వారిలో భద్రాచలం ఐటిడిఏ పీఓ రాహుల్, ట్రైనీ ఐఏఎస్, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**ఇల్లందు, జూన్ 28 (మనం న్యూస్):** ఇల్లందు మండలంలో శనివారం పలు గ్రామ పంచాయతీలలో ఎమ్మెల్యే కోరం కనకయ్య పర్యటించి ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారు. సిఎస్పిబస్తీ, రేపల్లెవాడ, చల్లసముద్రం, .ఒడ్డుగూడెం, ధనియాలపాడు, లచ్చగూడెం, మామిడిగుండాల, మిట్టపల్లి, రొంపేడు, కొమ్ముగూడెం, మామిడిగూడెం, తిలక్,నగర్, .విజయలక్ష్మి నగర్, .మొండితోగు, ఇందిరానగర్ పంచాయతీలలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ కనకయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం బంగారు తెలంగాణ సాధనలో ముందుండి నడుస్తుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సాధికారతను సమన్వయం చేస్తూ ప్రతి పేదవాడి ఇంటికి ప్రభుత్వ పథకాలు చేరుస్తున్నామన్నారు. ఇల్లందు నియోజకవర్గ ఐటీడీఏ గిరిజన ప్రాంతం అయినందువలన అదనంగా 1500 ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యంగా జిల్లాలో 10 కోట్ల పది లక్షలతో నాలుగు 33/11 కెవి సబ్ స్టేషన్లు మంజూరు చేశారన్నారు. నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు సుమారు 4 కోట్ల 78 లక్షల గాను 1704 మందికి చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. 25 ఎకరాలలో 200 కోట్ల రూపాయలతో ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరైందన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మండల తహశీల్దార్ రవికుమార్, ఇల్లందు ఎంపీడీవో దన్ సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, మెట్ల కృష్ణ, తాటి బిక్షం ,మూతి కృష్ణ, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, పులి సైదులు, తిరుపతి, పద్మ ,స్వాతి, సుజాత, భాగ్యమ్మ, సునీత, గంధె సదానందం, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అలరించిన సాంస్కృతిక కళా ప్రదర్శనలు

- కేటీపీఎస్ ఏడవ దశ సీఈ అభినందన




**పాల్వంచ, జూన్ 28(మనం న్యూస్):** పాకాల పాటి కృష్ణయ్య సాంస్కృతిక కళాపీఠం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర బాషా సంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీ హైదరాబాద్ వారి సౌజన్యంతో ఈనెల 28, 29, 30 తేదీలలో జరుగు కార్యక్రమాలలో భాగంగా తొలి రోజు శనివారం స్థానిక కేటీపీఎస్ సీతారామ కళ్యాణ మండపంలో కేటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ ఓ అండ్ ఎం ఏడవ దశ శేఖర్ బాబు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. మూడు రోజులు పాటు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, మధిర రంగస్థలం కళాకారుల సమైక్య అధ్యక్షులు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్, మధిర బాలోత్సవ్ కన్వీనర్ బాబులా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎస్వీఆర్ కే ఆచార్యులు, కాపర్తి వెంకటాచారి, జొన్నాడ కృష్ణ, జ్యోతిరావు పూలే జిల్లా అధ్యక్షులు ముత్యాల హనుమంతరావు, వర్తక సంఘు కన్వీనర్ కృష్ణ, నిర్వాహక కమిటీ గౌరవ అధ్యక్షులు యాసం నేని వెంకటేశ్వర్లు, కన్వీనర్ కొండం వెంకన్న, సంస్థ వ్యవస్థాపకులు , పాకాలపాటి రోశయ్యచౌదరి పాల్గొన్నారు. అనంతరం షేక్ భాషా బృందం ప్రదర్శించిన తెలంగాణ ధూంధాం, బాల నాట్య కళానిలయం డబ్బు రాము ఆధ్వర్యంలో చిన్నారుల తెలంగాణ నృత్యాలు, శాస్త్రీయ నృత్యాలు, పాండవ కృష్ణ భజన నాట్యమండలి దుమ్ముగూడెం వారిచే భక్తి గీతాలు, ఏకపాత్రాభినయ పోటీలలో భాగంగా కొమరం దామోదరావు ప్రదర్శించిన యమహో యమధర్మరాజు, గునిగంటి లక్ష్మీనారాయణ ప్రదర్శించిన విశ్వామిత్ర ఏకపాత్ర, ఎం బాలస్వామి ప్రదర్శించిన నారద పాత్ర తదనంతరం నరసరావుపేట ఎం శ్రీనివాసరావు సంగీత విద్వాసుల బృందం ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. నరసరావుపేట పసుపులేటి పున్నయ్య ప్రదర్శించిన రాయబార నాటకం నుండి కర్ణుడు, నరసరావుపేటకు చెందిన సిహెచ్ కోటేశ్వరరావు ప్రదర్శించిన గయోపాఖ్యానం కృష్ణ పాత్ర సభికులను అలరించాయి.

## ఆదిత్య బిర్లా జ్యువెలరీ షోరూమ్ గ్రాండ్ ఓపెనింగ్



**చైతన్యపురి జూన్ 28 (మనం న్యూస్)** ఎల్బీనగర్ నియోజకవర్గం చైతన్యపురి డివిజన్లో అత్యాధునిక సదుపాయాలతో నూతనంగా ఏర్పాటైన ఇండ్రియ ఆదిత్య బిర్లా జ్యువెలరీ షోరూమ్ ను ముఖ్య అతిథిగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ నూతన షోరూమ్ ప్రారంభం ద్వారా స్థానిక వ్యాపార అభివృద్ధికి, ఉపాధి అవకాశాలకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎల్బీనగర్ ఇంచార్జ్ సామ రంగారెడ్డి, చైతన్యపురి కార్పొరేటర్ రంగ నరసింహ గుప్తా, గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ మహేశ్వర్ రెడ్డి , కార్పొరేటర్ నాయకోటి పవన్ పలువురు బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# పవన విద్యుత్ ప్రాజెక్టుల్లో వేగం పెంచాలి

- **ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశం**



**మంచిర్యాల,జూన్ 28(మనం న్యూస్)**: సింగరేణి జల, సోలార్, పవన విద్యుత్ ప్రాజెక్టుల్లో వేగం పెంచాలని, నిర్ణీత కాల వ్యవధిలో పనులు పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి,ఇంధన మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు .సింగరేణి సంస్థ చేపట్టనున్న 800 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు, 500 మెగావాట్ల పవన విద్యుత్తు ప్లాంట్, 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాట్ల సన్నాహాలను మరింత వేగవంతం చేయాలని, కాల పరిమితిని విధించుకొని సత్వరమే ప్రాజెక్టులను చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. శనివారం మహాత్మా జ్యోతి రావ్ పూలే ప్రజా భవన్ లో సింగరేణి కాలరీస్ తన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా చేపట్టనున్న సోలార్ ప్లాంట్లు, పంప్డ్ స్టోరేజీ ప్లాంట్, ఇతర పునరుత్పాదక విద్యుత్తు ప్లాంట్లపై ఆయన ప్రత్యేక సమీక్ష ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సింగరేణి సంస్థ లోయర్ మానేరు డ్యాం రిజర్వాయర్ పై నిర్మించనున్న300 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్, మల్లన్న సాగర్ పై నిర్మించతలపెట్టిన 500 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ లకు ఇరిగేషన్ శాఖ ద్వారా రావాల్సిన అనుమతులకు లేఖలు రాయాలని ఆదేశాలు ఇచ్చారు. అనుమతుల కోసం నిత్యం సంబంధిత విభాగాలతో సంప్రదింపులు జరపాలని, అలాగే ఈ ప్రాజెక్టును పూర్తి లాభదాయకంగా చేపట్టేల న్నారు . సింగరేణి సంస్థ రాష్ట్రంలోని ఐదు జిల్లాలలో ఏర్పాటుచేయ తలపెట్టిన 500 మెగావాట్ల పవన విద్యుత్తు ప్లాంట్లకు సంబంధించిన డిపిఆర్ లను వచ్చే నెలాఖరు కల్లా పూర్తి చేయాలని, ఈ వినూత్న ప్రాజెక్టును మరింత ఆమోద యోగ్యంగా మార్చేందుకు వీలుగా అధునాతన సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. రామగుండం-1 ఏరియాలో మేడిపల్లి ఓపెన్ కాస్ట్ నీటి సంపు ఆధారంగా నిర్మించ తలపెట్టిన 500 మెగావాట్ల పంపుడ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ నిర్మాణం పనులు తక్షణమే చేపట్టాలన్నారు . రాజస్థాన్ రాష్ట్ర విద్యుత్ ఉత్పాదన్ నిగం లిమిటెడ్ తో కుదుర్చు కున్న ఒప్పందం మేరకు 1500 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ను ఆ రాష్ట్రంలోని సోలార్ వ్యాలీలో త్వరితగతిన ఏర్పాటు చేయాలని, ఈ ఒప్పందంలో భాగంగా ఏర్పాటు చేసే 800 మెగావాట్ల థర్మల్ ప్రాజెక్టు ఏర్పాటుపైనా కూలంకశంగా చర్చించారు. రాజస్థాన్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు వీలుగా ఈ అంశాన్ని వీలైనంత త్వరగా క్యాబినెట్లో ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకోవాలని, ఈ ప్లాంట్ లతోపాటు సింగరేణి ఏర్పాటు చేయనున్న గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్, బ్యాటరీ స్టోరేజీ సిస్టం వంటి ఇతర పనులపై కూడా ఆయన నిశితంగా సమీక్షించారు. ఇంధన శాఖకు సంబంధించిన అన్ని విభాగాల పనితీరును, చేపడుతున్న ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు వీలుగా డాష్ బోర్డును రూపొందించాలని ఆదేశించారు. పథకాల అమలులో వేగం పెంచాలన్నారు . సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ . బలరామ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి సంస్థ చేపట్టనున్న సోలార్, ఫ్లోటింగ్ సోలార్, పునరుత్పాదక ప్రాజెక్టులకు సంబంధించిన వాటి ని వివరించారు. సింగరేణి సంస్థ ఈ ప్రాజెక్టుల ద్వారా సుమారు 7 వేల మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయాలను కుంటుందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వ శాఖల నుంచి పలు రకాల అనుమతులు ఇప్పించవలసిందిగా కోరారు. ఈ వ్యాపార విస్తరణ చర్యల వల్ల సంస్థ సుస్థిర భవిష్యత్ సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, తెలంగాణ రెడ్కో వైస్ ఛైర్మన్, ఎండీ శ్రీమతి వినీలా, సింగరేణి ఈడీ(కోల్ మూమెంట్) ఎస్.డి.ఎం సుభాని, ఈడీ (ఎస్టీపీపీ) చిరంజీవులు, జీఎంలు జానకీ రామ్, శ్రీనివాసులు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



మాజీ ప్రధాని నరసింహరావు 104 వ జయంతి సందర్భంగా పి. వి ఘాట్‌కి ప్రభుత్వ సలహాదారులు హార్కర్ వేణుగోపాల్ తో పి వి కుమారులు ప్రభాకర్ రావు , సుభాష్ , డి కే అరుణతో కలిసి పి వి కి నివాళులర్పించిన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ రావు.
- (రంగారెడ్డి మనం న్యూస్)

## వంద రోజుల్లో వందశాతం అక్షరాస్యత అభినందనీయం

- **ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చాతరాజుల దుర్గాప్రసాద్**



**మంచిర్యాల, జూన్ 28 మనం ప్రతినిధి**: వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో 100 రోజుల్లో వందశాతం అక్షరాసులుగా తీర్చిదిద్దడం అభినందనీయమని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్ పేర్కొన్నారు.వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో వంద రోజుల్లో 100శాతం అక్షరాస్యతపై నూతన అక్షరాస్యులకు మూల్యాంకనం కార్యక్రమాన్ని శుక్రవారం కాసిపేట మండల కేంద్రంలోనీ ముత్యంపల్లి, ధర్మారావు పేట గ్రామపంచాయతీలోని రైతు వేదికలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చాతరాజుల దుర్గాప్రసాద్ హాజరై ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి అజ్మీరా పురుషోత్తమ్ నాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ ఈడి చాతరాజుల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గిరిజన మండలం అయిన కాశిపేట మండలాన్ని 100 రోజుల్లో 100 శాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. అక్షరాస్యత కార్యక్రమంలో పాల్గొని అక్షరాస్యులుగా పరీక్ష రాయడం చాలా సంతోషమని అన్నారు. వంద రోజుల్లో 100 శాతం అక్షరాస్యత సాధించి రాష్ట్రస్థాయిలో మంచిర్యాల జిల్లాకు పేరు తీసుకొచ్చారని ఆయన అభినందించారు. జిల్లా వయోజన విద్యాధికారి, మండల ప్రత్యేక అధికారి అజ్మీర పురుషోత్తం నాయక్ మాట్లాడుతూ కాసిపేట మండల యంత్రాంగం సహకారంతో వంద రోజుల్లో 100 శాతం అక్షరాస్యతను సాధించగలిగామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన మండల గ్రామీణాభివృద్ధి, అంగన్వాడి, గ్రామ పంచాయతీ కార్యదర్శులను దేవాపూర్ సిమెంట్ యాజమాన్యంను ఆయన అభినందించారు. కాసిపేట మండలంలోని 22 గ్రామపంచాయతీలకు చెందిన 3462 మంది వయోజనులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ బోజన్న, ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య, లీడ్ బ్యాంకు మేనేజర్ కె. తిరుపతి, విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్ రెడ్డి, ఏపిఎం వెంకటేష్, ఎంపీఈఓ షేక్ సఫ్దర్ అలీ, మండల డిఆర్పి బి. శాంకరి, లక్ష్మీనారాయణ, కొండు జనార్ధన్, అశోక్ రావు తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి దరఖాస్తులను పరిశీలించిన అదనపు కలెక్టర్ వీరారెడ్డి



**భువనగిరి, జూన్ 28 (మనం న్యూస్)**: భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి డిస్పోజల్ చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. శనివారం భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో భూభారతి సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తగు సూచనలు సలహాలు తెలియజేశారు. వచ్చిన ప్రతి దరఖాస్తును భూ భారతిలో నమోదు చేయాలన్నారు. ప్రతి దరఖాస్తుకు నోటీసు జారీ చేసి విచారణ చేసిన అనంతరం భూ సమస్య దరఖాస్తులు పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించి ఫైల్ ఎప్పటికపుడు డిస్పోజ్ చేయాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలిస్తూ భూ సంబంధిత సమస్యలు మార్పులు, చేర్పులు పాత రికార్డుల ఆధారంగానే పరిష్కరించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, సంబంధిత అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## జానపద వృత్తి కళాకారుల



- **సమస్యల పరిష్కారంకై ఛలో కలెక్టరేట్**
- **పిఎన్ఎమ్ జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు**

**ఆత్మకూర్(ఎం), జూన్ 28 (మనం న్యూస్)**: కళ కోసం కాదు కళ ప్రజల కోసం అని పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు అన్నారు. శనివారం రోజునా ఆత్మకూరు మండలంలోని పల్లెర్ల గ్రామంలో ప్రజానాట్యమండలి మొదటి మండల మహాసభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముత్యాలు, మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు కళాకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కళాకారులను ఆదుకుంటామని హామీ ఇచ్చి నెలకు 5వేల, రూపాయలు పింఛను ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల జులై ఆఖరి మాసంలో ఈ జిల్లాలో ఉన్నటువంటి జానపద వృత్తి కళాకారు కళాకారులైనటువంటి చందు, యక్షగానం, కోలాటం, బాగోతం, భజన కళాకారులకు, ప్రభుత్వం గుర్తించి కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని లేనియెడల జిల్లా కలెక్టరేట్ ఆఫీస్ ముందు కాలుకు గజ్జ కట్టి చేత డప్పు పట్టి భుజాన గొంగడి వేసి పాలకుల విధానాలను ఆటపాటల ద్వారా కళాకారులను సమీకరించి ప్రభుత్వ విధానాలను ఎండగడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ వేముల బిక్షం, రైతు సంఘం మండల అధ్యక్షులు రామిరెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాయినియాది రెడ్డి గుణ బోయిన స్వామి గొర్ల కాపరి జిల్లా కమిటీ సభ్యులు సిఐటియూ నాయకులు కొమ్ము ఎల్లయ్య పాల్గొన్నారు. అనంతరం నూతన ప్రజానాట్యమండలి ఆత్మకూరు మండల అధ్యక్ష కార్యదర్శులుగా సంఘపాక స్వామి, ఎల్లంకి స్వామి, సహాయ కార్యదర్శిగా జమ్ముల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులుగా కూరేళ్ల నాగయ్య, కమిటీ సభ్యులుగా బొల్లెపల్లి నవీన్, సంఘపాక అనిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థుల కొరకు మౌళిక సదుపాయాల కల్పన

- **రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ అయేషా మస్రత్ ఖానం**



**మంచిర్యాల, జూన్ 28 (మనం ప్రతినిధి)**: ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ అయేషా మస్రత్ ఖానం అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డ్నా హరీష్ రాజ్, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు హరిశ్చంద్రారెడ్డి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డ్నా సులేమాన్, టి.జి.ఎం.ఐ.డి.సి. ఈ.ఈ. నరసింహరావు లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలలలో మౌళిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలని, త్వరలో విద్యాబోధన కొరకు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవడంతో పాటు ఒప్పంద పద్ధతిన ఇతర పోస్టులలో సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లా కలెక్టర్ పరిధిలో ఉన్న పోస్టులను అవసరం ఉన్న మేరకు భర్తీ చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వివిధ అనారోగ్య సమస్యలపై వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లాలో తలపెట్టిన ప్రభుత్వ వైద్య కళాశాల, మాతా-శిశు కేంద్రం, ప్రభుత్వ ఆసుపత్రి భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలో నిర్మాణం కొనసాగుతున్న మాతా-శిశు ఆసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించి వార్డులు, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి పటిష్ట చర్యలు

- **విద్యా కమిషన్ మెంబర్ డాక్టర్ వెంకటేష్**



**రంగారెడ్డి, జూన్ 28 (మనం న్యూస్)**: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తమ ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర విద్యా కమిషన్ మెంబర్ డాక్టర్ చారకొండ వెంకటేష్ అన్నారు. శనివారం సరూర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేసారు. విద్యార్థులతో ముచ్చటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్య నాణ్యత ప్రమాణాలు పెంపొందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో లభించే సౌకర్యాలపై ప్రజలకు వివరించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి పాఠశాల ఆవరణను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. .
విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదివి అత్యున్నత మార్కులు సాధించి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సారధ్యంలో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు కవిత, ఉపాధ్యాయులు మధుసూదన్, శేఖర్ రెడ్డి, నారాయణ, బాలనరేందర్, వెంకటేష్, పద్మ, పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులకు గ్రామసభ కోసం సామర్థ్య నిర్మాణంపై శిక్షణ



- **జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు**

**మంచిర్యాల, జూన్ 28 (మనంప్రతినిధి)**: ప్రభుత్వ పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ, డా మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సమాచార హక్కు-గ్రామసభ కోసం సామర్థ్య నిర్మాణంపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ భాగస్వామ్యంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంచిర్యాల శిక్షణ కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులకు 2 రోజులు శిక్షణ ఇవ్వడం జరిగిందని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు తెలిపారు. మెరుగైన స్థానిక పాలన కోసం, సమాచార హక్కు చట్టం, స్వచ్ఛందంగా సమాచారం వెల్లడించడం ద్వారా పారదర్శకత, గ్రామసభ బలోపేతం, మహిళా-స్నేహ పూర్వక గ్రామ పంచాయతీలను ప్రోత్సహించడం, మహిళా సాధికారత, బాలల సంరక్షణకు సంబంధిత ముఖ్యమై చట్టాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. 2 రోజుల శిక్షణలో సమాచార హక్కు చట్టం-2005, పంచాయతీ కార్యదర్శి పాత్ర, మహిళా గ్రామసభలు, మహిళా ప్రజాప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలపై తీసుకోవలసిన చర్యలు వంటి పలు అంశాలపై వివరించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, రీసోర్స్ పర్సన్స్ ఎండి. అజ్మత్ అలీ, వి.శ్రీనివాస్, జి.శ్రీనివాస్, ఎస్.సతీష్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలు



- **ఎమ్మెల్యే విజయరమణ రావు**

**సుల్తానాబాద్ జూన్ 28 (మనం న్యూస్)**: సుల్తానాబాద్ పట్టణ కేంద్రం లోని ఎస్.వి.ఆర్ గార్డెన్స్ లో సుల్తానాబాద్ మండలం, పట్టణనికి సంబందించిన నూతన రేషన్ కారడ్స్ 605 మంది లబ్ధిదారులకు, 33 మంది లబ్ధిదారులకు 33,03,828 రూపాయల కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అలాగే 105 మంది లబ్ధిదారులకు 41,37,000 రూపాయల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్థానిక నాయకులతో కలిసి పంపిణి చేశారు పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు మాట్లాడుతూ పది సంవత్సరాలు బి.ఆర్.ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన రేషన్ కార్డులను మన ప్రజా ప్రభుత్వం అధికారంలోని వచ్చాక కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా పాలన అనే కార్యక్రమంతో పేద ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు . కొత్త రేషన్ కార్డులకు త్వరలోనే సన్న బియ్యం పంపిణీ చేస్తామని. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత నేను శాసనసభ్యుడిగా ఎన్నికైన తర్వాత మన నియోజకవర్గంలో ఎలాంటి తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేసి రైతన్నల మొహంలో చిరునవ్వు చూశామని తెలిపారు. మన పెద్దపల్లి నియోజకవర్గంలో వడ్ల బోనస్ ఘనియంగా జమ చేయడం మనకు గర్వకారణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బషీర్, ఎంపీడీఓ దివ్యదర్శన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్ మార్కెట్ చైర్మన్ మినిపల ప్రకాష్ రావు, పట్టణ అధ్యక్షులు వేగోళం అబ్బాయ్య గౌడ్, మండల అధ్యక్షులు చిలుక సతీష్, సింగల్ విండో చెర్మన్, శ్రీగిరి శ్రీనివాస్, సైరి మహేందర్, బిరుదు కృష్ణ, పన్నాల రాములు,మరియు స్థానిక లు మరియు మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచ్ లు, ఎంపీటీసీలు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పలు గ్రామాల ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మంథని ప్రాంత అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలి

- **అభివృద్ధి పనులలో భూములు కోల్పోయే రైతులకు న్యాయమైన పరిహారం అందిస్తాం**
- **పారిశ్రామిక వాడ ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాల కల్పన**
- **మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు**



**మంథని, జూన్ 28 (మనం ప్రతినిధి)**: మంథని ప్రాంత అభివృద్ధికి ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కోరారు. శనివారం మంథని పట్టణంలో రాష్ట్ర మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మంథని ప్రాంతంలో మౌలిక సదుపాయాల పెద్ద ఎత్తున అభివృద్ధి చేయాలని సీఎం, రోడ్లు భవనాల శాఖ మంత్రి సహకారంతో కృషి చేస్తున్నామని అన్నారు. గోదావరి నది పై మంథని నుంచి శివారం వరకు 125 కోట్లతో చేపట్టిన హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు,162 కోట్ల రూపాయలతో మంథని పట్టణానికి 9.4 కిలోమీటర్ల మేర 4 లైన్ రింగ్ రోడ్డు పనులకు, 22 కోట్లతో 50 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులకు భూమి పూజ చేశామని అన్నారు. హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం, రింగ్ రోడ్డు లో భూములు కోల్పోయే రైతులకు నష్టపరిహారం అందించి అందరికీ న్యాయం చేస్తామని అన్నారు. హై లెవెల్ బ్రిడ్జి, రింగ్ రోడ్డు వల్ల మంథని, మంచిర్యాల, చెన్నూరు, మహారాష్ట్ర రాకపోకల పెరుగుతాయని అన్నారు. హై లెవెల్ బ్రిడ్జి వల్ల వాణిజ్యం పెరుగుతుందని, దీని నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మంత్రి కోరారు. మంథని పట్టణంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉపయోగపడేలా అన్ని హక్కులతో నూతన ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందని అన్నారు. న్యాయవాదుల కోరిక మేరకు మందిని పట్టణంలో జ్యుడీషియల్ క్వార్టర్స్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మంత్రి కలెక్టర్ కు సూచించారు. మంథని ప్రాంతంలో పారిశ్రామిక వాడ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ చేసి పరిశ్రమలు ఆకర్షించి స్థానికంగా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. మంథని ప్రాంత అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, అభివృద్ధి పనులకు అవరోధాలు సృష్టించవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ. సురేష్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిని అసెంబ్లీలో బయట పెడతా

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**కోరుట్ల, జూన్ 28 (మనం న్యూస్):** కోరుట్ల పట్టణ జిఎస్ గార్డెన్ లో శనివారం కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు ల ఆధ్వర్యంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సీ ఎస్టీ మైనార్టీ వికలాంగుల ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విచ్చేశారు ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు కాంగ్రెస్ పార్టీ 9 రోజుల్లోనే 2 లక్షల 48 వేల 550 మంది రైతులకు రైతు భరోసా కింద 243 కోట్ల 33 లక్షల రూపాయలు రైతు ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు మాజీ మంత్రి హరీష్ రావు ఇటీవల కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని మాట్లాడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల వివదిలోనే 49 వేల ఉద్యోగాలు కల్పించడం జరిగిందన్నారు కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై అసెంబ్లీలో చర్చకు రమ్మంటే కేసీఆర్ కేటీఆర్ హరీష్ రావులు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు నిజంగా మీరు తప్పు చేయకుంటే చర్చకు రావాలి కదా అని ప్రశ్నించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ కు సంబంధించిన నిధులను కూడా కాళేశ్వరం ప్రాజెక్టుకు మళ్ళించడం జరిగిందని దానిపై తాను మంత్రి అయ్యాక ఇటీవల హైదరాబాదులో ఆయా శాఖల అధికారులతో రివ్యూ నిర్వహించడం జరిగిందని దానిలో జరిగిన అవినీతిపై త్వరలోనే జరగబోయే అసెంబ్లీలో బయటపెడతానన్నారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తల కృషి చేయాలన్నారు తాను కూడా ఒక సామాన్య కార్యకర్త స్థాయి నుండి నేడు ఈ స్థాయిలో ఉన్నానని కేవలం అది కాంగ్రెస్ పార్టీలోనే సాధ్యమన్నారు కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేసే కార్యకర్తలకు తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు ఇటీవల తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ తో జరిగిన సమావేశంలో పార్టీ కోసం కష్టపడే వారికి తప్పకుండా సముచిత స్థానం కల్పిస్తామని చెప్పడం జరిగిందన్నారు కావున కార్యకర్తలు కష్టపడి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు రాష్ట్రంలో 28 శాతం బడ్జెట్ తన వద్ద ఉన్న శాఖలో ఉందన్నారు కావున ప్రతి శనివారం ఆదివారం జిల్లాలో అందుబాటులో ఉండి ప్రజల కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు ఎవరికి ఏ ఇబ్బంది ఉన్నా నేరుగా తన వద్దకు రావాలని సమస్య పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానన్నారు అనంతరం కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు కూడా మీ ద్వారానే పంపిణీ జరిగే విధంగా అధికారులను ఆదేశించారని కోరారు గత బిఆర్ఎస్ ప్రభుత్వం పూడూరు ఖాదీ బోర్డు భూములను టిఆర్ఎస్ పార్టీకి చెందిన కార్యకర్తలకు నాయకులకు అమ్మడం జరిగిందని దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక ప్రత్యేక నిఘా విభాగాన్ని ఏర్పాటు చేసి దాని ద్వారా ఎంక్వయిరీ జరుగుతుందని త్వరలోనే దోషులకు శిక్ష పడడం ఖాయమన్నారు రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్ని మెజార్టీ స్థానాలు సంపాదించుకుంటే అంత నిధులు నియోజకవర్గానికి వస్తాయని నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు కొమిరెడ్డి విజయ్ ఆజాద్ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కేసులోనూ నిందితులకు శిక్ష పడేలా
# కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్ కృషి చేయాలి

- జిల్లా ఎస్పి అశోక్ కుమార్



**జగిత్యాల, జూన్ 28 (మనం ప్రతినిధి):** కోర్టు కేసులలో శిక్షల శాతాన్ని పెంచడం, తప్పు చేసిన నిందితులకు శిక్ష పడేలా చేయడం ద్వారా ప్రజలకు పోలీస్ శాఖపై మరింత గౌరవం, నమ్మకం పెరుగుతుందని జిల్లా ఎస్పి అశోక్ కుమార్ ఐపిఎస్ అన్నారు. ఈ రోజు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో కోర్టు డ్యూటీ కానిస్టేబుల్ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి గారు మాట్లాడుతూ.... కోర్టు కేసుల్లో నిందుతులకు శిక్షలు పడినప్పుడే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, ఇందుకు అనుగుణంగా కేసులు పెండింగులో లేకుండా చూసుకోవాలని అన్నారు.కోర్టు కానిస్టేబుల్ బాధ్యత చాలా కీలకమైనదని, ఎఫ్ఐఆర్ నమోదు అయినప్పటి నుండి కేసు పూర్తయ్యేంతవరకు నిందితుల నేరాలను నిరూపించేందుకు అవసరమైన రుజువులు, పత్రాలు, సాక్షుల వాగ్మూలం ను కోర్టుకు సమర్పించడంలో కోర్టు పోలీసు అధికారులు వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని సూచించారు. సాక్షులను,బాధితులను సమయానికి కోర్టులో హాజరు పరిచేలా చూసుకోవాలని, బాధితులకు,సాక్షుల కు కేసుకు సంబంధించిన విషయాలలో అవగాహన కల్పించాలని అన్నారు. కోర్టు సమాచారం ప్రాసిక్యూషన్ కు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్ కు తెలియజేయాలని, కేసు ట్రయల్స్ సమయములో పీపీ ల యొక్క సలహాలు సూచనలు స్వీకరించాలని సూచించారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసుల పరిష్కారానికి సంబంధించి పలువురు కోర్టు కానిస్టేబుళ్లను అడిగి కేసుల పురోగతిపై సూచనలు చేశారు. కోర్టుల్లో పెండింగ్ లో ఉన్న కేసులు, వారెంట్స్, సమన్స్ తదితర అంశాలను సమీక్షించారు. ఈ సమావేశంలో డీసీఆర్బీ, ఎస్బీ, ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ లు శ్రీనివాస్, ఆరిఫ్ అలీ ఖాన్ , రఫీక్ ఖాన్, సీఎంఎస్, ఎస్.ఐ శ్రీకాంత్, జిల్లాలోని పోలీస్ స్టేషన్ల కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

# మోడల్ సాధించిన రిజర్వ్ ఇన్స్పెక్టర్ సైదులుకు ఎస్పీ అభినందనలు



**జగిత్యాల జూన్ 28 ( మనం ప్రతినిధి):** హైదరాబాద్లో ఇటీవల నిర్వహించిన 11వ తెలంగాణా స్టేట్ షూటింగ్ చాంపియన్షిప్లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించిన రిజర్వ్ ఇన్స్పెక్టర్ సైదులు ని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భం గా ఎస్పి మాట్లాడుతూ శారీరక దృఢతతోపాటు మానసిక స్థైర్యం కూడా అవసరమైన షూటింగ్ స్పోర్ట్స్లో విజయం సాధించడం గర్వకారణం అని అన్నారు.రాష్ట్రంలోని పలువురు ప్రతిష్ఠాత్మక షూటర్ల మధ్య పోటీలో ఈ మెడల్ గెలుచుకోవడం అత్యంత గర్వకారణమైన విషయం అన్నారు. పోలీస్ శాఖలో సేవలందిస్తూ, షూటింగ్ లో ప్రతిభ చాటడం మన సిబ్బందికి ఆదర్శం అని , రానున్న రోజులో షూటింగ్ విబాగంలో మరిన్నీ పథకాలు సాధించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకొని రావాలని ఆకాంక్షించారు.

## ఆల్ ఇండియా జూనియర్ చెస్
# పోటీల పోస్టర్ ను ఆవిష్కరించిన కలెక్టర్



**కరీంనగర్, జూన్ 28(మనం బ్యూరో):** కరీంనగర్ వేదికగా జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జూలై 12, 13 తేదీల్లో జరుగనున్న 3వ ఆల్ ఇండియా జూనియర్ చెస్ పోటీలకు సంబంధించిన పోస్టర్ ను శనివారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారుల మేదస్సు కు పదను పెట్టే క్రీడ చదరంగం అని అన్నారు. చెస్ క్రీడల్లో రాణించిన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారని అన్నారు. కరీంనగర్ లో జరగనున్న ఆల్ ఇండియా పోటీలను అట్టహాసంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. మూడవ సారి ఆల్ ఇండియా చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ కు జీనియస్ చెస్ అకాడమీ కోచ్, డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్ వివరించారు. పోటీలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పోటీలను స్విస్ లీగ్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య, జిల్లా క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, రాజిరెడ్డి కాళీ చరణ్, భరద్వాజ్, సాగర్, తదితరులుపాల్గొన్నారు.

# స్వేచ్ఛ మృతి జర్నలిజానికి తీరని లోటు

- కొవ్వొత్తులతో నివాళులు అర్పించిన జర్నలిస్టులు



**కరీంనగర్ , జూన్ 28(మనం బ్యూరో):** ప్రముఖ జర్నలిస్ట్, న్యూస్ రీడర్ స్వేచ్ఛ మృతి జర్నలిజానికి తీరని లోటు అని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్షులు నల్లగొండ సత్తయ్య, ఇండిపెండెంట్ జర్నలిస్టుల, మీడియా సంస్థల లీగల్ అడ్వైజర్ జక్కనపల్లి గణేష్ లు ఆవేదన వ్యక్తం చేశారు. అనుమానాస్పదంగా మృతి చెందిన జర్నలిస్ట్ స్వేచ్ఛకు అంబేడ్కర్ విగ్రహం ముందు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా వృత్తిలో స్వేచ్ఛ తనదైన ప్రత్యేక శైలిని కనబరిచిందన్నారు. న్యూస్ రీడర్ గా తెలంగాణ ఉద్యమంలో సైతం పరిశోధనాత్మక విశ్లేషణ కథనాలను ప్రజలకు అందించింది అన్నారు. ఆమె మృతి పై ఉన్న అనుమానాలపై త్వరితగతిన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు జాదవ్ శ్రీనివాస్, కొంపెల్లి సాగర్, పొత్తూరి శేఖర్, వేముల సుదర్శన్ రెడ్డి, జమీల్ పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్‌కు టీడబ్ల్యూజేఎఫ్ నేతల వినతి



**కరీంనగర్, జూన్ 28(మనం బ్యూరో):** జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేసి అందించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపూరావు జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కి టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం బాపూరావు మాట్లాడారు. జిల్లాలో జర్నలిస్టుల పరిస్థితులు దారుణంగా మారాయని, అనేక ఒడిదుడుకుల మధ్య వృత్తిబాధ్యతలు నిర్వహిస్తున్నారని, చాలీచాలని వేతనాలతో బతుకులీడుస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారన్నారని తెలిపారు. అద్దె ఇండ్లలో ఉంటూ దుర్భర జీవితాలు గడుపుతున్న జర్నలిస్టులు చాలామంది ఉన్నారని, జర్నలిస్టుల దయనీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వెంటనే అర్హులైన జర్నలిస్టులందరికీ నివేషణ స్థలాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కరీంనగర్ జిల్లా కేంద్రం తో పాటు హుజురాబాద్ లో జర్నలిస్టులకు ఇచ్చిన ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించి వెంటనే వారికి నిర్మాణ అనుమతి ఇవ్వాలని ఈ సందర్భంగా కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు గాది కరుణాకర్ రావు, జిల్లా అధ్యక్షుడు నల్లగొండ సత్తయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు సిహెచ్ వెంకట్ రాజు, అతికం రాజశేఖర్, జిల్లా నాయకులు ఆర్ శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

**జాతీయం- అంతర్జాతీయం**

## ఎంపీ కారు డ్రైవర్‌కు
# రూ.150 కోట్ల విలువైన ల్యాండ్ 'గిఫ్ట్'!



ముంబయ్, జూన్ 28: మహారాష్ట్రలో ఓ ఎంపీ కారు డ్రైవర్‌కు నిజాం దివాన్ వారసులు రూ.150 కోట్ల విలువైన భూమి బహుమతిగా ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఓ న్యాయవాది ఫిర్యాదు చేయడంతో ఆర్థిక నేరాల విభాగం అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. అసలేం జరిగిందంటే..

శివసేన ఎంపీ సందీప్ భూమ్రే, ఆయన కుమారుడు ఎమ్మెల్యే విలాస్ వద్ద జావెద్ రసూల్ షేక్ అనే వ్యక్తి 13 ఏళ్లుగా కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు ఛత్రపతి శంభాజీనగర్‌లో ఉంటున్న నిజాం దివాన్ వారసులు రూ.150 కోట్ల విలువైన మూడు ఎకరాల భూమిని గిఫ్ట్‌డీడ్ కింద రాసిచ్చారు. దీనిపై ముజాహిద్ ఖాన్ అనే న్యాయవాది ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ భూమిపై దివాన్ వారసులు సుదీర్ఘమైన న్యాయపోరాటం చేశారని, 2022లో వారికి అనుకూలంగా తీర్పు రావడంతో దాన్ని దక్కించుకోగలిగారని ముజాహిద్ తెలిపారు. అలాంటి భూమిని రక్తసంబంధం లేని వ్యక్తికి గిఫ్ట్‌డీడ్‌గా ఎలా ఇస్తారని ఆయన తన ఫిర్యాదులో ప్రశ్నించారు.

కాగా, ఈ వివాదంపై జావెద్‌ను పోలీసులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. దివాన్ వారసులతో తమకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, అందుకే తనకు ఆ భూమిని రాసిచ్చారని అతడు పేర్కొన్నట్లు సమాచారం. ఇక, ఈ విషయంపై పోలీసులు తనను సంప్రదించారని ఎమ్మెల్యే విలాస్ స్పష్టం చేశారు. అయితే, ఈ భూమి బదిలీకి సంబంధించి తన దగ్గర ఎలాంటి సమాచారం లేదని తాను పోలీసులకు తెలిపానని ఆయన పేర్కొన్నారు. దీనిపై స్థానిక సీనియర్ పోలీస్ అధికారి మాట్లాడుతూ.. ఫిర్యాదుపై పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నామన్నారు. గిఫ్ట్‌డీడ్‌పై సంతకం చేసిన వారితో పాటు సంబంధిత కుటుంబసభ్యులకు సమన్లు జారీ చేసినట్లు వెల్లడించారు. డ్రైవర్‌కు, దివాన్ వారసులకు మధ్య ఉన్న సంబంధాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

# డీల్ కుదరాలంటే.. ఖమేనీని ట్రంప్ మర్యాదగా సంబోధించాలి

- ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్



**టెహ్రాన్, జూన్ 28:** ఇరాన్ సుప్రీంలీడర్ అయతుల్లా అలీ ఖమేనీని ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను టెహ్రాన్ ఖండించింది. తమతో నిజంగా అణు ఒప్పందం కావాలనుకుంటే ఖమేనీని మర్యాదగా సంబోధించాలని ట్రంప్‌నకు ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ సూచించారు. ఖమేనీ హత్యకు గురికాకుండా రక్షించామని, ఆయన కృతజ్ఞత లేనివాడని ఆరోపిస్తూ ట్రంప్ ట్రూత్ సోషల్లో ఓ పోస్టు పెట్టారు. 'ఖమేనీ ఎక్కడ ఆశ్రయం పొందారో నాకు కచ్చితంగా తెలుసు. ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన అమెరికా, ఇజ్రాయెల్ దళాల చేతుల్లో ఆయన జీవితాన్ని ముగించనివ్వలేదు. నేను అతనిని అతి ఘోరమైన చావు నుంచి రక్షించాను. అయినా, నాకు ధన్యవాదాలు తెలపలేదు' అని ట్రంప్ రాసుకొచ్చారు. ఈసందర్భంగా ఇరాన్‌పై ఉన్న ఆంక్షలను సడలించే విషయాన్ని తాను ఇటీవల పరిశీలించానని తెలిపారు. అయినా, తనపై కోపం,ద్వేషంతో కూడిన ప్రకటనలు వస్తూనే ఉన్నాయని, అందుకే ఆంక్షల నుంచి ఉపశమనం కలిగించే విషయాన్ని విరమించుకున్నానని వెల్లడించారు.

ఖమేనీని ఉద్దేశిస్తూ ట్రంప్ చేసిన పోస్టుపై ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చీ స్పందిస్తూ.. ఖమేనీని అగౌరవంగా సంబోధించడాన్ని ఆయన ఖండించారు. ట్రంప్ నిజంగా తమతో ఒప్పందం జరగాలని భావిస్తుంటే తమ సుప్రీం లీడర్‌ను మర్యాదగా సంబోధించాలని సూచించారు. లక్షలమంది ఖమేనీ మద్దతుదారుల మనోభావాలను దెబ్బతీయొద్దంటూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఇరాన్ ప్రజలు తమ ధైర్యాన్ని ప్రపంచానికి చూపారన్నారు. ఇజ్రాయెల్‌కు మరో దారి లేక ట్రంప్ వద్దకు పరుగెత్తుకెళ్లిందన్నారు. ఇదిలాఉండగా.. ఖమేనీని హత్య చేస్తామంటూ అమెరికా, ఇజ్రాయెల్‌లు బహిరంగంగా బెదిరింపులకు పాల్పడటంపై ఇరాన్ తీవ్రంగా మండిపడింది. ఇది ఉగ్రవాదానికి స్పష్టమైన ఉదాహరణ అని ఐక్యరాజ్యసమితిలోని ఇరాన్ శాశ్వత ప్రతినిధి ఆరోపించారు. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఐరాసలో కోరారు.

# ఇస్ఫహాన్‌లోని అణుస్థావరాలపై బంకర్ బస్టర్లు వేయలేదు

- అమెరికా విదేశాంగ మంత్రి పీట్‌హెగ్గెత్



వాషింగ్టన్, జూన్ 28: ఆపరేషన్ 'మిడ్‌నైట్ హ్యామర్'లో భాగంగా ఇరాన్‌లోని పలు అణుస్థావరాలపై బంకర్ బస్టర్ బాంబులను ప్రయోగించి.. ధ్వంసం చేసినట్లు ఇప్పటికే అమెరికా రక్షణశాఖ మంత్రి పీట్ హెగ్సేత్ వెల్లడించిన విషయం తెలిసిందే. తాజాగా యూఎస్ ఛైర్మన్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ జనరల్ డాన్ కేన్ మీడియాతో మాట్లాడుతూ.. ఇరాన్‌పై దాడుల సమయంలో ఫోర్డో, నతాంజ్లపై బంకర్ బస్టర్లను జారవిడిచామన్నారు. కానీ ఇస్ఫహాన్ అణుస్థావరాలు చాలా లోతుగా ఉన్నందున.. మరింత ప్రభావవంతమైన మాసివ్ ఆర్డినెన్స్ పెనెట్రేటర్ బాంబులను ఉపయోగించి, ధ్వంసం చేశామని పేర్కొన్నారు. ఇరాన్ వద్ద ఉన్న సుసంపన్నమైన అణు నిల్వలలో దాదాపు 60 శాతం ఇస్ఫహాన్ భూగర్భ అణుస్థావరాల్లోనే ఉన్నాయని డాన్ కేన్ పేర్కొన్నారు. టెహ్రాన్‌కు అణ్వాయుధాలు ఉత్పత్తి చేయడానికి ఇది చాలా కీలకమైనది కావడంతో.. బంకర్ బస్టర్ల కంటే ప్రభావవంతమైన మాసివ్ ఆర్డినెన్స్ పెనెట్రేటర్, తొమాహాక్ క్షిపణులను ఉపయోగించామన్నారు. ఈ దాడితో టెహ్రాన్ అణు కార్యక్రమంపై తీవ్ర ప్రభావం పడిందని అమెరికా నిఘా సంస్థలు అంచనా వేస్తున్నాయన్నారు. అమెరికా డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ ప్రాథమిక అంచనా ప్రకారం.. అమెరికా దాడుల వల్ల టెహ్రాన్‌లోని అణుస్థావరాలు పూర్తిగా ధ్వంసం కానప్పటికీ, వాటి పునరుద్ధరణకు చాలా సమయం పట్టే అవకాశం ఉందని తెలిపారు.

ఇటీవల ఇరాన్‌పై దాడులు చేసినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన అనంతరం ఆపరేషన్ 'మిడ్‌నైట్ హ్యామర్' ఎలా చేపట్టారనే విషయాన్ని యూఎస్ రక్షణ శాఖ వివరించింది. 30 వేల పౌండ్ల బరువు కలిగిన 14 బాంబులను అణు కేంద్రాలపై జారవిడిచామని..ఈ ఆపరేషన్‌లో ఏడు బీ2 బాంబర్లు సహా మొత్తం 125కు పైగా యుద్ధ, ఇంధన, నిఘా విమానాలు పాల్గొన్నాయని తెలిపింది. కొన్ని గంటల్లోనే ఫోర్డో, నతాంజ్ సహా పలు అణుస్థావరాలపై దాడులు చేపట్టిన తమ విమానాలు ఇరాన్ గగనతలం నుంచి బయటకు వచ్చేశాయని అమెరికా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డేనియల్ కెయిన్ వెల్లడించారు.

# 13 మంది మావోయిస్టుల లొంగుబాటు



**బీజాపూర్,జూన్ 28 :** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో 13 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 8 మంది మహిళలు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టులపై రూ.23 లక్షల రివార్డు ఉందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారికి పునరావాసం కల్పిస్తామని అధికారులు తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'తో మావోయిస్టుల వైపు భారీగా నష్టం వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో పలువురు మావోయిస్టులు లొంగిపోతున్నారని పోలీసు అధికారులు తెలిపారు.

# ఆవును చంపిందనే కోపంతోనే పులులకు విషాహారం

**బెంగళూర్, జూన్ 28:** తమిళనాడు- కేరళ సరిహద్దుల్లోని కర్ణాటక చామరాజనగర జిల్లా హనూరు తాలూకా మలెమహదేశ్వర వన్యధామం పరిధిలో ఐదు పులులు అనుమానాస్పదంగా మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న అటవీశాఖ అధికారులు పులులకు విషం పెట్టి చంపిన ఓ వ్యక్తితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. కర్ణాటకకు చెందిన మాదురాజు అనే వ్యక్తి తన ఆవును పులి వేటాడి..చంపినందుకు ప్రతీకారంగా అక్కడ తిరిగే పులులకు విషం పెట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. తాము ఎంతో అపురూపంగా పెంచుకుంటున్న 'కెంచి' అనే ఆవును ఇటీవల అడవిలో ఓ పులి వేటాడి చంపడంతో తీవ్ర ఆవేదనకు గురైన మాదురాజు ఎలాగైనా అడవిలోని క్రూరమృగాలను చంపాలని పథకం వేశాడని అధికారులు తెలిపారు. అతడి స్నేహితులు కోనప్ప, నాగరాజుల సహాయంతో చనిపోయిన తన ఆవు కళేబరంపై విషం చల్లి.. దానిని అడవికి సమీపంలో పడేసినట్లు తెలిపారు. ఆ విష కళేబరాన్ని తిన్న ఓ తల్లి పులి, నాలుగు కూనలు ప్రాణాలు కోల్పోయాయని తెలిపారు. దీంతో మాదురాజుని అతడికి సహకరించిన ఇద్దరు స్నేహితులను అదుపులోకి తీసుకొని తదుపరి విచారణ కోసం మీణ్యం ప్రాంతంలోని 'అరణ్య భవన్'కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ ఘటనపై పూర్తి నివేదిక అందిన తర్వాత నిందితులపై తగిన చర్యలు తీసుకోవాలని అటవీశాఖ మంత్రి ఈశ్వర ఖండ్రేకు సూచించారు.



## నార్వే రాజకుటుంబ వారసుడిపై
# అత్యాచారం కేసులు
### దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు



**ఓస్లో(నార్వే), జూన్ 28:** నార్వే రాజకుటుంబ వారసుడు, యువరాణి మెత్తె మారిట్ పెద్ద కుమారుడైన మారియోస్ బోర్గ్ హేబి (28)పై అత్యాచారం, లైంగిక వేధింపులు వంటి పలు అభియోగాలతో కేసులు నమోదు చేసినట్లు ఓస్లో పోలీసులు వెల్లడించారు. బాధితుల సంఖ్య రెండంకెలకు పైగా ఉన్న ఈ కేసుల్లో నెలల తరబడి విచారణ అనంతరం అభియోగాల నమోదుకు నిర్ణయించారు. పై ఆరోపణలతో మారియోస్‌ను గతేడాది పలుమార్లు అరెస్టు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నార్వేలో కలకలం రేపుతున్న ఈ ఉదంతంపై రాజభవనం నుంచి తక్షణం ఎటువంటి స్పందన వెలువడలేదు. మారియోస్ ఇప్పుడు రాజ కుటుంబం నుంచి విడిగా ఉంటున్నాడు. నార్వేకు కాబోయే రాణి అయిన మెత్తె మారిట్ 2001లో హాకోన్‌ను వివాహమాడి వార్తల్లో నిలిచారు.

## భువనగిరిలో అంగరంగ వైభవపేతంగా
# శ్రీ జగన్నాథ రథయాత్ర

- భక్తుల చెంతకే జగన్నాథుడు







**భువనగిరి, జూన్ 28 (మనం న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో పూరి జగన్నాథుని రథయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. శనివారం భువనగిరి ఇస్కాన్ టెంపుల్ విద్యానగర్ శ్రీమాన్ స్వరూప సిద్ధి దాస్ ఆధ్వర్యంలో వైభవోపేతంగా కన్నుల పండుగగా రథయాత్రను భక్తులు జరుపుకున్నారు. ప్రత్యేక రథ వాహనానికి పూల తోరణాలు అలంకరణలు చేసి జగన్నాథ బలభద్ర సుభద్ర లను రథం పైకి ప్రతిష్టించి శాస్త్రోత్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథయాత్రను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి రథయాత్రను త్రాడు లాగి ప్రారంభించారు. దేవదేవుడు గర్భగుడి నుండి వదిలి భక్తుల చెంతకే జగనాథుడు తరలి రావడంతో పట్టణ పరిసరాలను పావనం చేస్తూ రథాన్ని స్వామి అధిరోహించాడు. భక్తుల జయ జయ ధ్యానాల నడుమ సుభద్ర బలపద్ర సమేతంగా బయలుదేరాడు. గుండె గొంతుగా చేసుకొని జనం జయహో జయహో జగనాథ అని కీర్తిస్తుంటే చిరు మందాసుడై ఆలకించాడు. ప్రేమగా రథాన్ని లాగుతుంటే అంతటి గొప్ప దేవుడు అవలీలగా ముందుకు సాగుతూ భక్తులకు దర్శనం ఇచ్చాడు. దీంతో శ్రీ కృష్ణ భక్తులు పరవశం పొందారు. రథయాత్ర హైదరాబాద్ చౌరస్తా నుండి ప్రారంభమై జగదేపూర్ చౌరస్తా, ప్రిన్స్ కార్నర్, అంబేద్కర్ చౌరస్తా, గంజి ఏరియా నుండి సాయిబాబా మందిరం వరకు కొనసాగింది. శ్రీ కృష్ణ భక్తులు హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ హరి హరే హరే రామ హరే రామ రామ రామ హరే హరే సంకీర్తనతో మారు మ్రోగింది. అడుగు అడుగున భక్తుల కోసం వాటర్ ప్యాకెట్లు మజ్జిగ ప్యాకెట్లు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. భువనగిరి పట్టణం తోపాటు జిల్లా నలుమూలల నుండి కృష్ణ భక్తులు పాల్గొని నృత్యాలు, కీర్తనలు, భజనలు భక్తి పాటలతో సందడి చేశారు. రథయాత్రకు పోలీస్ అధికారులు బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో విశాల్ ప్రభు, శ్రీనివాస్ ప్రభు, మార్తా వెంకటేశం, పసుపు నూరి నాగభూషణం, ముత్యాలు, బి లక్ష్మణ్, కృష్ణ, సోమచంద్రగుప్త, మారబోయిన అశోక్, విజయ్ ప్రభు, గోపరాజు కృష్ణ కాంత్ ప్రభు, ప్రశాంత్, ఆంజనేయులు ప్రభు, సత్యం, ఆదిత్య ప్రభు, బిజెపి నాయకులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మాయా దశరథ, రత్నపురం శ్రీశైలం రత్నపురం బాలరాం, చందా మహేందర్ గుప్తా, గటికప్పుల శ్రీనివాస్ పట్టణ కృష్ణ భక్తులు, అధిక సంఖ్యలో మాతాజీలు పాల్గొన్నారు.

# శిధిలావస్థలో వాణిజ్య పన్నుల శాఖ సరిహద్దు తనిఖీ కేంద్రం

- ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం
- చోరీకి గురైన సామాగ్రి



**నాగార్జునసాగర్, జూన్ 28 (మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్రం ఏర్పడినతరువాతరాష్ట్రవ్యాప్తంగా ఆయా రాష్ట్ర సరిహద్దులలోవాణిజ్య పన్నుల శాఖ అంతర్రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది అందులో భాగంగా నందికొండ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన సరిహద్దు తనిఖీ కేంద్రం ఒకటి.దీనిని గత2016 సెప్టెంబర్ లో దాదాపు సుమారు 15 కోట్ల రూపాయల వ్యయంతో ఈసరిహద్దు తనఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.జీఎస్టీ ఏర్పడిన తర్వాత'ఒకే దేశం ఒకే పన్ను' అనే నినాదంతోరాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన అన్నిసరిహద్దు తనిఖీ కేంద్రాలను2017 జూన్ 31 అర్ధరాత్రి నుంచి మూసివేయడం జరిగినదిఆ తరువాత దీనిని ఎవరూ పట్టించుకోకపో వడంతోఅందులో ఉన్నసామాగ్రిపూర్తిగా శిథిలావస్థకు చేరుకోగా కోట్ల రూపాయల వ్యయంతోఏర్పాటు చేసినఈ సరిహద్దు తనిఖీ కేంద్రం మూసి వేసినప్పటి నుంచి భద్రత కరువై అందులోని సామాగ్రి పూర్తిగా చోరీకి గురైంది. గతంలో ఎంతో కట్టుదిట్టంగా ఈ తనిఖీ కేంద్రం చుట్టూ ఫెన్సింగ్ఏర్పాటు చేస్తే ఆక్రమణదారులు ఫెన్సింగ్ ను ప్రోక్లైనర్లతో పెకిలించి స్థలాన్ని ఆక్రమించుకోవాలని ప్రయత్నించారు. ఈతనిఖీ కేంద్రానికి సంబంధించి జనరేటరు,వేయింగ్ మిషన్, సర్వో లెన్స్ కెమెరాలు,సుమారు 10 కోట్లకు పైగా ప్రభుత్వ ఆస్తులు ఉండగా వాటన్నిటికిభద్రత లేకుండాపోయింది. లక్షల రూపాయల విలువైన హెవీ జనరేటర్ లోపల ఉన్న సామాగ్రి పూర్తిగా చోరీకి గురైంది. అయితే గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దీనిని డిజిటల్ లైబ్రరీ కింద ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు మొదలుపెట్టగా అంతలోనే ప్రభుత్వ మారిపోవటంతో ఆ పని కార్యరూపం దాల్చలేదు. ఈ స్థలం అక్రమణా దారుల చేతుల్లోకి వెళ్ళకుండా దీనిపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి స్థలం ఆక్రమణకు గురికాకుండాతగిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని స్థానికులు తమ అభిప్రాయాన్ని తెలియజేస్తున్నారు. వృధాగా పడి ఉన్న 20 టన్నుల హెవీ వెయింగ్ మిషన్.... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నాగార్జునసాగర్ కోదాడ, వాడపల్లి, సాలూర, జహీరాబాద్, భైంసా, వాంకేడి, మద్దునూరు, చిరాగ్ పల్లి, తుంగభద్ర తదితర తనిఖీ కేంద్రాలుఉండగా ఇక్కడ ఎక్కడా ఏర్పాటు చేయని హెవీ వేయింగ్ మిషన్ కేవలం నాగార్జునసాగర్ లో మాత్రమే ఏర్పాటు చేశారు లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన ఈ వేయింగ్ మిషన్ నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది సంబంధిత శాఖ అధికారులు దీనిని వేరే చోటుకు తరలించకుండా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో ఎవరికి అంతుపట్టడం లేదు. కోట్ల రూపాయలు విలువైన ప్రజాధనం ఇలా దుర్వినియోగం అవడం పట్ల స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పొడి దుక్కి లో వరి విత్తనాలు విత్తే పద్ధతిపై రైతులకు అవగాహన



**పెన్ పహాడ్ జూన్ 28 (మనం న్యూస్):** మండల పరిధిలోని లింగాల గ్రామంలో రైతు వెంకన్న వ్యవసాయ క్షేత్రంలో ఐసిఏఆర్ భారతీయ పరిశోధనా సంస్థ రాజేంద్రనగర్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సి ఎస్ ఆర్ ఫండ్ సహకారంతో పొడి దుక్కిలో వరి విత్తనాలు ఎదబెట్టే విధానంపై స్థానిక రైతులకు అవగాహన కల్పించినట్లు కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్తలు బి. నరేష్, ఏ.కిరణ్ లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి సాగులో ఇప్పుడు బురద పొలాలు, నారుమడులు, నాట్లు లేవు నేరుగా విత్తనాలు ఎదపెట్టే పద్ధతి వచ్చేసింది. ఈ విధానం వైపు రైతులు మొగ్గుచూపుతున్నారని, గత మూడు సంవత్సరాలుగా వెదజల్లే పద్ధతి, డ్రం సీడ్ పద్ధతి వంటివి అమలవుతున్నాయని, సరికొత్తగా ఈ ఆధునిక పద్ధతిని అవలంబించడంతో చాలామంది రైతులకు ఖర్చు తగ్గడంతోపాటు మంచి దిగుబడి వస్తుంది అని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో మిషన్ ద్వారా నేరుగా విత్తనాలు నాటే విధానంతో రైతులకు ఎకరాకు 6 నుండి 8 వేల రూపాయల వరకు ఆదా అవుతున్నదని తెలిపారు. కూలీల సమస్యలు లేదని, పెసర, కంది, వేరుశనగ ఎలా ఎదపెడతారో అలానే వరి విత్తనాలు కూడా ఎదపెడుతున్నారు. సీడ్ కం ఫెర్టిలైజర్ మిషన్ తో సాగు చేస్తూ రైతులు మంచి దిగుబడి సాధించవచ్చు అని తెలిపారు. అదేవిధంగా చీడపీడల సమస్య, నీటి యాజమాన్య పద్ధతులు, కలుపు యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. వరి నేరుగా విత్తే విధానం ద్వారా దిగుబడి పెరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు మామిడి వెంకన్న , జ్యోతి, సర్వయ్య, హుస్సేన్, రవి, అరవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

స్వామివారి నిత్య రాబడి 29,35,688



**యాదగిరిగుట్ట, జూన్ 28 (మనం న్యూస్):** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దివ్య క్షేత్రంలో శనివారం నిత్య పూజా కైంకర్యాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వయంభులను మేల్కొల్పిన అర్చకులు గర్భగుడిలో కొలువు దీరిన స్వయంభులను సువర్ణ ప్రతిష్టమూర్తులను వేదమంతోత్స వములు, మంగళ వాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీదళాల లను అర్పించారు. ప్రాకారమంటపంలో సుదర్శన నరసింహ హోమం, నిత్య కళ్యాణం పండితులు ఘనంగా నిర్వహించారు. భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని మొక్కలను చెల్లించుకున్నారు. సాయంత్రం స్వామివారి వెండి జోడు సేవలో స్వామివారిని అలంకరించి తిరువీధులలో ఊరేగించారు. కొండపైన అనుబంధ ఆలయం శ్రీ రామలింగేశ్వర శివాల యంలో నిత్య కైంకర్యాలను పండితులు నిర్వహించారు. పాత గుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నిత్య పూజలను పండితులు నిర్వహించారు. స్వామివారి నిత్య రాబడి 29,35,688... యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి వివిధ శాఖల నుండి వచ్చిన ఆదాయం 29,35,688 వచ్చి నట్లు ఆలయ అధికారులు తెలిపారు.' యాదగి రిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కి కార్యనిర్వాహణా ధికారి వెంకట్రావ్ ఆధ్వర్యంలో దర్శన ఏర్పా ట్లు చేశారు. వేదాశీర్వచనం చేసిన వేద పండి తులు స్వామి వారి లడ్డు ప్రసాదం అందజేశారు.

# హుజూర్ నగర్ కు రెండు నూతన కోర్టులు మంజూరు

- ప్రభుత్వం జీవో ఎంఎస్ నెం.43 ద్వారా ఉత్తర్వులు జారీ
- మంత్రి ఉత్తమ్,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి విశేష కృషి మరువలేనిది.
- హర్ష వ్యక్తం చేసిన బార్ అసోసియేషన్ హుజూర్ నగర్ న్యాయవాదుల బృందం..
- అభివృద్ధిలో మరో మైలురాయి



**హుజూర్ నగర్,జూన్ 28, మనం న్యూస్:** హుజూర్ నగర్ కు మరొక రెండు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులను మంజూరు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం జీవో ఎంఎస్ నెం.43 ద్వారా ఉత్తర్వులు జారీ చేసినట్లు హుజూర్ నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సాముల రాంరెడ్డి,అధికార ప్రతినిది కాల్వ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుతం హుజూర్ నగర్ లో రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి, సీనియర్ సివిల్ జడ్జి, జూనియర్ సివిల్ జడ్జి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానాలు నాలుగు కొనసాగుతూ ఉండగా తాజాగా మంజూరైన రెండు న్యాయ స్థానాలతో కలుపుకొని హుజూర్ నగర్ లో న్యాయస్థానాల సంఖ్య ఆరుకు చేరినట్లు వారు తెలిపారు. నూతనంగా మంజూరైన న్యాయస్థానాలకు త్వరలోనే సిబ్బందిని కేటాయిస్తామని ఆ ఉత్తర్వులలో పేర్కొన్నట్లు వారు తెలిపారు.కాగా ఆ జీవో ద్వారా హనుమకొండ కు అదనపు జిల్లా న్యాయస్థానం, సుల్తానాబాద్, సంగారెడ్డి, దేవరకద్ర, భీమనగల్ లకు ఒక్కొక్కటి చొప్పున జయశంకర్ భూపాలపల్లి కి 02 జూనియర్ సివిల్ జడ్జి కోర్టులను మొత్తం కలిపి 9 న్యాయస్థానాలను తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు.ఇదిలా ఉండగా ప్రభుత్వం నూతనంగా మరో రెండు కోర్టులు మంజూరు చేయడంలో మంత్రి ఉత్తమ్,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి చేసిన విశేషకృషి మరువ లేనిదని పలువురు న్యాయ వాదులు హర్ష వ్యక్తం చేశారు.

# ముఖ్యమైన పాపన్న గౌడ్ చరిత్రను పాలకులు మార్చారు ప్రజలు కాదు



**గరిడేపల్లి,జూన్ 28,(మనం న్యూస్):** అణగారిన వర్గాలకు అధినాయకుడు బహుజన చక్రవర్తి శ్రీ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను పాలకులు ప్రభుత్వాలు మరిచిపోయారని అన్నారు.కానీ ప్రజలు మరవ లేదని పాపన్న గౌడ్ విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు అనంతు కరుణాకర్ గౌడ్ అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని పొనుగోడు గ్రామంలో ఈ నెల 29 ఆదివారం పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ గ్రామస్తుల సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈకార్యక్రమాన్ని ఆయా గ్రామాల ప్రజలు విజయవంతం చేయాలని పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కమిటీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి ఇంటింటికి కరపత్రాలను పంచినట్లు తెలిపారు. చత్రపతి శివాజీకి సమ పాలికుడు అణగారిన వర్గాలకు ఆరాధ్య దైవమైన బహుజన చక్రవర్తి పాపన్న గౌడ్ చరిత్రను ప్రభుత్వాలు పాలకులు మరిచారని అన్నారు.కానీ బహుజన బిడ్డలు మర్చిపోలేదని ప్రజల గుండెలలో కొలువైన పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హుజూర్నగర్ సిఐ చరమంద రాజు పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌడ పెద్దలు చామకూరి గురుస్వామి, నేలపట్ల వెంకటేశ్వర్లు, వీరమల్ల రమేష్,కమిటీ గౌరవ అధ్యక్షులు చామకూరి అంజి,బత్తిని రాంబాబు, ప్రధాన కార్యదర్శి నేలపట్ల అశోక్, కోశాధికారి పోలంపల్లి అంజి,ఉపాధ్యక్షులు మండవ రవి, వీరమల్ల సాయి,కానుగు గురుస్వామి, కార్యదర్శులు రాయి కింది చంటి,గూడెపురి శోభన్, అనంతు శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు అనంతు సతీష్, ప్రసాద్,మహేష్, గోపి, నాగేంద్రబాబు, ప్రదీప్, సైదులు,నరసయ్య,అంజి,నాగరాజు,వెంకన్న,అంజయ్య,వీరబాబు,వెంకటేష్,సైదులుమహేష్,బన్నీ,సతీష్,మనోజ్,వేణు,,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ సర్వతో ముఖాభివృద్ధికి యాక్షన్ ప్లాన్

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**చండూరు, జూన్ 28 (మనం న్యూస్):** చండూరు మున్సిపాలిటీని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మెరుగైన జీవన ప్రమాణాలు పెంపొందించుకుంటూ అభివృద్ధి పరచుకోవాల్సిన అవసరం ఉందన్నారు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మునుగోడు లోని క్యాంపు కార్యాలయంలో శనివారం చండూరు మున్సిపాలిటీ అభివృద్ధిపై జరిగిన సమీక్ష సమావేశంలో చండూరు మాస్టర్ ప్లాన్ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు హైదరాబాదుకు చెందిన సీనియర్ మాస్టర్ ప్లాన్ కన్సల్టెంట్ సుభాని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా భూగర్భ మురుగు నీటి వ్యవస్థ, మురుగునీటి శుద్ధి కేంద్ర ఏర్పాటు, రోడ్ల నిర్మాణం, కూడళ్ళ నిర్మాణం, వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్, నూతన మున్సిపాలిటీ పరిపాలన భవనం, పార్కులు, షాపింగ్ కాంప్లెక్స్ లు నిర్మాణాలపై యాక్షన్ ప్లాన్ రెడీ చేశారు...చండూరు రెవిన్యూ డివిజన్ గా మారిన తర్వాత భవిష్యత్తులో జనాభా పెరుగుదలను దృష్టిలో పెట్టుకొని వారికి సరిపడా మౌలిక వసతులను కల్పించాలని నిర్ణయించారు.. ప్రధానంగా డ్రైనేజ్ సిస్టంపై లోతుగా అధ్యయనం చేసి దానికనుగుణంగా మాస్టర్ ప్లాన్ రెడీ చేశారు..ఈ యాక్షన్ ప్లాన్ ను రానున్న మూడు ఆర్థిక సంవత్సరాలలో విడతల వారీగా అభివృద్ధి చేసుకోవాలని.

ఈ అభివృద్ధికి సంబంధించిన నిధులను ప్రభుత్వంతో మాట్లాడి తీసుకొచ్చే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు.. ఈ సమీక్ష సమావేశం లో హైదరాబాద్ కు చెందిన మాస్టర్ ప్లాన్ సీనియర్ కన్సల్టెంట్ సుభాని, ఉమ్మడి నల్గొండ జిల్లా పబ్లిక్ హెల్త్ ఎస్ ఈ వెంకటేశ్వరరావు, డి ఈ మనోరమ, ఏఈ నాగ ప్రసాద్, విద్యుత్ ఏఈ గణేష్, ట్రస్మ జిల్లా అధ్యక్షులు గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు చండూరు కాంగ్రెస్ పార్టీ మునిసిపల్ అధ్యక్షులు అనంత చంద్రశేఖర్ గౌడ్ దోటి వెంకటేష్ యాదవ్ కాంగ్రెస్ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతి



**అనంతగిరి, జూన్ 28 (మనం న్యూస్ ):** మండల పరిధిలోని వాయిలసింగారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసినటువంటి గ్రామపంచాయతీ కార్యాలయం అంగన్వాడి పాఠశాల భవనాన్ని కోదాడ శాసనసభ్యురాలు ఉత్తం పద్మావతి రెడ్డి ప్రారంభోత్సవం చేసినారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల శ్రేయస్సుకోసం నిత్యం అభివృద్ధి కార్యక్రమాలను చేస్తుందని ప్రజల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని 20 లక్షల రూపాయలతో నిర్మించామని అంగన్వాడి పాఠశాల భవనాన్ని 12 లక్షల రూపాయలతో నిర్మించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ముసుగు శ్రీనివాస్ రెడ్డి సీనియర్ నాయకులు బుర్ర పుల్లారెడ్డి డేగ కొండయ్య చుండూరు వెంకటేశ్వర్లు వెంపటి వెంకటేశ్వరరావు సొసైటీ చైర్మన్ బుర్ర వెంకటేశ్వర్లు మత్స్య సహకార సంఘం చైర్మన్ కంటూ నాగర్జున ఈదుల కృష్ణయ్య పంచాయతీరాజ్ ఏఈ సాయి పంచాయతీ కార్యదర్శి సిబ్బంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెద్దసూరారంలో పొలాలకు వెళ్లే రోడ్డుకు మోక్షం

- రూ.10 లక్షలు మంజూరు చేయించిన మంత్రి కోమటిరెడ్డి
- పూర్తయిన రోడ్డు-హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు





**నల్లగొండ, జూన్ 28 (మనం ప్రతినిధి):** నల్లగొండ మండలం పెద్ద సూరారం గ్రామంలో రైతులు వ్యవసాయ పంట పొలాలకు వెళ్లే రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. గ్రామంలోని తుమ్మలచెరువు నుంచి గుమ్మల బండ- పజ్జూరు లింకు రోడ్డు వరకు వెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే వారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు గుంతలతో ఈ ప్రాంతం గుండా పంట పొలాలకు వెళ్లేందుకు రైతులు అనేక అవస్థలు పడ్డారు. గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు ఈ విషయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు మంత్రి కోమటిరెడ్డి ఎస్ డి ఎఫ్ నిధులనుంచి రూ. 10 లక్షలు మంజూరు చేయించారు. నిధులు మంజూరైన వెంటనే అధికారులు 3 కిలోమీటర్ల పాటు తుమ్మలచెరువు నుంచి పజ్జూరు లింక్ రోడ్డు వరకు మట్టి రోడ్డు వేయించారు. దీంతో ద్విచక్ర వాహనాలతో పాటు ట్రాక్టర్లు, ఆటోలు, ఎడ్ల బండ్లు, అరకలు వెళ్లడానికి అవకాశం ఏర్పడింది. గ్రామం నుంచి పంట పొలాలకు వెళ్లే రోడ్డు వేయడం పట్ల ఈ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ రోడ్డు వేయాలని గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదని పలువురు రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం మాజీ ఎంపిటిసి పెండెం రత్నమాల పాండు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పిల్లి యాదగిరి యాదవ్ లు, పలువురు రైతులు పూర్తయిన రోడ్డును పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతుల సమస్యను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. ఇటీవలనే ఈ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయగా 10 రోజులలోనే అధికారులు రోడ్డు పనులు పూర్తి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు తంతనపల్లి రామలింగం, గుండె వెంకన్న కోట్ల జలంధర్ రెడ్డి, ఎర్రమద నర్సిరెడ్డి, అబ్బగోని వెంకన్న, సిహెచ్ రవి, నిమ్మ కోటి రాజు, పిల్లి మల్లేశం, కే లింగయ్య, ముసుకు బిక్షం ,ముస్కు సైదులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకి నాణ్యమైన భోజనం అందించాలి



**సూర్యాపేట,జూన్ 28 (మనం ప్రతినిధి):** విద్యార్థులకి నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తెలిపారు. శనివారం సూర్యాపేట పట్టణం లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు ఆకస్మిక తనిఖీ లు చేశారు. ఈ సందర్బంగా స్టాక్ రూమ్ లో ఉన్న బియ్యం, అలాగే స్టాక్ రిజిస్టర్ వివరాలు పరిశీలించారు. అదేవిధంగా పట్టణం లోని తాళ్లగడ్డ లో ఉన్న టి జీ ఎస్ డబ్ల్యూ ఆర్ ఈ ఐ ఎస్ లో నిర్వహిస్తున్న హెల్త్ క్యాంపు ని సందర్శించారు. ఈ సందర్బంగా విద్యార్థుల హెల్త్ చెకప్ జాగ్రత్తగా చేయాలని సూచించారు. అలాగే విద్యార్థులకి మధ్యాహ్న భోజనం లో భాగంగా వండిన అన్నం నాణ్యత, అలాగే స్టాక్ వివరాలు, కూరగాయలు పరిశీలించారు ఈ కార్యక్రమం లో ప్రధాన ఉపాధ్యాయురాలు నాగరాణి, టి జీ ఎస్ డబ్ల్యూ ఆర్ ఈ ఐ ఎస్ ప్రిన్సిపల్ విద్యాసాగర్, ఉపాధ్యాయులు యాదయ్య, వెంకటేశ్వర్లు, ఆర్ ఐ శ్రీధర్,జడ్పీ హెచ్ ఎస్ జూనియర్ అసిస్టెంట్లు సోమలక్ష్మి, ఫాతిమ సుల్తాన తదితరులు పాల్గొన్నారు.

## రూ.70 వేలతో గంగ గుడికి బోరు వితరణ



- రైతులు, కూలీలు, భక్తులకు ఉపయోగం

**కురవి, జూన్ 28(మనం న్యూస్):** మహబూబాద్ జిల్లా కురవి మండలం లోని అయ్యగారి పల్లి గ్రామంలో గంగమ్మ గుడి వద్ద తన సొంత నిధులు 70 వేల రూపాయల తోటి బోరు వేయించినట్లు దూదిమట్ల దేవేందర్ తెలిపారు. పంటలు బాగా దిగుబడి వస్తే గంగమ్మ గుడి వద్ద బోర్ వేపిస్తానని మొక్కుకున్నట్లు ఆయన తెలిపారు. గంగమ్మను వేడుకుంటే అనుకున్న పనులు జరుగుతాయని అనుకున్నట్లే జరగడంతో పొలాలకు వెళ్లే రైతులకు వ్యవసాయ కూలీలకు పశువుల కాపరులకు గొర్ల కాపరులకు మంచినీళ్లు తాగేందుకు ఉపయోగపడుతుందని బోరు వేపిచ్చానని అన్నారు. గ్రామ ప్రజలపై గంగమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆయన వేడుకున్నట్లు తెలిపారు.

## ఇందిరమ్మ నిర్మాణాలు వేగవంతం చేయాలి

- ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి
- పాఠశాల హాస్టల్‌లో వైద్య సేవలందించాలి
- నిరంతరం శానిటేషన్ చేయాలి
- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**కురవి, జూన్ 28(మనం న్యూస్):** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలు పాటించా లని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వై త్ కుమార్ సింగ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆక స్మికంగా కలెక్టర్ పర్యటించారు. జిల్లా పరిషత్, ఉన్న త పాఠశాల అంగన్వాడి పాఠశాలలను పరిశీలించి తగు సూచనలు చేశారు. వర్షాలు రాబోతున్న తరుణంలో పిల్లలకు సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారులు నిరంతరం విద్యార్థులను పరీక్షించి మందులు ఇవ్వాలని అన్నారు. గురుకులాల్లో హాస్టల్లో పిల్లలను రోజు విడిచ రోజు పరీక్షించాలన్నారు. అంగన్వాడిలో పిల్లలకు పోషక ఆహారం అందించాలన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా బోధనలు అందించాలని అధ్యాపకులకు సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. వచ్చిన రోగులను వెంటవెంటనే చూసి వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ విరాజితకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకం అర్హులైన ప్రతి ఒక్కరికి పేదవారికి ఇండ్లు వస్తాయన్నారు. ఇందిరమ్మ కమిటీల ప్రభుత్వ సూచనల ప్రకారం ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని ఆయన అన్నారు. స్వయం సహాయక బృందాలలో సభ్యులుగా ఉన్న మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించి ఇంటి నిర్మాణానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ కమిటీ మహిళలలు లబ్ధిదారులు ముగ్గు పోసుకునే కార్యక్రమాల్లో సంబంధిత అధికారులు ఇందిరమ్మ కమిటీలు పాల్గొని గృహం నిర్మించుకునే వారికి సహాయక సహకారాలు అందించాలని ఆయన సూచించారు. వేసవి సెలవులు అనంతరం మండలంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ద్వారా అన్ని విద్యాసంస్థలలో అధికంగా అడ్మిషన్స్ కల్పించామని జిల్లా విద్యాశాఖ యంత్రాంగం ప్రభుత్వ సూచించిన ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుకున్న పిల్లలందరికీ అత్యుత్తమ విద్యా బోధనలతో పాటు పుస్తకాలు సబ్జెక్టులో నైపుణ్యతతో పాటు విద్యార్థులను వెనకబడి చదువుల వెనుకబడ్డ విద్యార్థిని విద్యార్థులను ప్రత్యేక క్లాసులతో వారిని చదువులో ముందంజలో ఉంచటం జరుగుతుందన్నారు. విద్యార్థులకు వారం వారం వారి చదువులో ఎలా ఉన్నారు ఎగ్జామ్స్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రైవేటు స్కూలుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో కాలేజీలు పని చేస్తున్నాయని అన్నారు. విద్యార్థులకు క్రీడలతో పాటు సామాజిక అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి నేర్పించడం జరుగుతుందని తెలిపారు. క్రీడల్లో రాణించే వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి మెరుగైన ఆటలు ఆడేందుకు పోటీల్లో పాల్గొనేందుకు పిఈటిలు కృషి చేస్తున్నారని తెలిపారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు మెనూ ప్రకారం బ్రేక్ఫాస్ట్ మధ్యాహ్న భోజనం స్నాక్స్ డిన్నర్ అని అందించాలని వాటితో పాటు విద్యార్థుల మెడికల్ ప్రొఫైల్ ప్రకారం వారిని పరీక్షించాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మార్పు వలన సేద నవల వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున మెడికల్ హెల్త్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ నిరంతరం గురుకులాల్లో ఉండే విద్యార్థిని విద్యార్థులకు ఉన్నత పాఠశాల జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా గ్రామాలలో తండాలలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఏఎన్ఎంలు ఆశాలు పిహెచ్సి వైద్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పర్యటించి ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ విజయ. ఎంపీడీవో కే వీరబాబు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నెల్లూరు రవి కుమార్. డాక్టర్ వీరాజిత. స్టాఫ్ నర్స్ అనురాధ. హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్, ఏఎన్ఎం నసీమా బేగం. జడ్పీహెచ్ఎస్, ఉన్నత పాఠశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలి



- జిల్లా మెజిస్ట్రేట్ హారిక

రాయపర్తి, జూన్ 28(మనం న్యూస్): రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలని జిల్లా మెజిస్ట్రేట్ హారిక అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణంలో రైతులకు,విత్తన డీలర్లకు విత్తన ఎంపిక, కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ హారిక మాట్లాడుతూ రైతులు నేలకు అనువైన విత్తనాలను ఎంచుకోవాలని సూచించారు.సీడ్, ఫర్టిలైజర్ షాపుల్లో నాణ్యత లేని, కల్తీ విత్తనాలు అమ్మినచో సంబంధిత డీలర్ల పై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.రైతులు అధిక యూరియా వాడకం వల్ల చీడపిడలు పెరిగి రైతులకు ఎక్కువ ఖర్చు వస్తుందని,అందువల్ల యూరియా వాడకాన్ని తగ్గించాలని అన్నారు.వరి కంటే ముందు పచ్చి రొట్టె పైరు తప్పనిసరిగా వేసుకోవాలి.రకాల ఎంపిక కన్నా కూడా పంటల యాజమాన్యం చాలా ముఖ్యమని,రైతులు పంట మార్పిడి దిశగా ఆలోచించాలని కోరారు.పంట మార్పిడి పద్ధతితో అధిక దిగుబడులు పొందవచ్చని అన్నారు.

రైతులు నాణ్యమైన విత్తనాలను రైతులు ఎన్నుకోవాలని అన్నారు.రైతులు లూసు,తెల్ల గుడ్డ సంచులలో ఉన్న విత్తనాలను ఎట్టి పరిస్థితులలో కొనుగోలు చేయరాదని,తప్పనిసరిగా సీల్ ప్యాకెట్లలో ఉన్న విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని కోరారు.వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధికృత డీలర్ వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ రజినీ, తహసిల్దార్ శ్రీనివాస్, వర్ధన్నపేట సీఐ శ్రీనివాస రావు, ఎస్ఐ రాజేందర్, మండల వ్యవసాయ అధికారి వీరభద్ర, తదితరులు పాల్గొన్నారు.

## నచ్చిన నేత చిత్రం గీసి అభిమానం చాటిన యువకుడు



భీమదేవరపల్లి, జూన్ 28(మనం న్యూస్): హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామానికి చెందిన మాడుగుల చింటూ తన రక్తంతో హుస్నాబాద్ మాజీ శాసన సభ్యులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి చిత్రాన్ని గీయించి అభిమానం చాటుకున్నారు. శనివారం ఆయన స్వగృహంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చింటూ రక్తంతో గీయించిన ఫొటో ఫ్రేమ్‌ని మాజీ ఎమ్మెల్యేకు అందించాడు. ఎల్లప్పుడూ ప్రజా శ్రేయస్సు కోసం ఆలోచించే గొప్ప నాయకుడు అని కొనియాడారు.

## చిన్న కాళేశ్వరం పనుల్లో వేగం పెంచండి

- కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి, జూన్ 28(మనం ప్రతినిధి):** ఐడీఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో చిన్న కాళేశ్వరం పనులు ప్రగతిపై ఇరిగేషన్, ఫారెస్ట్, రెవెన్యూ శాఖల అధికారులతో పాటు మెగా కంపెనీ ప్రతినిధులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మాణం చేపట్టిన చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులలో వేగం పెంచాలని తెలిపారు. ఆధునీకరణలో ఉన్న చెరువుల, కాలువల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పంపు హౌస్ పనులను సైతం వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. భూ సేకరణ సమస్యలు ఉన్న గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి గ్రామస్థులతో తీర్మానం చేయించాలని, భూసేకరణ పూర్తి అయిన గ్రామాలలో పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. సోమవారం నుండి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు గ్రామాలలో క్షేత్ర స్థాయిలో పర్యటించి పనులలో పురోగతిని పరిశీలించి నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఎఫ్ఓ నవీన్ రెడ్డి, ఇరిగేషన్ ఈఈ సూర్య ప్రకాష్, మెగా కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బుగులు వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం



**స్టేషన్ ఘన్‌పూర్/ చిల్పూరు, జూన్ 28(మనం న్యూస్):** చిల్పూరుగుట్ట శ్రీ బుగులు వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం స్వామి వారి కల్యాణం వేద మంత్రోచ్చరణలతో అర్చకులు వైభవంగా నిర్వహించారు. వివిధ పట్టణాలు, గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. దేవస్థాన అంగడి ఆవరణలో భక్తుల సౌకర్యార్థం వాటర్ ట్యాంక్ నిర్మాణం కొరకై హైదరాబాద్ వాస్తవ్యులు మేకల వంశీ, సునీల్ రెడ్డి మాధవిలత రూ 80,000ల విరాళం ఈవోకు అందజేశారు. అనంతరం హైదరాబాద్, వరంగల్‌కు చెందిన నిబానపూడి అఖిల్ శర్మ పనితకల్యాణి, మేర్గు నవీన్ వీణ, విశ్వతేజ దాతల సహకారంతో అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ఈవో లక్ష్మీ ప్రసన్న, ధర్మకర్త మండలి సభ్యులు, డాక్టర్ వేముల వెంకటేశ్వర్లు, గొలి రాజశేఖర్, గణగోని రమేష్, సిబ్బంది మోహన్, ప్రధాన అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, అర్చకులు సౌమిత్రి శ్రీరంగా చార్యులు, కృష్ణమాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

## వైద్య కళాశాల సౌకర్యాల కల్పనకు ప్రభుత్వానికి నివేదిక

- రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ



**నర్సంపేట, జూన్ 28( మనం న్యూస్):** ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు వైద్య విద్య కళాశాలలకు ఎన్ఎంసి నిబంధనల మేరకు సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వానికి నివేదికను సమర్పించనున్నట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేట మెడికల్ కళాశాలలో శనివారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలసి పిన్సిపాల్ , కోఆర్డినేటర్ డాక్టర్ మోహన్ దాస్, వివిధ విభాగాధిపతులు, అనుబంధ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ తో ఆస్పత్రి వసతుల కల్పనకు కావలసిన వివిధ అంశాలపై కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నర్సంపేట మెడికల్ కళాశాలలో బోధన, బోధనేతర, ల్యాబ్, సిబ్బంది, కావాల్సిన వసతులపై సమీక్షించారు. వైద్య విద్యార్థినుల వసతి గృహాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి వాటిని గురించిన వివరాలను ప్రిన్సిపల్ డా' మోహనదాస్‌ని కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిఎమ్మి నర్సంపేట లో ఉన్న ఆసుపత్రిలోని పలు విభాగాలను జిల్లా కలెక్టర్, వైద్యాధికారులతో కలిసి కమిషనర్ సందర్శించి అక్కడున్న వనరులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిని సందర్శించి ఓపి విభాగం, ఆరోగ్యశ్రీ, సందర్శించి ఆయా వార్డుల వివరాలు, ఓపి సేవలు, రిఫరల్స్, ఫాలో అప్, ఇతర సేవల గురించి, వైద్యులు సిబ్బంది, తదితర వివరాలను వైద్యాధికారులను కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ అడిగి తెలుసుకున్నారు. వివిధ విభాగాల్లో వనరుల కొరత, యూజీ మెడికల్ ఎడ్యుకేషన్ ఎన్ఎంసి నిబంధన ప్రకారం ఉండాల్సిన, సమకూర్చాల్సిన సౌకర్యాల గురించి చర్చించారు. ఈసమావేశంలో వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ సాంబశివరావు, టీజీఎంఐడిసి ఈఈ ప్రసాద్, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ బి. కిషన్ , వైస్ పిన్సిపాల్ డాక్టర్ లక్ష్మినారాయణ, డాక్టర్ శ్రీదేవి , పలు విభాగాల అదిపతులు, బోధన, బోధనేతర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్య శిక్షణ కోసం ఎంబీసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి

జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జె.రంగారెడ్డి

**పెద్దపల్లి, జూన్ 28(మనం ప్రతినిధి):** జూలై 12 లోపు నైపుణ్య శిక్షణ కోసం ఆసక్తి , అర్హత గల ఎంబీసి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసి అభివృద్ధి అధికారి జె.రంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యంత వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎంబీసీ నిరుద్యోగ యువతకు వివిధ నైపుణ్య శిక్షణ కార్యక్రమం 4 రోజుల పాటు హైదరాబాద్‌లో అందించడం జరుగుతుందన్నారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు భోజన సదుపాయం, టిఏ, వసతి కల్పించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులకు 21 నుంచి 30 ఏండ్ల లోపు ఉండాలని, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలని, ఎంబీసీ 36 కులాల వారికి మాత్రమే ఈ శిక్షణ కార్యక్రమం అందుతుందని, వీరి వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో 1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 2 లక్షలు ఉండాలన్నారు.

## ఘనంగా సందనవేన మహేంద్రనాథ్ జన్మదినోత్సవం



**మహాదేవపూర్, జూన్ 28(మనం న్యూస్):** అఖిల భారతీయ యాదవ సంఘం మహాసభ జాతీయ కార్యవర్గ సభ్యులు తెలంగాణా రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం దారులసంఘం గౌరవ అధ్యక్షులు సందనవేన మహేంద్రనాథ్ యాదవ్ జన్మదిన వేడుకలను మహాదేవపూర్ మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిచారు. ఈసందర్భంగా శనివారం మహాదేవపూర్ మండల కేంద్రంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో మండల యాదవ సంఘం మాజీ అధ్యక్షులు కన్నీబోయిన ఐలయ్య యాదవ్, మండల ఉపాధ్యక్షులు కాటవేణి రాజయ్యయాదవ్. కాత్రేవుల నవీన్ యాదవ్, పర్శవేణి నగేష్ యాదవ్, ములుకల తిరుపతి, పిడుగు బాపు యాదవ్, దాసరి దేవేందర్, సిద్ది శంకర్, బత్తిని మల్లేష్, అఖిల్, కొమురయ్య, రాకేష్, జాగరి రాజయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ విజయం దిశగా పనిచేద్దాం

- మాజీ మంత్రి ఎర్రబెల్లి



**పర్వతగిరి, జూన్ 28(మనం న్యూస్):** వరంగల్, ఉర్సు గుట్టలోని నాని గార్డెన్‌లో ఏర్పాటు చేసిన వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరయ్యారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ, సర్వేలన్నీ మన వైపే పక్కా 100 ఎంఎల్ఏ సీట్లు ఖాయమని, రేవంత్ రెడ్డి ఒక అబద్ధాల కోరు అని, రానున్న స్థానిక ఎన్నికల్లో మన పార్టీ విజయం దిశగా అందరు పని చేయాలని, గ్రామ గ్రామానా గులాబీ జెండా ఎగర వేయాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని, ఈ మోసపూరిత కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చుకోలేక మొత్తం ఫెయిల్ అయిందని, మనం చేసిన అభివృద్ధిని ప్రజల వద్దకి తీసుకెళ్లి వారికీ నిజాలు తెలియజేసే బాధ్యత ప్రతీ ఒక్కరు తీసుకోవాలని, కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని, రైతులకు సాగునీరు అందించి వారి కుటుంబాల్లో సంతోషాన్ని నింపింది మన కేసీఆర్ అయితే, కనీసం రైతులకు సాగునీరు అందియ్యక వారి కళ్ళల్లో కన్నీటిని నిలిపింది.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వమని, నాట్లకి నాట్లకి మధ్యన రైతు బంధు వేసింది మన కేసిఆర్ అయితే,ఓట్లకి ఓట్లకి మధ్యన రైతు భరోసా వేసింది ఈ కపట కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యలో రెండుసార్లు రైతు భరోసా ఎగగొట్టారని, ఈ విషయం ప్రజలకి అర్థం అయ్యేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి మెట్టుట్టు శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, వర్ధన్నపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తుళ్ల కుమారస్వామి, ఎర్రబెల్లి రాజేశ్వరరావు, తంపుల మోహన్, బండి రజని కుమార్, మాజీ జడ్పీటీసీ మార్గం బిక్షపతి, మాజీ ఎంపీపీ అన్నమనేని అప్పారావు, కార్పొరేటర్లు ఇండ్ల నాగేశ్వర్ రావు, జోరిక రమేష్, రాధికా రెడ్డి, సొసైటీ చైర్మన్‌లు మనోజ్ కుమార్, దొంతి జయపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ తక్కళ్లపెల్లి చందర్ రావు, గుజ్జ గోపాల్ రావు, గుజ్జ సంపత్ రెడ్డి, ముఖ్య సీనియర్ నాయకులు పిట్టల రాజు, పొట్లపెల్లి క్రిష్ణ, ఉద్యమకారులు ఆరెపల్లి మోహన్, బుద్ధ వెంకన్న, చింతపట్ల సోమేశ్వర్ రావు, చిన్నపాక శ్రీనివాస్, ఆమడగాని రాజు యాదవ్, ఏర్పుల శ్రీనివాస్ యాదవ్, తక్కలపల్లి సంపత్ రావు, దాడి సదానందం, చింతల శ్రీనివాస్, ధర్మోజు దేవేందర్, మాసాని వెంకట్, డివిజన్ అధ్యక్షులు, తాజా, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు, యూత్ సోషల్ మీడియా నాయకులు పాల్గొన్నారు.

## పోరాట యోధుడు.. గాజర్ల రవి

- సభలో ఎమ్మెల్యేలు జీఎస్సార్, రేవూరి

భూపాలపల్లి, జూన్ 28(మనం ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కింటుకూరు అడవీ ప్రాంతంలో ఈనెల 18న జరిగిన ఎన్ కౌంటర్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల గ్రామానికి చెందిన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి, 2004 శాంతి చర్చల ప్రతినిధి గాజర్ల రవి అలియాస్ గణేష్ అలియాస్ ఉదయ్ మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా, వారి సంస్మరణ సభ శనివారం గాజర్ల స్వగ్రామం వెలిశాలలో జరిగింది. ఈ సంస్మరణ సభలో భూపాలపల్లి, పరకాల ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, రేవూరి ప్రకాష్ రెడ్డిలు పాల్గొన్నారు. గాజర్ల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యేలిద్దరూ పరామర్శ తెలిపారు. ధైర్యంగా ఉండా లని సూచించారు. సామాన్య కుటుంబంలో జన్మిం చిన గాజర్ల రవి యువకుడిగా ఉన్న రోజుల్లోనే బడుగు, బలహీన వర్గాల పేద ప్రజల పక్షాన ఎన్నో పోరాటాలు చేసి, అడవి బాట పట్టి సుమారు 33 ఏళ్ల పాటు అజ్ఞాత జీవితం గడిపి ఎన్ కౌంటర్లో మృతి చెందారు. కాగా, శనివారం వెలిశాలలో జరుగుతున్న సంస్మరణ సభకు పెద్ద సంఖ్యలో గాజర్ల అభిమానులు, సానుభూతిపరు లు, ప్రజా సంఘాల నేతలు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.





## డబ్ల్యూటీసీ చరిత్రలో ట్రావిస్ హెడ్ సరికొత్త రికార్డు

ఆస్ట్రేలియా బ్యాటర్ ట్రావిస్ హెడ్ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో నయా రికార్డు సృష్టించాడు. డబ్ల్యూటీసీలో 10 ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు అందుకున్న తొలి ఆటగాడిగా ఘనత సాధించాడు. 50 మ్యాచ్‌ల్లోనే హెడ్ ఈ రికార్డు సొంతం చేసుకున్నాడు. విండీస్‌తో జరిగిన తొలి టెస్టులో ఆసీస్ బ్యాటర్ ఈ ఫీట్ అందుకున్నాడు. బార్బడోస్ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టులో ఆసీస్ 159 పరుగుల తేడాతో గెలుపొందింది. ట్రావిస్ హెడ్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అర్ధ శతకాలు (59, 61) చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఇక, ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ మొదలైనప్పటి (2009) నుంచి సుదీర్ఘ ఫార్మాట్‌లో హెడ్ అదరగొడుతున్నాడు. నిలకడగా రాణిస్తూ ఆసీస్‌కు కీలక బ్యాటర్‌గా మారాడు. ఇప్పటివరకు డబ్ల్యూటీసీలో 50 మ్యాచ్‌లు ఆడి 3,233 పరుగులు చేశాడు.

అత్యధిక రన్స్ చేసిన ఆటగాళ్ల జాబితాలో ఆరో స్థానంలో ఉన్నాడు. డబ్ల్యూటీసీ హిస్టరీలో అత్యధిక ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌లు అందుకున్న వారిలో ట్రావిస్ హెడ్ తర్వాత ఇంగ్లాండ్ బ్యాటర్లు బెన్ స్టోక్స్, జో రూట్ ఉన్నారు.



## బర్మింగ్‌హామ్‌లో ఈ సారైనా.. టీమ్ఇండియాను కలవరపెడుతున్న చరిత్ర

ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఇంగ్లాండ్, భారత్ మధ్య జులై 2 నుంచి రెండో మ్యాచ్ ప్రారంభంకానుంది. తొలి టెస్టులో బ్యాట్‌తో అదరగొట్టి ప్రత్యర్థికి భారీ లక్ష్యం నిర్దేశించినా బౌలర్లు తేలిపోవడంతో టీమ్ఇండియా కు ఓటమి తప్పలేదు. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగే రెండో టెస్టులో గెలిచి సిరీస్‌ను సమం చేయాలని భారత్ పట్టుదలతో ఉంది. అయితే, ఒక విషయం టీమ్ఇండియాను కలవరపెడుతోంది. భారత్‌కు కలిసిరాని మైదానాల్లో ఇది కూడా ఒకటి.

ఇప్పటివరకు ఈ స్టేడియంలో ఏడు టెస్టులు ఆడిన భారత జట్టు ఒక్క మ్యాచ్‌లోనూ గెలవకపోవడం గమనార్హం. ఈ మైదానంలో భారత్ ఉత్తమ ప్రదర్శన డ్రా మాత్రమే. 1986లో కపిల్ దేవ్ సారథ్యంలోని జట్టు మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. మిగిలిన ఆరు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. ఈ సారి ఎలాగైనా ఎడ్జ్‌బాస్టన్‌లో గెలిచి చరిత్ర సృష్టించాలనుకుంటున్న టీమ్ఇండియాను మరో అంశం కలవరానికి గురిచేస్తోంది.వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాఈ మ్యాచ్‌కు దూరమయ్యే అవకాశాలున్నాయి. బుమ్రా ఆడకపోతే ఇంగ్లాండ్ బ్యాటర్లు మరింత చెలరేగి ఆడొచ్చు.

## ప్రాక్టీస్ సెషన్‌లో చెమటోడ్చిన అర్షదీప్ సింగ్

ఇంగ్లాండ్‌తో బర్మింగ్ హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా రెండో టెస్ట్ మ్యాచ్ జులై 2 నుంచి ప్రారంభం కానుంది. లీడ్స్‌లో జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్‌లో టీమ్ఇండియా ఓటమి పాలైంది. దీంతో సిరీస్‌లో 1-0 తేడాతో వెనకబడింది. ఈ నేపథ్యంలో రెండో టెస్ట్ మ్యాచ్‌పై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. వర్క్‌లోడ్ దృష్ట్యా జస్ప్రీత్ బుమ్రా ఈ సిరీస్‌లో కేవలం మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడనున్నాడు. అతడు ఇప్పటికే మొదటి టెస్ట్ మ్యాచ్‌లో ఆడిన నేపథ్యంలో మరో రెండు మ్యాచ్‌లకే అందుబాటులో ఉండనున్నాడు. అయితే అవి ఏ మ్యాచ్‌లనేది అధికారికంగా వెల్లడి కాలేదు. అలాగే రెండో టెస్ట్ మ్యాచ్‌లో బుమ్రా ఆడతాడో, లేదో అనే విషయమై ఇప్పటికీ స్పష్టత లేదు. ఒకవేళ బుమ్రా రెండో టెస్ట్ మ్యాచ్‌లో ఆడకుంటే.. అర్షదీప్ సింగ్ టీమ్ఇండియా తరపున టెస్ట్ అరంగేట్రం చేసే అవకాశం ఉంది. అతడు ఇప్పటికే వైట్ బాల్ క్రికెట్‌లో తన సత్తా చాటాడు. అలాగే అతడికి కౌంటీ క్రికెట్ ఆడిన అనుభవంతో పాటు, ఇంగ్లాండ్‌లోని కండీషన్స్‌పై కాస్తోకూస్తో అవగాహన ఉంది. ఇది టీమ్ఇండియాకు సానుకూలంగా మారనుంది. బుమ్రా విషయంలో అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో ఎడ్జ్‌బాస్టన్ నెట్స్‌లో అర్షదీప్ సింగ్ బౌలింగ్‌లో చెమటోడ్చాడు. అలాగే పేసర్ మహ్మద్ సిరాజ్ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు.





## అలా చేయలేకపోతే నన్ను కామెంట్ చేయొద్దు: సమంత

ఫిట్‌నెస్ విషయంలో ఎన్నో జాగ్రత్తలు పాటిస్తుంటారు నటి సమంత. ఇటీవల ఆమె లుక్స్‌పై పలువురు కామెంట్స్ చేస్తున్న విషయం తెలిసిందే. ఆమె చిక్కిపోయారని, అనారోగ్యంగా కనిపిస్తున్నారని పలువురు మాట్లాడుకున్నారు. దీనిపై సమంత తాజాగా స్పందించారు. సోషల్‌మీడియా వేదికగా ఆసక్తికర పోస్ట్ పెట్టారు. నెటిజన్లకు ఒక సవాలు విసిరారు. ఆ సవాలు పూర్తి చేయని పక్షంలో తనని ఆవిధంగా కామెంట్ చేయొద్దన్నారు. సమంత తాజాగా ఇన్‌స్టా స్టోరీస్‌లో ఒక వీడియో షేర్ చేశారు. ఇందులో ఆమె జిమ్‌లో పుల్ అప్స్ చేస్తూ కనిపించారు. ''డీల్ కుదుర్చుకుందాం. ఇందులో చూపించిన విధంగా మీరు కనీసం మూడు పుల్ అప్స్ చేసేవరకూ 'సన్నబడ్డావు', 'ఆరోగ్యం బాలేదా?' లేదా ఏ ఇతర చెత్త కామెంట్స్ నాపై చేయొద్దు. పుల్ అప్స్ మీరు చేయలేకపోతే ఇకపై ఆ విధంగా మాట్లాడకండి'' అని సమంత రాసుకొచ్చారు.సమంత ప్రస్తుతం నటిగానే కాకుండా నిర్మాతగానూ వ్యవహరిస్తున్నారు. ఇటీవల ఆమె నిర్మించిన 'శుభం' విడుదలై ప్రేక్షకులను అలరించింది. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తోన్న 'రక్త్ బ్రహ్మాండ్' చిత్రీకరణ దశలో ఉంది. దర్శకద్వయం రాజ్, డీకే దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. గురువారం సాయంత్రం సమంత ఓ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్నారు. ట్రెండీ లుక్‌లో కార్యక్రమానికి హాజరైన ఆమె నటి శ్రీలీలతో కలిసి ఫొటోలకు పోజులిచ్చారు. దీనికి సంబంధించిన ఫొటోలపై పలువురు స్పందిస్తూ.. ఆమె బాగా సన్నబడ్డారన్నారు. ఆరోగ్యపరంగా ఆమె కొంతకాలం క్రితం మయోసైటిస్ బారిన పడిన విషయం తెలిసిందే.

## రెండో బిడ్డకు జన్మనిచ్చిన ఇలియానా..



నటి ఇలియానా మరోసారి తల్లి అయ్యారు. జూన్ 19న పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ఈమేరకు బాబు ఫొటోను షేర్ చేస్తూ తన ఆనందాన్ని పంచుకున్నారు. మా ప్రియమైన అబ్బాయి 'కియాను రఫే డోలన్'ని పరిచయం చేస్తున్నందుకు మా హృదయాలు సంతోషంతో నిండిపోయాయి అనే క్యాప్షన్ పెట్టారు. ఈ పోస్ట్ చూసిన పలువురు నెటిజన్లు, ప్రముఖులు ఇలియానాకు అభినందనలు చెబుతున్నారు. నటి ప్రియాంక చోప్రా ఈ పోస్ట్‌కు స్పందిస్తూ అభినందనలు తెలిపారు. 2023లో మైఖేల్ డోలన్‌ను ఇలియానా ప్రైవేట్‌గా వివాహం చేసుకున్నారు. అదే ఏడాది ఆగస్టులో మొదటి బిడ్డకు జన్మనిచ్చారు. 'కోవా ఫీనిక్స్ డోలన్'గా పేరు పెట్టినట్లు చెప్పారు. ఒకానొక సమయంలో తన పెళ్లి, భర్త గురించి వచ్చిన విమర్శల్ని సున్నితంగానే తోసిపుచ్చారు ఇలియానా.. 'నన్నేమన్నా భరిస్తా.. కానీ నా కుటుంబసభ్యుల్ని ఏమైనా అంటే ఊరుకునేది లేదు..' అంటూ పోస్ట్ పెట్టారు.ఇక 'దేవదాస్'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఇలియానా.. కొంతకాలంగా తెలుగు పరిశ్రమకు దూరంగా ఉంటోంది. ఈ అమ్మడు తెలుగు తెరపై చివరిసారి 2018లో కనిపించింది. రవితేజ హీరోగా నటించిన 'అమర్ అక్బర్ ఆంటోనీ' లో నటించారు. ఆ తర్వాత బాలీవుడ్‌లో పలు సినిమాలు చేశారు.




## పెళ్లా...వద్దే.. వద్దు



కొందరు పెళ్లి పేరు ఎత్తితేనే పారిపోతుంటారు. అందులో డార్లింగ్ ప్రభాస్ ముందు వరుసలో ఉంటాడు. 45 ఏళ్లు వచ్చినా ఇంకా పెళ్లి ముచ్చటే లేదు. ఈ ఏడాదే ప్రభాస్ బ్యాచిలర్ లైఫ్‌కు ఫుల్‌స్టాప్ పడుతుందంటూ ఎప్పటికప్పుడు ఊహాగానాలు వినిపించినా అవన్నీ ఉట్టి పుకార్లుగానే మిగిలిపోయాయి. డార్లింగ్ జీవితంలోకి రాబోయే అమ్మాయి ఎక్కడుందో? ఏంటో? లక్కీ గర్ల్ అని అభిమానులు సరదాగా అనుకుంటూ ఉంటారు. అయితే ఎవరెన్ని అనుకున్నా.. వయసు మీద పడుతున్నా సరే.. ప్రభాస్ మాత్రం పెళ్లంటేనే నాలుగడుగులు వెనకడుగు వేస్తున్నాడు. వయసు దాటిపోతున్నా.. లెక్క చేయడం లేదు. రియల్ లైఫ్‌లోనే కాదు రీల్ లైఫ్‌లో కూడా ఇదే జరిగింది. కన్నప్ప సినిమాలో రుద్ర పాత్రలో కనిపించాడు ప్రభాస్. ఓ సీన్‌లో తిన్నడు(విష్ణు).. రుద్ర(ప్రభాస్)ను నీకు పెళ్లయిందా? అని అడుగుతాడు. అందుకు రుద్ర.. నా పెళ్లి గురించి నీకెందుకులే.. అని కౌంటరిచ్చాడు. అప్పుడు విషయం అర్థమైన తిన్నడు.. పెళ్లి చేసుకుంటే తెలిసేది అని డైలాగ్ విసురుతాడు. ఈ సంభాషణకు థియేటర్‌లో చప్పట్లు, విజిల్స్ గట్టిగానే పడ్డాయి. ప్రభాస్ అభిమానుల అరుపులతో థియేటర్ దద్దరిల్లిపోతోంది.

## 'ది ఫ్యామిలీ మ్యాన్' అభిమానులకు సర్‌ప్రైజ్




ఓటీటీలో 'ది ఫ్యామిలీ మ్యాన్' వెబ్ సిరీస్‌కు ప్రత్యేకమైన ఫ్యాన్స్ ఉన్నారు. వారిని సర్‌ప్రైజ్ చేస్తూ తాజాగా ఒక వీడియోను మేకర్స్ విడుదల చేశారు. తొలి సిరీస్ 2019లో విడుదల కాగా.. రెండో సీజన్ 2021లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ రెండు సిరీస్‌లు సూపర్ హిట్ కావడంతో ది ఫ్యామిలీ మ్యాన్ నుంచి మూడో భాగం త్వరలో విడుదల కానుంది. ఈ క్రమంలో తాజాగా గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్‌లో మనోజ్ బాజ్‌పాయ్ కీలక పాత్ర పోషించారు. ఆయనకు జోడీగా ప్రియమణి నటించారు. రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహించారు. త్వరలోనే అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా అందుబాటులోకి రానుంది.ఈ సిరీస్ తొలి సీజన్ భారత్‌పై ఉగ్రవాదులు పన్నిన కుట్రలు, దాడులను అడ్డుకోవడం వంటి అంశాల చుట్టూ సాగుతుంది. రెండో సీజన్ తమిళ్ టైగర్స్‌పై చేసే ఆపరేషన్? వంటి కాన్సెప్ట్ ఉంటుంది.




## శోభిత.. నేను ఆ రూల్ ఫాలో అవుతాం: నాగచైతన్య

నటుడు నాగచైతన్య, నటి శోభితా ధూళిపాళ్ల గతేడాది చివర్లో వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. పెళ్లి తర్వాత కూడా సినిమాలు, సిరీస్‌లు చేస్తూ వీరిద్దరూ ఫుల్ బిజీగా ఉంటున్నారు. వ్యక్తిగత, వత్తిపరమైన జీవితాన్ని బ్యాలెన్స్ చేస్తూ ముందుకుసాగుతున్నారు. ఈ నేపథ్యంలోనే నటుడు నాగచైతన్య తాజాగా ఓ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పర్సనల్ లైఫ్ గురించి మాట్లాడారు. శోభితతో తన జీవితం సంతోషంగా సాగుతుందన్నారు. వారం మొత్తం వర్క్‌లైఫ్‌లో బిజీగా ఉన్నప్పటికీ.. వారాంతంలో మాత్రం వ్యక్తిగత జీవితానికే టైమ్ స్పెండ్ చేస్తామని చెప్పారు. ఒక విషయంలో మాత్రం కచ్చితమైన నియమాన్ని పాటిస్తామని తెలిపారు.''వర్క్ లైఫ్ కారణంగా మేమిద్దరం కలిసి టైమ్ స్పెండ్ చేయడానికి అంతగా వీలుపడదు. క్వాలిటీ టైమ్‌ను స్పెండ్ చేయడానికి, అనుబంధాన్ని పెంచుకోవడం కోసం మేమిద్దరం కొన్ని రూల్స్ పాటిస్తాం. ముఖ్యంగా మేమిద్దరం హైదరాబాద్‌లోనే ఉంటే తప్పకుండా ఉదయం, రాత్రి సమయాల్లో కలిసే భోజనం చేయాలని నిర్ణయించుకున్నాం. ఆదివారాల్లో మాకు నచ్చిన విధంగా ఉంటాం. మూవీ నైట్, షికారుకు వెళ్లడం, నచ్చిన ఫుడ్ ఆర్డర్ చేసుకోవడం, లేదా కుక్ చేసుకోవడం.. ఇలా ఆ క్షణాలను ప్రత్యేకంగా, మధురజ్ఞాపకంగా మార్చుకుంటాం. తనకు పుస్తకాలు చదవడం అంటే ఇష్టం. నాకు రేసింగ్‌పై ఆసక్తి. ఇద్దరం కలిసి హాలిడే ప్లాన్స్ వేస్తాం. ఇటీవల తనకు రేస్‌ట్రాక్‌పై డ్రైవింగ్ నేర్పించా. తను ఎంతో సంతోషించింది. ఎంజాయ్ చేసింది'' అని నాగచైతన్య చెప్పారు. తనకు నచ్చిన రియల్ లైఫ్ హీరోల గురించీ ఆయన మాట్లాడారు. రతన్‌టాటాను తాను అభిమానిస్తుంటానని చెప్పారు. ''నిజ జీవితంలో కొంతమంది వ్యక్తులను హీరోలుగా చూస్తుంటాం. నా కుటుంబం కాకుండా రతన్ టాటా అంటే నాకెంతో గౌరవం. ఆయన్ని ఒక స్ఫూర్తి ప్రదాతగా భావిస్తా. ఎలాన్ మస్క్ జీవిత ప్రయాణం నన్ను ఆశ్చర్యపరుస్తుంటుంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.